
# క్రొత్త నిబంధన యందలి పత్రికలలో పరిశుద్ధాత్ముని ప్రస్తావన - పరిచర్యలు




రచయిత

**టి.పి. వరప్రసాదరెడ్డి, B. E.,**



ప్రచురణ :

గాస్పెల్ అసెంబ్లి పబ్లిషింగ్స్

7-270 కోర్టు రోడ్,

అనంతపురం - 515 001.

ఫోన్ : 275070

సెల్ : 94402 85883.

# క్రొత్త నిబంధన యందలి పత్రికలలో పరిశుద్ధాత్ముని ప్రస్తావన - పరిచర్యలు


రచయిత

టి. పి. వరప్రసాదరెడ్డి, B.E.,



ప్రచురణ

గాస్పెల్ అసెంబ్లీ పబ్లిషింగ్

7-270 కోర్ట్ రోడ్,

అనంతపురం - 515.001

ఫోన్ :.275070, సెల్ : 9440285883

మొదటి ముద్రణ: ఆగష్టు 2005

వెల రూ. 20-00

ప్రతులకు
టి. పి. వరప్రసాదరెడ్డి,
13-1-175, రెవిన్యూ కాలని,
అనంతపురం - 515 001
సెల్ : 9440285883

*No part of our Publications may be Reprinted without our written Permission*

Designed & Type Setting :
*Logos Graphics,*
Rajendra Nager 3rd Line,
GUNTUR - 522 006 Ph : 2230827

Printed at :
*Jayaa Printers,*
GUNTUR. Ph : 5542514

# విషయసూచిక


| | గ్రంధము | పేజీ నెం. |
|---|---|---|
| 1. | రోమా పత్రిక | 6 |
| 2. | 1 కొరింథీయులకు | 21 |
| 3. | 2 కొరింథీయులకు | 47 |
| 4. | గలతీయులకు | 63 |
| 5. | ఎఫెసీయులకు | 80 |
| 6. | ఫిలిప్పీయులకు | |
| 7. | కొలస్సయులకు | |
| 8. | 1 థెస్సలోనిక | |
| 9. | 2 థెస్సలోనిక | 88 |
| 10. | 1 తిమోతి | |
| 11. | 2 తిమోతి | |
| 12. | తీతు | |
| 13. | ఫిలేమోను | |
| 14. | హెబ్రీ పత్రిక | 91 |
| 15. | యాకోబు | |
| 16. | 1 పేతురు | 102 |
| 17. | 2 పేతురు | |
| 18. | 1 యోహాను | |
| 19. | 2 యోహాను | 110 |
| 20. | 3 యోహాను | |
| 21. | యూదా | |

# క్రొత్తనిబంధన యందలి పత్రికలలో పరిశుద్ధాత్ముని ప్రస్తావన

బైబిలు గ్రంథమంతటిలో సుమారు 550 పర్యాయములు క్రొత్తనిబంధన అంతటిలో సుమారు 294 పర్యాయాలు ఆత్మప్రస్తావన ఉన్నది. మత్తయి నుండి ప్రకటన వరకు 3వ యోహానులో తప్ప ప్రతిగ్రంథంలో ఆత్మను గురించి వ్రాయబడింది. క్రొత్త నిబంధనలోని 27 గ్రంథాలలో 260 అధ్యాయాలున్నాయి. దాదాపు 294 పర్యాయములు ఆత్మను గురించి ప్రస్తావించబడింది. అనగా సగటున ప్రతి అధ్యాయంలో ఒకసారి కన్పించుచున్నది.

| గ్రంథము | ఆత్మ అను పదము కనిపించుట | అధ్యాయములు |
|---|---|---|
| మత్తయి | 10 | 28 |
| మార్కు | 17 | 16 |
| లూకా | 21 | 24 |
| యోహాను | 17 | 21 |
| అ.పొ. కార్యములు | 24 | 28 |
| రోమా పత్రిక | 36 | 16 |
| 1 కొరింథి | 40 | 16 |
| 2 కొరింథి | 12 | 13 |
| గలతీ | 18 | 6 |
| ఎఫెసీ | 13 | 6 |
| ఫిలిప్పీ | 04 | 4 |
| కొలస్సి | 4 | 4 |
| 1 థెస్సలోనిక | 5 | 5 |
| 2 థెస్సలోనిక | 2 | 3 |
| 1 తిమోతి | 3 | 6 |

| | | |
|---|---|---|
| 2 తిమోతి | 2 | 4 |
| తీతు | 2 | 3 |
| ఫిలేమోను | 1 | 1 |
| హెబ్రీపత్రిక | 8 | 13 |
| యాకోబు | 3 | 5 |
| 1 పేతురు | 16 | 5 |
| 2 పేతురు | 1 | 3 |
| 1 యోహాను | 13 | 5 |
| 2 యోహాను | 1 | 1 |
| 3 యోహాను | – | 1 |
| యూదా | 1 | 1 |
| ప్రకటన | 20 | 22 |
| మొత్తము | 294 | 260 |

# రోమా పత్రికలో పరిశుద్ధాత్మ పరిచర్యలు

ఇందులో 36 సార్లు ఆత్మ ప్రస్తావన ఉంది. 8వ అధ్యాయంలోనే 23 పర్యాయములు ఉంది. కనుక ఈ అధ్యాయము ఆత్మను గురించి నేర్చుకొనుటకు ఎంతో ప్రాముఖ్యమైనది. 8వ అధ్యాయములో 39 వచనములు ఉన్నవి. 27వ వచనముతో పరిశుద్ధాత్ముని ప్రస్తావన ఆగిపోతుంది. అంటే 27 వచనములలోనే 27 పర్యాయాలు ఆత్మ అను పదము ఉన్నది. ఈ వచనములలో పరిశుద్ధాత్ముని చర్యలు ఎన్నో ఇమిడి వున్నవి. ముందు ఈ భాగాన్ని చదువుదాం.

మరియు హృదయములను పరిశోధించువాడు ఆత్మయొక్క మనస్సు ఏదో ఎరుగును. (రోమా 8:27). ఈ వాక్యాన్ని బట్టి పరిశుద్ధాత్మునికి మనస్సు ఉందని తెలుస్తున్నది. మనకు కూడా మనస్సు ఉంది. మనకు శరీరము, ప్రాణము, మనస్సు ఉంది. కొన్నిసార్లు శరీరానికి ఏమీ కాకపోయినా మనస్సంతా నలుగుతుంది. మనస్సు

గాయపడుతుంది. మనస్సు విరిగిపోతుంది. ఇనుము విరిగితే అతకవచ్చుగానీ, మనస్సు విరిగితే అతకలేము అనే సామెత విని ఉంటాము.

అయితే పరిశుద్ధాత్మునికి కూడా మనస్సు ఉంది. మనస్సు మాత్రమే కాదు, స్వభావము కూడా ఉంది. (రోమా.8:9) పరిశుద్ధాత్ముడు మనస్సు కలిగినవాడు, స్వభావము కలిగినవాడు. హగ్గయి గ్రంథములో మీ మధ్యన నా ఆత్మ ఉన్నది. అని స్త్రీ వాచకంలో ఆత్మను గురించి చెప్పబడినది. కానీ మిగిలిన అన్ని సందర్భములలో పురుషవాచకంలో చెప్పబడింది. ఆత్మ ఒక వ్యక్తి ఒక పురుషుడు, తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అనే త్రిత్వములో ఒకరు.

ఆత్మకు రక్తమాంసాలు అక్కరలేదు. దేవుడు ఆత్మ గనుక అని చదువుతూ ఉంటాం. యేసుప్రభువు పునరుత్థానుడైన తరువాత ఈ లోకంలో ఉన్నపుడు ఆయనను చూచి లూకా 24:37-39లో భూతం అని శిష్యులు భయపడ్డారు. అప్పుడు యేసు నాలాగ ఎముకలు రక్తమాంసాలు ఆత్మలకు అనగా భూతమునకు ఉండవు అన్నాడు. అనగా మంచి ఆత్మలకు గాని, దురాత్మలకు గాని ఎముకలు, మాంసాలు ఉండవు. దేవునికి కూడా స్వాభావికముగా రక్తమాంసాలు లేవు. కానీ మన పాపాన్ని పరిహారం చేయుటకు ఆయన రక్తమాంసములలో పాలివాడయ్యాడు. (హెబ్రీ. 2:15) రక్తం చిందించకుండా పాపక్షమాపణ కలుగదు. కాబట్టి ఆత్మ అయిన దేవుడు రక్తాన్ని కలిగిన వాడుగా ఈ లోకానికొచ్చాడు. రక్తము పట్టిదే ఉండలేదు. రక్తం ఉండాలంటే శరీరం అవసరం.

నీళ్ళు ఉండాలంటే గ్లాసు అవసరం. గ్లాసు లేకుండా నీరు తేలేరు. అలాగే శరీరం లేకుండా రక్తం ఉండదు. అందుకే శరీరము ధరించుకొని అనగా రక్తమాంసములు కలిగినవాడై ఈ లోకానికొచ్చాడు. ఆత్మ అయిన దేవునికి శరీర మాంసాలు లేకపోయినా మనవలె మనస్సు ఉంది, స్వభావము ఉందని అర్థం చేసుకోవాలి.

క్రీస్తుయేసు నందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము పాపమరణముల నియమము నుండి నన్ను విడిపించెను (రో 8:2). ఈ వాక్యాన్ని బట్టి ఆత్మకు

నియమాలు ఉన్నాయని తెలుస్తున్నది. లోకంలో మనకు కూడా నియమాలు ఉన్నాయి. రోడ్డుపై వెళ్ళునపుడు రోడ్డు నియమాలు పాటించాలి. రోడ్డుకు ఎడమవైపు వెళ్ళాలి. కుడివైపు వెళ్ళడం నేరం. ఉద్యోగాలకు నియమాలు ఉన్నాయి. ప్రతి డిపార్టుమెంటుకు ఆయా నియమాలు ఉన్నాయి. విద్యాశాఖ, వైద్యశాఖలో పనిచేసేవారికి నియమాలు ఉంటాయి. అలాగే సంఘానికి వస్తే సంఘము యొక్క నియమాలు ఉన్నాయి. కుటుంబాలకూ నియమాలు ఉన్నాయి. స్త్రీల నియమాలు వేరు. పురుషుల నియమాలు వేరు. అలాగే పరిశుద్ధాత్మ దేవునికి కూడా నియమాలు ఉన్నాయి.

రోమా **8:2**, ఇక్కడ ఇంకో నియమము కనిపిస్తాంది. పాపమరణముల నియమము **7:27**లో పాపనియమము కనిపిస్తుంది. అందులోనే దైవనియమము కూడా కన్పిస్తుంది. దైవనియమమును ఇంగ్లీషులో రెగ్యులేషన్ అంటున్నారు. అనగా చట్టము అని అర్థము. లోకానికి చట్టాలు ఉన్నాయి. పాపానికి కూడా చట్టముంది. ఇది పాపమరణముల నియమము అను పేరుతో పిలువబడుతున్నది. పాపనియమం ఒకటి, పాపమరణముల నియమం మరొకటి. దైవనియమము, ఆత్మ నియమము ఇంకొకటి. శరీర విషయంలో పాపనియమమునకు దాసుడను **(7:25)** అంటున్నాడు. పాపనియమము మనుష్యులను దాసులనుగా చేసుకుంటున్నమాట.

ఒక మనుష్యుని ముందు పాపాన్ని, నీతిని ఉంచామనుకోండి. దేనిని కోరుకుంటాడు. మనుష్యులకు కనిపించే విధంగా నీతిని కోరుకున్నట్లు నటిస్తాడు. కాని హృదయంలో పాపాన్నే కోరుకుంటాడు. దేవుడు పాపాన్ని, నీతిని నీ ముందు పెడుతున్నాను, నీతిని కోరుకోనండి అని అంటున్నాడు. ఎంతచెప్పినా మనుష్యుడు పాపమే చాలాసార్లు కోరుకుంటాడు. మనము పాపములోనే పుట్టుచున్నాము. పాపంలోనే పెరుగుచున్నాము. పాపంలోనే మరణిస్తున్నాము అనే మాటలు మనము చాలాసార్లు వింటూనే ఉంటాము.

మానవుడు పుట్టినపుడే పాప అని పేరు పెట్టుచున్నారు. పాప అనియో, పాపోడు అనియో పిలుస్తారు గదా. ఆ పదాలు పుట్టినపుడే పాపి అని సూచిస్తున్నాయి అని ఒక భక్తుడు తమాషాకు అన్నా అందులో ఎంతో సత్యముంది!

కనుక మానవుడు పాపి. పాపనియమము మనుష్యులను దాసులుగా చేస్తుంది. నాలో పాపం లేదని ఎవరైనా చెప్పగలరా? చెప్పగల వాడు ఒక్కడే. ఆయనే యేసుక్రీస్తు. ఆయన నాయందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపిస్తాడు అని జనులను ప్రశ్నించాడు. ఎవరూ నోరెత్తలేదు. ఒకవేళ నేనే నాలో పాపముందని ఎవడు స్థాపిస్తాడు అన్నాననుకోండి. నా పాపాన్ని చూపించేవారు నన్ను చూసినవారు ఎందరో ఉంటారు. మనము ఎవరమైనా సరే పాపనియమమునకు దాసులమై ఉన్నాము.

పాపమరణముల నియమము మరొకటి. పాపమునకు వచ్చు జీతము మరణం అని, పాపము, మరణములను కలిపిన దేవుని వాక్యం (రోమా 6:23) ఉంది. రోమా 5:11లో ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరూ పాపము చేసినందున మరణము అందరికి సంప్రాప్తమాయెను. ఇదే పాపమరణముల నియమము. మరణము ఎందరికి? అందరికి. క్రైస్తవులకేమి, క్రైస్తవేతరులకేమి మరణం ప్రాప్తించింది. ఏ కుటుంబంలో పుట్టినా, పాస్టర్ కుమారులైనా, వేదాంతులైనా, సిద్ధాంతులైనా మరణానికిలోనై యున్నారు.

యోహాను 8:21లో ఒకసారి యూదులు యేసుప్రభువు వద్దకు వచ్చారు. యేసుప్రభువు కూడా యూదుడే. యూదులు యూదులు కలుసుకుంటే ఏమి మాట్లాడుతారు? మనలను మనం కలుసుకుంటే ఏమంటాము. బంధుత్వాలు కలుపుకుంటాము. అన్నా, బావ, తాత అని పిలుచుకుంటాము. యేసుప్రభువు కంటె పెద్దవాళ్ళు వచ్చి ఉంటే తమ్ముడా అని పిలిచి ఉండవచ్చు. చిన్నవాడు అయితే అన్నా అని పిలిచి ఉండవచ్చు. కాని ఆయన మొహమాటం లేకుండా మీరు పాపంలో ఉండి చనిపోవుదురు అన్నాడు. పాపమరణముల నియమములో మీరు ఉన్నారు. నేను వెళ్ళే స్థలమునకు మీరు రాలేరు అన్నాడు. ఆయన వెళ్ళే స్థలం పరలోకం. అంటే పరలోకానికి మీరు రాలేరు అన్నాడు.

వారు బంధుత్వాన్ని బట్టి మేము యూదులము అని వచ్చి, బంధుత్వాన్ని బట్టి ఆ మాటలు మాట్లాడి ఉండవచ్చు. వచ్చినప్పుడు అమ్మ బాగుందా? నాయన

బాగున్నాడా? తమ్ముడు, చెల్లెలు బాగున్నారా అని అడిగి ఉండవచ్చు. ప్రభువు అవన్ని కాక మీరు పాపంలో ఉన్నారు, చనిపోతే నేను వెళ్ళు పరలోకమునకు మీరు రాలేరు అని, పాపమరణముల నియమము క్రింద ఉన్నారని అన్నాడు.

యూదులలాగానే యాకోబు, యోసేపు, బెన్యామీను, రూబేను, శాంతమ్మ, గ్రేసమ్మ ఇలాంటి పేర్లే మనవి కూడా. పేర్లు ఏవైనా, నీవు ఎవరివైనా, ఎవరికి బంధువైనా ప్రభువు చెప్పిన మాట ఆలోచన చేయండి. మీరు పాపములలోనే ఉన్నారా? విడిపించబడ్డారా?

రోమా **8:2**, ఆత్మయొక్క నియమము పాపమరణముల నియమము నుండి నన్ను విడిపించెను. పరిశుద్ధాత్మ మనలను విడిపించాడు. పరిశుద్ధాత్మ ద్వారా ఆయన నియమము ద్వారా పాపమరణముల నియమము నుండి విడిపించబడ్డాము అని మీరు చెప్పగలరా? ప్రార్థన సమావేశాలకు వెళ్ళడం మంచిదే, వాక్యం వినడం మంచిదే. పాపమరణముల నియమము నుండి విడిపించబడ్డాను అనే అనుభవానికి తప్పక వచ్చి ఉండాలి. లేకపోతే లాభం లేదు.

పాపమరణముల నియమం నుండి విడిపించబడ్డాను అనేవారు **8:15** లోని మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను మీరు పొందలేదు గాని దత్తపుత్రాత్మను పొందితిరి అన్న వాక్యాన్ని గమనించాలి. ఆత్మను మనము పొందగలము. ఎలా పొందుతాము? ఎప్పుడు పొందుతాము? ఎఫెసీ **1:13** గమనించండి. మీరును సత్యవాక్యమును అనగా మీ రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రించబడితిరి. ఆత్మచేత ముద్రింపబడుట ఎప్పుడు జరుగుతుంది? క్రీస్తునందు విశ్వాసముంచినపుడే. విశ్వాసముంచని వారిలో ఆత్మ ముద్ర లేదు.

ఆత్మను ఎప్పుడు పొందుతాము? క్రీస్తునందు విశ్వాసముంచినపుడే. అంటే విశ్వాసముంచిన నెలకా? ఆ వచనం బాగా గమనించండి. ఆ వచనం మధ్యలో ఫుల్‌స్టాప్ లేదు. ఉంటే కొంతసమయం ఉండేది. క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానం చేయబడిన

ఆత్మచేత ముద్రింపబడితిరి అనిన తరువాత ఫుల్‌స్టాప్ ఉన్నది. కాబట్టి విశ్వాసముంచుట, ఆత్మను పొందుట రెండూ ఒకేసారి జరుగుతాయి. ఆత్మనియమం క్రిందికి ఎప్పుడు వస్తాము? యోహాను 16:8 ప్రకారము ఆత్మ పాపమును గూర్చి ఒప్పిస్తాడు. పాపమును ఒప్పుకొనుట ద్వారా పాప క్షమాపణ కలుగును. ఎఫెసీ. 1:13 ప్రకారము విశ్వాస ముంచగానే ఆత్మనియమం క్రిందికి వస్తున్నాము. అప్పుడే పాపనియమము నుండి ఆత్మనియమము మనలను విడిపించివేస్తుంది. ఆత్మ ముద్రకూడా పడుతున్నది.

చాలాసార్లు మనము భూములను, ఇండ్లను కొనడం లేదా అమ్మడం చేస్తూ ఉంటాము. దస్తావేజులపై ఆఫీసులో ముద్రవేసినపుడే చెల్లుతాయి. అప్పటినుండే ప్రారంభం. అలాగే పాపమరణాల నియమం నుండి ఆయన మనలను విడిపించాడు అనుటకు ముద్ర వేస్తున్నాడు.

ముద్రవేయక ముందు పొలాన్ని వెనుకకు తీసుకోవడం వీలవుతుంది గానీ ముద్ర వేస్తే వెనుకకు తీసుకొనుట కుదరదు. ముద్ర స్థిరపరచుటకు గుర్తు అన్నమాట. అలాగే పరిశుద్ధాత్మ దేవుని నియమము క్రిందికి నీవు రాగానే పరిశుద్ధాత్ముని పొందుచున్నావు, పరిశుద్ధాత్ముని చేత ముద్రింపబడుచున్నావు.

ఎఫెసీ 4:30 దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి. దేవుని ఆత్మకు మనస్సు ఉంది అని ముందు ధ్యానించాము. ఆ మనస్సుకు ఏమి కలుగుతుంది? దుఃఖము కలుగుతుంది. కనుక ఆయన మనవంటివాడు అని గుర్తుంచుకోవాలి. ఆయన దుఃఖపడగలడు. ఎఫెసీ 4:30 దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి. విమోచన దినము వరకు మీరు ఆయన యందు ముద్రింపబడి ఉన్నారు. ఆయన మనలోనికి విశ్వాసముంచినపుడే వచ్చాడని ధ్యానించాము. అలాగే విశ్వాసముంచినపుడే. పాపమరణముల నియమము నుండి విడిపించాడు. అంతమాత్రమే కాదు. విమోచన దినము వరకు మనలను ఆయన ముద్రించాడు అని గమనించగలము. ఆయన మీతో కూడా ఉండును. యోహాను 14:17. యోహాను 14:16లో మీ యొద్ద ఎల్లప్పుడు

ఉండును. కనుక పరిశుద్ధాత్మ విశ్వాసముంచినపుడు మనలోనికి వచ్చి, మనలోను, మనతోను, మనయొద్ద ఎల్లప్పుడు వుండునని నేర్చుకొనుచున్నాము.

ఒకరోజు దేహం నుండి మనకు విమోచనము కలుగుతుంది. ఒకవేళ ప్రభువు మన దినాలలో ఈ లోకానికి వస్తే ఈ మట్టి దేహమును యిలానే విడిచిపెట్టి వెళ్ళిపోతాము. పాము కుబుసమును విడిచి వెళ్ళినట్టుగా వెళ్ళిపోతాము. ఆయన రాలేదు అనుకోండి. మట్టి దేహమును మట్టిలోనే విడిచిపెట్టివెళ్ళిపోతాము. కాని ఆయన వచ్చినపుడు మహిమ దేహం గలవారమై అంటే ఈ మట్టిదేహం మహిమదేహంగా మార్చబడి ఆయన దగ్గరకు వెళ్ళిపోతాము. దీనినే దేహం యొక్క విమోచన అంటాము.

రోమా **8:23**లో మనదేహము యొక్క విమోచన అని ఉన్నది. దేహము యొక్క విమోచనము పొందేదినము ఒకటి ఉన్నది. అంతవరకు పరిశుద్ధాత్ముని ముద్ర మనమీద ఉంటుంది. ఈనాడు క్రైస్తవ కోటిలో దీనిని గురించిన తప్పుడు బోధలెన్నో ఉన్నాయి. ఆత్మను పొందుట వేరు. ఆత్మ వస్తూ ఉంటాడు పోతూ ఉంటాడు. అనే వాళ్ళు కూడా ఉన్నారు. ఇప్పుడు మీరే చెప్పండి అలావుందా బైబిల్‌లో, ఎంతవరకు ఆత్మ ముద్ర మనమీద ఉంటాడు. విమోచన దినం వరకు ముద్రించబడి ఉంటాము.

ఇశ్రాయేలీయులు ఎవరైనా భూమిని కొనుక్కొంటే **50** ఏండ్లే. **49** సం॥లు అయిన తరువాత **50**వ యేట కొనుకొన్నవాడు విడిచిపెట్టాలి. మనదేశములో అలాకాదు. భూమిని కొనుక్కొంటే శాశ్వతకాలం కొనుక్కుంటాము. అలాగే పరిశుద్ధాత్ముడు మిమ్మును కొన్నాడు. నీలోనికి వచ్చాడు. నీవు ఆయనలో ఉన్నావు. సదాకాలానికి విమోచించి ఉన్నాడు. విమోచన దినము వరకు ఆయన మనమధ్యలో ఉంటాడు.

రోమా **15:13** పరిశుద్ధాత్మ శక్తిపొంది........ సమాధానముతో నింపుగాక. అంటే జరగబోయేకాలంలో అని అర్థము. పరిశుద్ధాత్మను పొందితిరి అంటే జరిగిపోయింది. ఇక్కడ పరిశుద్ధాత్మ శక్తిని పొంది నింపబడుదురుగాక అని ఉంది. పరిశుద్ధాత్మను మనం పొందాము. నింపబడుదురు అంటే ఆత్మను పొందడము వేరు, నింపబడడము వేరు అని మనము చూస్తూ ఉన్నాము. ఈ విషయం కొద్ది ఆలోచిస్తాము.

ఆయన మనలను నింపుతూ ఉంటాడు. మన ఇండ్లలో మంచినీరు ఉంచే పాత్రలు ఉంటాయి. (కుండలు, బానలు, వాటర్‌ట్యాంక్ మొ॥వి). నీటి కనెక్షన్ ఒకేసారి పొందుతాము. ఉదయాన్నే పాత్రలను నీటితో నింపుతూ ఉంటాము. సాయంకాలానికి సగము అయిపోవచ్చు. మళ్ళీ నింపుకుంటాము. అయిపోతుంటే నింపుకుంటూ ఉంటాము. అలాగే ఆత్మ నింపుదల కూడా! ఆత్మను ఒకసారి పొందినవారు ఎప్పుడూ నిండుగా పొందిఉంటామని మోసపోవద్దు. నింపుదల ఎప్పుడూ మనలో జరుగుతూ ఉండాలి. ఆత్మను పొందుట ఒకేసారి, నింపుదల నిత్యము.

ఉదాహరణకు మనము రక్షించబడి 30 ఏండ్లు అయిందనుకోండి. ఎందుకో మనకు తొందర వచ్చి, కోపపడ్డాము. మరలా పాత బూతులు మన నోటికి వచ్చాయి. రాకూడదు. ఆత్మ నింపుదల ఏమైందన్నమాట? తగ్గిపోయింది. బూతూలు మాట్లాడుటకు దేవుడు సెలవు ఇవ్వలేదు. గుర్తుంచుకోండి. నోటికి బూతులు వచ్చే సందర్భాలు మన ఆంధ్రలో కొద్దిమందిలో కనిపిస్తూ ఉంటాయి. కొద్దిమందికి స్వాభావికముగా బూతులు వస్తూ ఉంటాయి. కొద్దిమందికి కఠినమయిన మాటలు వస్తూ వుంటాయి. కొంతమంది రౌద్రము చేత నింపబడి ఉంటారు. అంటే మన నింపుదల ఏమైంది? తగ్గింది. నీతో నేనెందుకు మాట్లాడాలని ఒకరంటే, నీవు మాట్లాడకపోతే నేనెందుకు మాట్లాడాలి. నేనేం తక్కువా, నేనంటే ఏమనుకున్నావు అని ఇంకొకరంటారు. ఇలా ఒక్కొక్కసారి మాట్లాడతారు. అంటే ఆత్మ నింపుదల తగ్గిందన్నమాట. ఎలా సరిచేసుకోవాలి?

పాతనిబంధన గ్రంథంలో సంఖ్యా 28:3-4 వ. ప్రతినిత్యము, ప్రతి ఉదయం, ప్రతి సాయంకాలము బలి అర్పించాలని ఉంది. ప్రతి ఉదయం మనం నింపబడాలి. ప్రతి సాయంత్రం నింపబడాలి. కొన్నిసార్లు ఉదయం నుంచి సాయంకాలానికి ఆత్మలో తగ్గిపోతుంటాము. కొన్నిసార్లు ఈ గంటలో నింపబడి మరికొన్ని గంటలలో తగ్గిపోయి ఉండగలము. అందుకే ఎల్లప్పుడు మనము ఆత్మలో నింపబడి ఉండే అనుభవం కలిగివుండాలి.

ఒక భక్తుడు ఆత్మ విడుదల అనే పుస్తకం వ్రాశాడు. చాలా ఏండ్ల క్రితము నేను చదివాను. అందులో నాకు అర్థమైన ఒక సత్యం ఉంది. ఆత్మయొక్క విడుదల అంటే విడిపించడము అని. ఒకవ్యక్తిని విడిపించాలి అంటే ముందుగా అతను బంధింపబడినాడు అని అర్థము కదా! మనలో ఆత్మ ఉన్నాడు. మన హృదయంలో ఆత్మ ఉన్నాడు. నా కుమారుడా నీ హృదయం నాకిమ్ము అన్నాడు. హృదయం ఇవ్వగానే ఆయన లోపలికి వచ్చాడు. కానీ మీరు ఆయన కాళ్ళు, చేతులు కట్టివేసారన్నమాట. మీ మాటలు మార్చుకోవాలి అని ఆయన చెబుతూ ఉన్నా నీవు అట్లా ఉండు కాసేపు అని ఆయన కాళ్ళు, చేతులు కట్టివేసి అనగా పరిశుద్ధాత్మకు విధేయత చూపకుండా మనమే మాట్లాడుతున్నాం.

ఎఫె. **4.30** దేవుని ఆత్మను దుఃఖపరచకుడి. ఆత్మను అలాకట్టి పడవేస్తే ఆయన దుఃఖపడుతూ ఉంటాడు. మనలో ఉన్న ఆత్మకు మనము విడుదల కలుగుజేయువాళ్ళముగా ఉండాలన్నాడు.

బట్టలకొట్టులో ఒక బలవంతుడు ఉన్నాడనుకోండి. బట్టలు వాడి చుట్టూ గట్టిగా చుట్టాము. ఎంత బలవంతుడైనా కదలలేదు. ఆ కట్టు విప్పివేయండి. సంపూర్ణమైన శక్తిగల కార్యాలు చేయగలడు. మనలో పరిశుద్ధాత్మ దేవుడు ఉన్నాడు కాని తనశక్తిగల కార్యాలు మనలో చేయలేకపోతున్నాడు. పరిశుద్ధాత్మ దేవున్ని మనము పనిచేయనివ్వలేదు.

ఎందుకు మనమధ్య శక్తిగల కార్యాలు లేవు అని మేము మా యింటిలో ఆలోచించాము. ఎన్నో మీటింగులు పెడుతున్నాము. ఎన్నో ప్రసంగాలు చేస్తున్నాము. ఎంతో కష్టపడుతున్నాము. ఆంధ్రరాష్ట్రంలో ఎంతోమంది సేవకులు ముందుకు వస్తున్నారు. కాని శక్తి ఉందా? తగ్గిందనిపిస్తోంది. ఇది వాస్తవంగా మనము ఆలోచించాలి. శక్తి తగ్గడానికి కారణం ఏమంటే మనలోని పరిశుద్ధాత్మునికి సంపూర్ణమైన స్వేచ్ఛ మనము ఇవ్వలేదు.

రోమా **15:19**లో పరిశుద్ధాత్మ బలము చేత అని ఉంది. అపొస్తలులు ఆత్మబలము చేత సూచకక్రియలు చేశారు. మహత్కార్యాలు జరిగించారు. క్రీస్తు యొక్క

సువార్తను ప్రకటించారు. ఆత్మయొక్క బలమైన కార్యాలు తమ జీవితంలో అనుభవించారు.

ఆత్మ కార్యాలు అంటే కళ్ళకు కనిపించే సూచక క్రియలే కాదు. చదువులేని పేతురు ప్రసంగిస్తే మూడువేలమంది రక్షించబడ్డారు. ఈ దినాలలో ఇలాంటి పరిశుద్ధాత్మ కార్యాలు లేవు. మనము మీటింగ్ పెడితే మూడువేలమంది రావడం లేదు.

మూడువేల మైళ్ల నుండి దొరలు వస్తున్నారు మన మధ్యకు. కాని మూడువేలు మంది మనుష్యులు కూడికలకు రావడం లేదు. కనీసం మూడువందల మంది కూడా రావడం లేదు. కారణము ఏమిటి చెప్పండి. శక్తి తగ్గినది. శక్తితో నింపబడి ఆత్మకార్యాలు చేద్దాము.

ఆత్మ నియమము క్రింద మనము ఉన్నామని, పాపమరణముల నియమము నుండి ఆయన మనలను విడిపించాడు అని, ఆత్మను పొందామని, నింపబడుట అనుదినము జరుగవలసిన అనుభవము అని తెలుసుకున్నాము.

రోమా **8:2** లో ఆత్మ యొక్క నియమము పాపమరణముల నియమం నుండి నన్ను విడిపించెను అనుమాట మళ్ళీ జ్ఞాపకం తెచ్చుకుందాము. 7:25 చివరలో పాపనియమమునకు దాసుడనై ఉన్నాడు అంటున్నాడు. పాపమరణముల నియమము నుండి విడిపించాడు అన్నాము. అయితే విడిపించబడిన మనము ఇంకొకరికి దాసులం ఎల్లా అవులాము. మనము విడిపింపబడలేదా?

పాపనియమానికి వచ్చు జీతము మరణం నుండి విడిపింపబడ్డాము. అంటే అగ్నిగుండం తప్పిపోయింది. నిజమే. కాని పాపనియమం క్రింద మనము ఇంకా ఉన్నాము. రోమా **7:24** లో అయ్యో నేనెంత దౌర్భాగ్యుడను. ఇట్టి మరణమునకు లోనగు శరీరం నుండి నన్నెవడు విడిపింపగలడు? అంటున్నాడు. నేను చేయ నిచ్ఛయించునది చేయక ద్వేషించునదియే చేయుచున్నాను అంటున్నాడు. అట్లయితే చేసేది నేను కాదు. నాయందు నివసించు పాపమే అంటున్నాడు. **8:9** లో దేవుని ఆత్మ మీలో నివసించిన యెడల అని వుంది. ఆత్మ నివసిస్తున్నాడు. పాపము కూడా నివసిస్తున్నది. ఏమి చెయ్యాలి?

రోమా 7:25లో మనస్సు విషయంలో నేను దైవనియమానికి, శరీర విషయంలో పాపనియమానికి దాసుడనై ఉన్నాను అంటున్నాడు. మన ఆత్మను దేవుని ఆత్మ దేవుని నియమంతో నడిపిస్తున్నాడు. మన శరీరాన్ని పాపం తన నియమముతో నడిపిస్తున్నది. ఈ విషయం బాగా అర్థము చేసుకోవాలి. మనలో వున్న ఆత్మనియమము మన ఆత్మను నడిపించుచుండగా మనలో వున్న పాపనియమము మనశరీరాన్ని నడిపించుచున్నది.

ఆత్మనియమము ఉదయమే లేచి ప్రార్థన చేసుకోవాలి అని చెబుతుంది. పాపనియమం తొందరేమీ లేదు. ఇంకా కొద్దిసేపు పడుకోమంటుంది. ఇలా ఆత్మ శరీరానికి, శరీరము ఆత్మకు వ్యతిరేకంగా ఉంటాయి అని గలతీ 5వ అధ్యాయం చెప్తుంది.

గలతీ 5:16 నుండి 22 వరకు ఆత్మకు, శరీరానికి పోరాటాన్ని వివరిస్తూ 22వ వచనంలో ఆత్మఫలాన్ని, 23-24లో శరీరకార్యాలను స్పష్టపరుస్తున్నాడు. మనలో ఆత్మనియమం, పాపనియమం ఉంది. ఆత్మ నియమము మనలను పాపనియమం నుండి విడిపించిన మాట నిజమే. కాని పాపనియమం ఇంకా మనశరీరంలోనే ఉంది అని గుర్తుంచుకోవాలి.

మన ఆత్మ, మనిషి ఆత్మ మరియు దేవుని ఆత్మ నియమాల క్రింద నడుచున్నాడు. మన శరీరం పాపనియమానికి దాసుడైయున్నాడు. పౌలు తన అనుభవాన్ని గూర్చి, తన్ను గూర్చి చెప్పుచున్నాడు. పౌలు తన గూర్చి చెపుతున్నపుడు మనము అలా చెప్పకూడదు అని చెప్పుటకు వీలులేదు. మనకంటె ఉన్నతమైన యోగ్యుడైన పౌలే పాపనియమమునకు దాసుడనై యున్నాను అని చెప్పుచున్నాడు. ఇట్టి నియమమునకు లోనైన మనము ఎలా విడిపింపబడాలి? రోమా 8:11 చదవండి. మృతులలో నుండి యేసును లేపిన వాని ఆత్మ మీలో నివసించినయెడల మృతులలో నుండి క్రీస్తుయేసును లేపినవాడు చావుకులోనైన మీ శరీరములను కూడా మీలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింపజేయును.

ఆత్మ, ఆత్మ నియమం ద్వారా మీ ఆత్మను నడిపిస్తాడు. మీ శరీరములను కూడా జీవింపచేయగలడు. ఇదే గలతీలో ఆత్మచేత శారీరక క్రియలు చంపండి అని వ్రాయబడి

వున్నది. 8:10 క్రీస్తు మీలో ఉన్న యెడల మీ శరీరము పాపము విషయమై మృతమైనది గాని మీ ఆత్మ నీతి విషయమై జీవము కలిగియున్నది. పాపనియమము నీలో ఉన్నా పాపం నీ శరీరంలో కనబడకూడదు.

రోడ్డుమీదకు వెళ్ళితే రోడ్డు నియమాలు ఉన్నాయి. కుడివైపు వెళితే తప్పు. ఎడమవైపు వెళ్ళాలి అనే నియమము ఉంది. కుడివైపుకు వెళ్తున్నామనుకో నీవు అపరాధిగా తీర్పుబడలావు, ఎడమవైపు వెళ్తే అపరాధిగా తీర్పుబడవు.

అలాగు పాపనియమము నీతోవుంది. పాపనియమము ఉన్నా ఆత్మనియమముల ద్వారా మనము నడవాలి. శరీరం పాపం విషయమై చచ్చిపోవాలి. ఆత్మనీతి విషయమై జీవిస్తూ ఉండాలి. అంటే మనము ఎప్పుడూ మనలో పాపనియమము ఉన్నది అనే సంగతిని జ్ఞాపకముంచుకోవాలి. దేవుని ఆత్మయొక్క నియమము పాప మరణాల నియమము నుండి విడిపించిన మాట వాస్తవమైనా పాపనియమము ఇంకా నీలో ఉంది. పాపనియమానికి నీవు దాసుడవూ. కాని ఆత్మయొక్క నియమము ద్వారా నడవాలి. ఆత్మ ఇంకా నీలో నివసిస్తున్నాడు. ఇంకా కొంచెం ముందుకు వెళ్ళితే 14వ వచనంలో ఆత్మ నడిపిస్తాడు అని ఉంది. మిమ్ములను ఎలా నడిపిస్తున్నాడు. శరీయు నడిపిస్తున్నాదా? ఆత్మ నడిపిస్తున్నాదా?

మనము ఆత్మచేత నడిపించబడాలి. కాని తరచుగా శరీరం చేత నడిపింపబడుట గమనించగలం. మన శరీరంలో పాపం నివసిస్తూ పాపనియమానికి దాసత్వము చేస్తుందని విన్నాము. శరీరము నడిపిస్తే పాపానికే నడిపిస్తుంది. అందుకే ఆత్మచేత నడిపింపబడాలి. ఆత్మచేత నడిపింపబడేవారు దేవుని కుమారులు అనబడుదురు (రోమా 8:14).

మన ముఖ్యమంత్రి గారి కుమారుడు టౌన్‌లో రోడ్డుమీదకు వచ్చాడనుకోండి. రోడ్డు ప్రక్కన చెత్త కుండీలో తిని పారేసిన ఎంగిలి ఆకులు ఉన్నాయి. వాటిని బిక్షగాళ్ళు తింటున్నారు. ఎవరూ ఏమీ అనుకోరు. అదే ముఖ్యమంత్రిగారి కొడుకు వచ్చి తింటే ఎలా వుంటుంది? అధికారులు వచ్చి మీ నాన్న ఎవరనుకున్నావు బాబు అని మందలించి తీసుకొని వెళతారు.

అలాగే దేవుని ఆత్మచేత నడిపించుబడు వారు దేవుని కుమారులు. మన స్వభావం ఎట్లా ఉండాలి. **8:29** చూడండి. తన కుమారునితో సారూప్యము గల వారవుటకు మనలను నిర్ణయించాడు అని తెలుస్తున్నది. మనపట్ల దేవుని నిర్ణయము ఏమి? అని మనము చాలాసార్లు అనుకుంటూ ఉంటాము. మనము దేవుని స్వరూపానికి మారడమే మనపట్ల ఆయన నిర్ణయము.

మనము రోడ్డుమీద పోతూవుంటే ఈయన యేసుప్రభువులాగా ఉన్నాడే! అనుకోవాలి. ముఖ్యమంత్రి కుమారుడు పోతూ వుంటే ఠీవిగా, హుందాగా వెళ్తాడు. మనము దేవుని కుమారులమని గుర్తుంచుకొని మన ప్రవర్తనను జాగ్రత్తపరచుకోవాలి.

**8:15** గమనించండి. ఏలయనగా మరలా భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదు గాని దత్తపుత్రాత్మను పొందితిరి అని ఉంది. ఈ మాటలు ఆలోచించండి. మనము దేవునికి దత్తత తీసుకున్న పుత్రులము అని జ్ఞాపకముంచుకోవాలి. యోహా **8:44**లో మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు. మీ తండ్రి దురాశలు నెరవేర్చబోవుచున్నారు. వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడై ఉన్నాడు అని ఉంది.

లోకములో అబద్ధాలు చెప్పేవారందరికి వాడు తండ్రి. అట్లయితే అబద్ధాలు చెప్పేవారందరు వానికి కుమారులు. అబద్ధాలు చెప్పనివారు ఎవరూ లేరు. కనుక అందరు సాతాను కుమారులము. ఇటువంటి మనలను ఆయన తన ఆత్మద్వారా మరియు ఆత్మనియమము ద్వారా అబద్ధాలు, పాపాలు అనే నియమము నుండి విడిపించిన తరువాత ఆయన కుమారులమైనాము.

అనగా దత్తపుత్రులమైనాము. దత్తపుత్రులమై దత్తపుత్రాత్మను పొందాము. అక్కడ కూడా ఆత్మ ఉన్నాడు. ఒక వ్యక్తిని ఎవరైనా దత్తత తీసుకుంటే దత్తత తీసుకున్న వ్యక్తి ఆస్తి అంతా ఆ కుమారునికి చెందుతుంది.

స్వాభావికముగా దేవుని కుమారులము కాము..కానీ ఆయనను నమ్ముకొనుట ద్వారా దత్తపుత్రులమై దత్తపుత్రాత్మను పొందితిమి. ఆ ఆత్మ కలిగినవారమై మనము అబ్బా, తండ్రీ అని మొరపెట్టుచున్నాము అని రోమా **8:15** చెప్పుచున్నది.

అబ్బా అంటే తెలుగులో తండ్రి అని అర్థం కూడా ఉంది. అలాగే గ్రీకులో హెబ్రీలో తండ్రీ అని అర్థం. దేవుడు మనకు ఆయనను తండ్రీ అని మొరపెట్టే భాగ్యమిచ్చాడు. మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో చెప్పుచున్నాడు.

రోడ్డు ప్రక్క చెత్తకుండీలో ముఖ్యమంత్రి కుమారుడు తింటే అధికారులు నీవు ముఖ్యమంత్రి కుమారుడవు. ఇలా చేయకూడదు అని చెప్పినట్లు మనము పొరపాటు చేస్తే దేవుని ఆత్మ మన ఆత్మతో నీవు దేవుని కుమారుడవు. యేసుక్రీస్తు కుమారుడవు ఇలాంటి పనులు చేయకూడదు అని చెబుతాడు.

ఇద్దరు సోదరీలు మాట్లాడుకొనుట లేదు అనుకోండి. అయినను వారిద్దరు దేవుని కుమార్తెలే. దేవుడు ఇద్దరితో మాట్లాడుచున్నాడు. ఇద్దరిని దీవిస్తున్నాడు. ఇద్దరు సువార్తికులు మాట్లాడుకోలేదు అనుకోండి. దేవుడేమో ఇద్దరి పరిచర్యలను దీవిస్తున్నాడు. ఇద్దరు ఆయన కుమారులే. లూకా సువార్త 15వ అధ్యాయములో ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దవాడు ఇంట్లో ఉంటే చిన్నవాడు బయట ఉన్నాడు. చిన్నవాడు ఇంట్లోకి రాగానే పెద్దవాడు బయటకు వెళ్ళాడు. తండ్రి బయటకు వచ్చి పెద్దవాన్ని లోపలకు రమ్మని బ్రతిమాలాడు. నీవు కుమారుడవే వాడూ కుమారుడే అన్నాడు. ఇలా దేవుని ఆత్మ మన ఆత్మతో మనము దేవుని పిల్లలమని సాక్షమిస్తున్నాడు. ఈ సాక్ష్యము మనము ఎప్పుడూ కలిగి వుండాలి.

రోమా **8:26** అటువలె ఆత్మయు మనబలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఆత్మనీలో ఉన్న బలహీనతలు చూస్తుంటాడు. నాలో ఉన్న బలహీనతలను ఎవ్వరూ చూడలేదు అని అనుకొనవచ్చును. నా భార్యకు కూడా కనబడకుండా దాచిపెట్టగలను, నా బిడ్డలకు తెలియకుండా చేయగలను. నా స్నేహితులు చూడకుండా మూసిపెట్టగలను అనుకోవచ్చు. మనుషుల కళ్ళకు దాయవచ్చు. గాని ఆత్మ కళ్ళను దాచిపెట్టలేము. ఆత్మ కళ్ళతో పోల్చబడినది. ప్రకటన 5:6లో దేవుని ఏడునేత్రాలు అంటే ఏడు అనగా సంపూర్ణమైన దృష్టి గలవాడు. అంటే ఆయన దృష్టికి

మనబలహీనతలు కనిపిస్తున్నాయి. నాలో బలహీనతలు లేవు అన్నా! అని ఎప్పుడూ అనవద్దు. నాలో ఏమి తప్పు ఉంది బ్రదర్ అనేవాళ్ళు ఉన్నారు. నేను కరెక్ట్ బ్రదర్ దిద్దుకోవలసినది నేను కాదు ఆయనే దిద్దుకోవాలి అంటూ ఉంటాం.

2 దిన 16:9 తన యెడల యథార్థ హృదయము గల వారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది. సంపూర్ణమైన వారు గనుక ఆయన కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది. మనము అన్ని సమయాలలో అన్ని స్థలాలలో యథార్థముగా ఉండాలి. జకర్యా 4:10 కార్యములు అల్పములైయున్న కాలమును తృణీకరించిన వాడెవడు. లోకమంతటను సంచారము చేయు యెహోవా యొక్క ఏడు నేత్రములు జెరుబ్బాబెలు చేతిలో గుండు నూలుండుట చూచి సంతోషించును. ఏడు నేత్రములు అంటే సంపూర్ణముగా, సమస్తమును తేటగా చూస్తున్నాడుఅని అర్థము.

గుండునూలు తాపి పనివాని చేతిలో ఉంటుంది. గోడలను భవనములను చక్కగా నిర్మించుటకు అవసరము. సంఘము, మన జీవితము కట్టడముతో పోల్చబడినది. మరి మన జీవితాలను ఎలా కట్టుకుంటున్నాము. ఎక్కడ చూచినా కట్టడాలు ఎక్కువగా ఉన్నవి. ప్రతి సందులు, వీధులు కట్టడాలతో నిండిపో తున్నాయి. అమెరికాలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ సుమారు 130 అంతస్థుల భవనం అది కూల్చివేయబడింది. తిరిగి 150 అంతస్థుల ఉన్నత భవనం కట్టబోతున్నారు. మన జీవితాన్ని దేవునిలో ఉన్నతముగా కట్టుకోవాలి.

అలాగే ఇద్దరం కలసినప్పుడు మూడోవాని బలహీనతను గురించి మాట్లాడుతూ ఉంటాం. కాని రోమా 8:26లో పరిశుద్ధాత్ముడు మనబలహీనతలు చూచి సహాయం చేస్తాడు. మనకు పరిశుద్ధాత్మకు ఎంత తేడానో చూడండి. మనము కూడా అలా ఉండాలి.

ఒక భక్తుని సేవ గురించి ప్రయాస గురించి చెబితే ఇతరులకు పురికొల్పు కలుగుతుంది. అతని బలహీనతలు చెబితే ఇతరులకు నిరుత్సాహము కలిగి ఆయనే అలా ఉంటే నేనెంతలే అని ఇంకా దిగజారిపోతారు. కనుక ఇతరుల బలహీనతలను చూచి ప్రచారము చేయక వారికి సహాయము చేయువారముగా ఉందుము గాక.

# 1 కొరింథీ పత్రికలోని పరిశుద్ధాత్ముని పరిచర్యలు

1 కొరింథీ పత్రికలో ఆత్మను గురించి 40 పర్యాయాలు కనిపిస్తుంది. కాని అందులో జ్ఞానాత్మ అని, మన ఆత్మ అని మనుష్యాత్మ అనే పదాలు 6 లేక 7 పర్యాయములు కనిపిస్తాయి. మిగిలిన 33 పర్యాయములు పరిశుద్ధాత్ముని పరిచర్యల గురించి ప్రస్తావించబడినవి.

12:3లో దేవుని ఆత్మ, పరిశుద్ధాత్మ అను పదాలు అగుపిస్తాయి. దేవుని ఆత్మ, పరిశుద్ధాత్మ యేసు ఆత్మ, ప్రభువు ఆత్మ, క్రీస్తు ఆత్మ అను పదాలన్నీ ఒకటే. ఈ పదాలు 1 కొరింథిలో 33 పర్యాయాలు కనిపిస్తాయి. ఆ 33 పర్యాయాలలో పరిశుద్ధాత్ముని పరిచర్యలను గురించి దేవుడు మనకు ఏరీతిగా బోధిస్తున్నారో మనం చూడగలం.

12:3లో దేవుని ఆత్మ వలన మాటలాడినవాడు, ఎవడును యేసు శాపగ్రస్తుడని చెప్పడనియు, పరిశుద్ధాత్మ వలన ఎవడును యేసుప్రభువని చెప్పలేడనియు, నేను మీకు తెలియజేయుచున్నాను అని ఉంది. దేవుని ఆత్మవలన ఎవరైనా యేసును శాపగ్రస్తుడు అని చెప్పడు అంటే యేసును తృణీకరించలేడు. ఎవరైనా క్రీస్తును తృణీకరించారంటే వారిలో ఆత్మకార్యము జరుగలేదని అర్థము చేసుకోవాలి. యేసు శాపగ్రస్తుడు అని చెప్పేవారు లోకంలో ఉన్నారు. అది పరిశుద్ధాత్ముని చర్య కాదు.

పరిశుద్ధాత్ముని వలన యేసును ప్రభువని ఒప్పుకుంటారు. రోమా 10:9లో యేసుప్రభువని నీనోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షించబడుదువు అని ఉంది. రక్షణ ఎంతో స్పష్టముగా ఇక్కడ నిర్వచించబడివుంది. యేసు నీ పాపాల కొరకై చనిపోయాడని నీ హృదయంలో విశ్యాసముంచాలి. పాతిపెట్టబడి తిరిగి లేచాడని విశ్వసించాలి. అపుడు నీ పాపానికి పరిహారము లభిస్తుంది.

యేసు చనిపోయాడని నమ్మువారు లోకంలో ఉన్నారు. యేసు మంచి బోధలు చేశాడని అంటున్నారు. ఆయన చనిపోలేదు. ఆయన వెళ్ళిపోతూ చావును ఇస్కరియోతు

యూదాకు అప్పగించి పోయాడని చెప్పేవాళ్ళు వున్నారు. అది సరియైన నమ్మకం కాదు. అలాంటివారు రక్షణ పొందలేరు.

యేసు మన పాపముల కొరకు మృతిచెందాడని విశ్వసించాలి. అంతేకాదు రోమా 10:9 ప్రకారం యేసు ప్రభువని నోటితో ఒప్పుకోవాలి. ఈ రెండు మనలో జరగాలి. ఈ రెండు ఎవరు చేస్తారు? పరిశుద్ధాత్మవలన తప్ప యేసుప్రభువని ఎవరు చెప్పలేరు. (1 కొరింథీ. 12:3) రక్షింపబడిన దినమున పరిశుద్ధాత్ముని సంగతి మనకు వివరముగా తెలియదు. పరిశుద్ధాత్ముని వివరాలే తెలియవు గాని మన జీవితములో యేసును ప్రభువుగా ఒప్పుకొనునట్లు చేసినవాడు పరిశుద్ధాత్మ దేవుడే, అని ఈ రోజు తెలుసుకుంటున్నాము. నమ్మిన దినమున మనకు అన్ని సంగతులు తెలియవు.

అప్పుడే పుట్టిన బిడ్డ యొద్దకు పోయి నీకు లోపల గుండె ఉంది. నిముషమునకు 70 సార్లు కొట్టుకుంటుంది. ఒక లక్షల కిలోమీటర్ల దూరం రక్తం నిమిషమునకు 70 సార్లు ప్రసురిస్తుంది నీకు తెలుసునా అని అడిగితే ఆ బిడ్డకు ఎలాగు తెలుస్తుంది. కాని జ్ఞానము వచ్చేకొలది సంగతులు అర్థమవుతాయి. అలాగే నీకు అర్థమైన ప్రకారం యేసును నీ జీవితంలో ప్రభువుగా ఒప్పుకున్నావు. ఒప్పుకొనజేసినది పరిశుద్ధాత్మ దేవుడే. ఒప్పుకొనిన దినమున నీకు అర్థము కాలేదు. క్రమేణ ఎదుగుదల జరిగిన తరువాత సంగతి గ్రహింతువు.

పౌలు సేవ చేస్తూ యేసేక్రీస్తు అని బోధిస్తూ వచ్చాడు. థెస్సలోనికయులలో కొందరు, గ్రీసుదేశస్థులలో చాలామంది ఘనత గల స్త్రీలలో అనేకులు యేసును నోటితో ఒప్పుకున్నారు. యూదులైన, అన్యులైన, గ్రీసుదేశస్థులైన నోటితో ఒప్పుకోవాలి. ఘనత గల స్త్రీలయితే ఇల్లు వదలి పెట్టరాదు. వారు ఇంట్లో ఉంటే అన్ని పనులు జరుగుతాయి. అయినా వారు కూడా యేసును నోరు తెరచి ఒప్పుకోవాలి. మీరుఎవరైనా సరే నోటితో యేసును ప్రభువుగా ఒప్పుకోవాలి. పుట్టుకతో క్రైస్తవుడవు, అయినా సరే ఏ శాఖలో ఏ మతంలో ఉన్నా సరే నీ కుటుంబీకులు ఎటువంటి వారికి చెందినా సరే నీ పేరేమైనా సరే ఏ కార్యములు జరిగినా సరే నోటితో మీ జీవితములో ఆయనను ప్రభువుగా ఒప్పుకోవాలి. మీ పాపముల కొరకై ఆయన చనిపోయాడని మీ హృదయములో విశ్వసించాలి. ఆయన

చనిపోవుట ద్వారా నీ పాపము పరిహారము అయినదని ఆయన తిరిగి లేచుట ద్వారా అది నిర్ధారణ అయిందని నీ హృదయములో విశ్వసించాలి. అప్పుడే రక్షణ.

ఆ రీతిగా ఒప్పుకునే కార్యక్రమము చేయువాడు పరిశుద్ధాత్ముడు అని ఈ రోజైనా గ్రహించాలి. యోహాను **16:8**లో ఆయన అనగా పరిశుద్ధాత్ముడు వచ్చి పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పింపజేయును అని యేసుప్రభువే చెప్పాడు. మొదటగా పాపాన్ని గూర్చి పరిశుద్ధాత్మ చెప్పడు ఒప్పుకొనజేస్తాడు. అందుకే రక్షింపబడిన రోజున నీవు పాపిని అని ఒప్పుకున్నావు.

రోమా **3:11** ప్రకారము మానవులలో నీతిమంతుడు లేడు ఒక్కడు లేడు. నీతిమంతుడు ప్రభువైన యేసుక్రీస్తు ఒక్కడే. కలువరి సిలువలో ఆయన చేసిన ప్రాణత్యాగమే నీతిగల కార్యము. అంతకు మించి నీతి గల కార్యము ఈ లోకంలో ఏదీ లేదు. ఆ నీతి గల కార్యాన్ని కూడా పరిశుద్ధాత్ముడు అర్థము అగునట్లు చేస్తాడు. పాపాన్ని ఒప్పుకొనకపోతే తీర్పు ఉంది. అగ్నిగంధకాలు వున్నాయి అని కూడా పరిశుద్ధాత్ముడు ఒప్పిస్తాడు.

యేసును నీ జీవితములోనికి ప్రభువుగా ఆహ్వానించిన దినమున నిన్ను ఆ రీతిగా ఒప్పించినవాడు పరిశుద్ధాత్ముడు. అలాగున అని నేను చెబితే ఒప్పుకుంటావా? ప్రపంచంలో కొంతమంది ఎవరు ఒప్పించినా ఒప్పుకోరు. మనము కూడా ఒక్కోసారి ఎవరు చెప్పినా లెక్క చేయం. ఇలాంటి కఠినులమైన మనలను ఒప్పించినవాడు పరిశుద్ధాత్ముడే.

యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు ఆయనను మృతులలో నుండి లేపాడని, నీ హృదయమందు విశ్వసిస్తేనే నీవు రక్షింపబడుతావు. లేకపోతే ఏమిచేసిన రక్షణలేదు. ఆ ఒప్పుదల కలుగుజేసేవాడు పరిశుద్ధాత్మ దేవుడే అని సంపూర్తిగా మనం గుర్తుంచుకోవాలి.

**6:11**లో దేవుని ఆత్మయందు మీరు కడుగబడి పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి అని వుంది. జారులు, విగ్రహారాధికులు, వ్యభిచారులు,

దొంగలు, లోభులు, త్రాగుబోతులు, దూషకులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు. మీరు కూడా అట్టివారై ఉంటిరి కాని మీరు కడుగుబడినారు అంటున్నారు. యేసురక్తము ప్రతిపాపం నుండి మనలను కడుగుతుంది. నిజమే గాని కడిగినవాడు పరిశుద్ధాత్ముడు. యేసును నీవు అంగీకరించిన దినమున నీ పాపమును అంతా కడిగేసాడు. మైలచేసిన బిడ్డను తండ్రి తెచ్చిన నీటితో తల్లి కడిగినట్లుగా ప్రభువైన యేసుక్రీస్తు, రక్తంచిందిస్తే ఆ రక్తంలో పరిశుద్ధాత్మ దేవుడు మన పాపములను కడిగి పవిత్రపరచాడు.

శుభ్రంగా ఉన్న చిన్న బిడ్డను ఎవరైనా ముద్దుపెట్టుకుంటారు. అంతకుముందు మలినముగా ఉన్నా శుభ్రపరచిన తర్వాత మలినాలు కనబడవు. ఆవిధంగా పరిశుద్ధత్ముడు మన పాపములను కడిగి పరిశుద్ధపరచి నీతిమంతునిగా తీర్చాడు. 3:16లో మీరు దేవుని ఆలయమై ఉన్నారనియు దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరు ఎరుగరా అని వుంది. మనలను కడిగిన పరిశుద్ధాత్ముడు మనలో నివసించుచున్నాడని తెలుసుకోవాలి.

6:19లో మీదేహం దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలో ఉన్న పరిశుద్ధాత్మకు ఆలయమై ఉన్నదని మీరెరుగరా? అంటున్నాడు. చూశారా పరిశుద్ధాత్ముడు మనలను కడిగి మనలోనికి వచ్చాడు మనలను నివాసముగా చేసుకున్నాడు.

ఒక సోదరి ఇల్లు కడుగుతూ వున్నది. దానిని చూచువారు ఆమె ఇంట్లో చేరినది అని అర్థము చేసుకొందురు. తరువాత కొద్దికాలానికి రెండుమూడు రోజులు ఎక్కడికో వెళ్ళింది. ఇల్లు దుమ్ము పట్టి ఉంటుంది. ఇంటిని విడిచిపెట్టక మరలా కడుగుతుంది. మనము ఆ దారిని మరలా పోతే ఆ సోదరి ఆ ఇంటిలో నివాసం చేస్తోంది అని గుర్తింతుము. అలాగే పరిశుద్ధాత్ముడు మనలను కడిగినది మనలో నివసించడానికే గాని మనలను విడిచిపెట్టుటకు కాదు. తల్లిగాని, తండ్రిగాని తన బిడ్డను మరలా మరలా కడిగేది విడచిపెట్టడానికి కాదు. అలాగే పరిశుద్ధాత్ముడు మనలో నివసించడానికే మనలను కడిగినాడు. తరువాత కూడా మనలో ఎప్పుడైన అపవిత్రత ఏర్పడిన మనలను కడుగును.

మన దేహాలను ఆయన కొరకై ఆలయంగా చేసుకోవడానికి కడుగుకున్నాడు. ఇది మరి గొప్ప మాట. రోడ్డు వెంబడి వెళ్తుంటే 10 ఇండ్లు ఒక దేవాలయం కనిపించాయి

అనుకోండి. మామూలు ఇళ్ల కంటే ఆలయాన్ని గొప్పగా ఎంచుతాం కదా! గొప్పగా ఎంచే ఆలయంగా చేసుకోవడానికే మనలను కడిగాడు. మనమాయన దృష్టికి గొప్పవారము.

ఆయన నిన్ను తన నివాసముగా చేసుకున్నాడు. ఇది కూడా ఆశ్చర్యమే. ఆకాశ మహాకాశములు పట్టజాలని దేవుడు, ఆకాశము నా సింహాసనము, భూమి నా పాదపీఠము నా కొరకు ఎలాంటి మందిరమును కట్టుదురు అని యెషయా 66:1 లో పలికిన దేవుడు మనదేహమనే చిన్న స్థలాన్ని ఆలయంగా చేసుకోవడానికి ఇష్టపడుతున్నాడు. మనమీద ఆయనకున్న ఇష్టము, ప్రేమ, ఆప్యాయత ఎంత గొప్పదో గమనించండి.

ఎవరైనా ఒక ప్రముఖమైన వ్యక్తి మన ఇంటికి వస్తాడని తెలిస్తే మన ఇంటిలోని ఆడవారు ఇంటిని ఎంతో శుభ్రము చేస్తారు. తెలియకుండా ఎవరినైనా పిలుచుకొని పోతే ఆడవారు మనమీద కోపపడుతారు. ఫలానా ఆయన వస్తున్నాడని కొంచెం ముందుగా చెప్పేది లేదా అంటారు. ఒక వ్యక్తి వస్తేనే మన ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడానికి ఇష్టపడుతాం. అట్లయితే ఆకాశమహాకాశాలు పట్టజాలని దేవుడు, పరిశుద్ధాత్మ దేవుడు నీ దేహాన్ని తన కొరకై నివాసముగా, ఆలయంగా చేసుకోవడానికి వచ్చాడే మరి నీ ఇంటిని ఆయనకొరకై ఎంత శుభ్రముగా పెట్టుకున్నావు.

ఇల్లు శుభ్రంగా పెట్టుకోవడం తెలుసు. పాత్రలు శుభ్రంగా పెట్టుకోవడం తెలుసు. బట్టలు శుభ్రంగా పెట్టుకోవడం తెలుసు. ఒకాయన ఇలా అన్నాడు "నా భార్య పాత్రలు తోమి తోమి, బట్టలు ఉతికి ఉతికి ఆమె చేతులు అరిగిపోయాయి". నిజమేనా! శుభ్రం చేసుకోవలసిందే అయితే మహోన్నతుడైన దేవుడు నివాసం చేసే నీ దేహాన్ని శుభ్రపరుచుకోవడానికి పరిశుభ్రముగా కాపాడుకోవడానికి ఎంత జాగ్రత్త వహిస్తున్నారో ఆలోచించాలి.

నోటిలో అపవిత్రత, చూపులో అపవిత్రత, చేతుల్లో, కాళ్లలో ప్రతి అవయవంలో అపవిత్రత ఉండగలదు. మనము చాలాసార్లు హద్దు మీరి ప్రవర్తిస్తుంటాము. ఆలోచనల్లో, తలంపుల్లో, మాటలలో జారిపోతూ ఉంటాము. ఆ మాట ఎందుకు అన్నాము అని మదనపడుతూ ఉంటాము. మహోన్నతుడు,

సర్వోన్నతుడు, అత్యున్నతుడైన దేవుడు నిన్ను నన్ను కడుగుకొని మనలను ఒక నివాసము గాను తనకొరకైన ఒక ఆలయంగాను చేసుకోవడానికి ఇష్టపడుచున్నాడు.

మనము ఆయన దేవాలయాన్ని బాగుపరచాలని కోరుతున్నాడు. మనదేహము ఆయనకు ఒక ఆలయమైతే మన నోరు దేవాలయంలో ఉండే మైకుసెట్టు లాంటిది. దేవాలయంలో మంచి కంపెనీది అపశ్రుతులు పలుకని మైక్‌సెట్ పెడతాము. అలాగే మననోటిని శుభ్రపరచుకోవాలి. మంచిదిగా ఉంచుకోవాలి.

పరిశుద్ధాత్మ దేవునికి మనవిషయమై ఎంతగొప్ప ఉద్దేశమున్నదో చూడండి. మనదేహములు దేవుని వలన మనకు అనుగ్రహింపబడినవి. దేవుడు తనకొరకై ఆలయంగా ఉండడానికి మనకు దేహమును ఇచ్చాడు. మనమే ఈదేహాన్ని తయారు చేసుకోలేము. ఈ దేహములు ఉన్నవన్నీ మనుష్య జ్ఞానమునకు అంతుపట్టనివి. ఒక లక్ష కిలోమీటర్ల పొడవుగల రక్తనాళాలు మనదేహములో ఉన్నాయి. గుండె నిమిషానికి 70 సార్లు కొట్టుకుంటుంది. రక్తము నిముషానికి లక్ష కిలోమీటర్లు ముందుకు వెనుకకు ప్రవహిస్తుంది. అలా 70 సార్లు ప్రవహిస్తుంది. ఇలా లెక్కిస్తే ఒక నిముషమునకు మనశరీరంలో 140 లక్షల కిలోమీటర్ల దూరము రక్తము ప్రవహిస్తుంది. ఇది మన చేత అవుతుందా? 140 లక్షల కిలోమీటర్ల దూరం పైపులు వేసి వాటి గుండా నీరు ప్రవహింపజేయడము మానవునికి చేతనవుతుందా?

మనము పుట్టినరోజు ప్రారంభమైన రక్తప్రసరణ క్రియ చనిపోయేంత వరకు 70 నుండి 90 ఏండ్ల వరకు కొనసాగుతుంది. ఇటువంటి రమ్యమైన దేహాన్ని దేవుడు మనకిచ్చాడు. ఎందుకు? మన ఘనత కొరకు కాదు ప్రభువు మహిమకొరకే. "నా మహిమ నిమిత్తము నేను సృజించితిని" యెషయా 43:7. పొగత్రాగి ఆరోగ్యం పాడుచేసుకుంటున్నారు. మద్యం త్రాగి ఊపిరితిత్తులకు నష్టం కలిగించుకుంటున్నారు. చెడు అలవాట్ల వల్ల రక్తనాళాలు దెబ్బతింటున్నాయి. దేవుడు నీకిచ్చిన ఆలయాన్ని నీవు ఎంత జాగ్రత్తగా కాపాడుకుంటున్నావు. మనదేహాలను పరిశుద్ధంగా ఉంచుకోవాలి. మనదేహము పరిశుద్ధాత్మకు ఆలయమై ఉన్నదని ఎరగాలి.

దేవుని నమ్ముకున్నాము గాని, చాలా పర్యాయములు మనదేహాలను పరిశుద్ధముగా కాపాడుకొనుటలేదు. అందుకే మనలను చూచే అనేకమందికి వీళ్ళలో పరిశుద్ధాత్ముడు నివసించుచున్నాడా? అన్న అనుమానము వస్తున్నది. నీ కుటుంబ జీవితంలో, ఉద్యోగ జీవితంలో సామాజిక జీవితంలో, వ్యక్తిగత జీవితంలో పరిశుద్ధాత్ముడు కోరేది పరిశుద్ధత అన్న విషయం ఎప్పుడూ మరచిపోకూడదు. అందుచేత నమ్మిన మన జీవితంలో మనము ఎక్కవలసిన మొదటి మెట్టు పరిశుద్ధత. అందుకే 1 థెస్స 4:3లో మీరు పరిశుద్ధులగుటయే అనగా జారత్వమునకు దూరముగా ఉండుటయే దేవుని చిత్తము అని చెప్పబడింది.

దేవునికి మనపట్ల అనేక చిత్తములు ఉన్నాయి. అందులో దేహమును ప్రభువు కొరకై పరిశుద్ధముగా ఉంచుకొనుట ఒక చిత్తము. 1 కొరింథీ. 3:1 లో సహోదరులారా! ఆత్మ సంబంధులైన మనుష్యులతో మాటలాడినట్లు నేను మీతో మాటలాడలేకపోతిని అంటున్నాడు. ఇక్కడ మనకు ఆత్మ సంబంధులైన మనుష్యులు అని పేరు పెడుతున్నాడు. మనకు మంత్రితోనైనా బంధుత్వం ఉందనుకోండి మనము ఫలానా మంత్రి సంబంధులము అని అన్నామనుకోండి అప్పుడే మారిపోతుంది మన పరిస్థితి. అలా చెప్పుకొనుటకు ప్రజలు చాలా ఇష్టపడతారు. అందరికంటే ఉన్నతమయిన వాడు మన దేవుడు. మనము ఆ దేవుని ఆత్మ సంబంధులము అని తెలుసుకోవడము ఎంతగొప్ప విషయమో గమనించాలి.

ఒక పెద్ద ఉద్యోగస్థుడు ఉన్నాడనుకోండి. ఆయన ఇంటికి వెళ్తే కాపలా వాడు లోపలికి రానివ్వడు. అయితే మనము ఆ ఉద్యోగస్థుని సంబంధులము అని తెలిస్తే కాపలావాడు నమస్కారం చేసి మనలను లోపలికి తీసుకొనిపోతాడు. ఆ ఉద్యోగి సంబంధులము అనగానే మనస్థాయి హెచ్చించబడుతుంది. ప్రియులారా మనము ఎవరి సంబంధులముగా ఉన్నాము. 1 కొరింథి 3:1 లో ఆత్మసంబంధులు శరీరసంబంధులు అని 3:4 ప్రకృతి సంబంధులు అని వ్రాయబడి ఉంది.

ఆత్మసంబంధులమైన మనము లోకసంబంధులుగా గాని, శరీరసంబంధులుగా గాని ప్రకృతి సంబంధులుగా గాని ఉండకూడదు. కాని కొరింథీయులు అలా ఉన్నారని

వ్రాయబడినది. పరిశుద్ధాత్ముని కార్యము హృదయంలో జరిగింది. ఆయన ద్వారా ఒప్పుదల కలిగినది. కాని జీవితవిధానంలో అలాగు లేదు అంటున్నాడు. హృదయంలో మాత్రమే కాదు జీవితవిధానంలో కూడా పరిశుద్ధాత్ముని చర్య కనిపించాలి. చాలామంది నా హృదయాన్ని ప్రభువుకు ఇచ్చాను అంటున్నాడు. మరి మీ శరీరం ఎవరికిచ్చారు? శరీరం లోకానికి ఇచ్చాను. హృదయం ఇవ్వడం మంచిదే ఇది మొదటి మెట్టు. అయితే హృదయం మాత్రమే కాదు రోమా 12:1 ప్రకారం మీ శరీరములను సజీవయాగముగా ఆయనకు సమర్పించుకోవాలి. శరీరము కొరకు గాని లోకము, కొరకుగాని, ప్రకృతి కొరకు గాని కాక ఆయన కొరకే జీవించాలి.

దుఃఖముతో ఈమాట చెప్తున్నాడు. మీరు ప్రకృతి సంబంధులుగా ఉన్నారు. శరీర సంబంధులుగా ఉన్నారు, లోకసంబంధులుగా ఉన్నారు అంటున్నాడు. మనము ఎలా వున్నా ఆత్మసంబంధులమనే సత్యాన్ని ఎన్నడు మరువకూడదు. ఆత్మ సంబంధులు గానే జీవించాలి. మనము విమోచన దినం వరకు ఆత్మతో ముద్రించబడ్డాము. కాబట్టి ఆత్మసంబంధులుగా జీవించాలి.

కొంతమంది ఆదివారం గుడిలో ఉన్నంత వరకు ఆత్మ సంబంధులుగా ఉంటారు. సోమవారం డ్యూటీకి పోగానే మారిపోతారు. మరి కొంతమంది గుడి నుండి ఇంటికి పోగానే మారిపోతారు. కొందరు గుడి నుండి రోడ్డులోకి పోగానే మారిపోతారు. మరికొందరు సొంత ఊరిలో ఆత్మసంబంధులుగా ఉంటారు. ఇంకో ఊరికి పోగానే మారిపోతారు. ఇలా ఉండకూడదు. ఆత్మసంబంధి ఎక్కడైనా, ఎప్పుడైనా ఆత్మసంబంధిగానే ఉండాలి. ఆత్మసంబంధమైన జీవితాన్ని కొనసాగించాలి. ముగింపు కూడా ఆత్మసంబంధంగానే ముగించాలి.

1 కొరింథి 2:14లో ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు అవి అతనికి వెర్రితనముగా ఉన్నవి. అవి ఆత్మానుభవం చేతనే వివేచింపదగును. గనుక అతడు వాటిని గ్రహింపజాలడు అని ఉంది. ఆత్మీయుడు సంగతులను ఆత్మ ద్వారా వివేచించును. అట్లయితే పరిశుద్ధాత్మ దేవుడు మనకు వివేచన

శక్తిని ఇస్తాడు. నేను నిలిచి గంటసేపు ప్రసంగం చేశాను అనుకోండి. వీటిని విని గుడ్డిగా నమ్మడం కాదు. చెప్పిన సంగతులు వాస్తవమేనా, యథార్థమైనవేనా, వాక్యానుసారమైనవేనా అని వివేచించాలి. ఈ వివేచనా శక్తిని పరిశుద్ధాత్ముడే ఇస్తాడు. మనం ఆయనను నమ్మిన తర్వాత అనాథలుగా విడిచిపెట్టేవాడు కాదు. నమ్మిన తర్వాత నీలోకి వస్తాడు. నీలో వుంటాడు. నీలో నివసిస్తాడు. నిన్ను నడిపిస్తాడు. నిన్ను ఆలయంగా చేసుకుంటాడు. అంతేకాదు సంగతులన్నిటిని వివేచించ శక్తిని కూడా అనుగ్రహిస్తాడు.

వివేచనే కాదు అవగాహన కూడా ఆయనే ఇస్తాడు. 2:13వ వచనములో మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో సరిచూచుచు ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధిస్తున్నాము అని వుంది. ఇందులో బోధకులకు కూడా హెచ్చరిక ఉంది. బోధకులు మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో కాక ఆత్మ నేర్పు మాటలతో బోధించాలి.

ఆత్మ నేర్పించేవాడు అని ఈ వచనం ద్వారా అర్థమవుతున్నది. వాక్యం చెప్పాలంటే నాకు చేతకాదు అనుకుంటాము. కాని దాన్ని పరిశుద్ధాత్మ దేవుడే నేర్పిస్తాడు. అవసరతను బట్టి ఆయన దగ్గర కనిపెట్టుకొని నిలబడితే ఎవరికైనా ఆయన నేర్పిస్తాడు. అయితే బోధించడానికే నేర్చుకోకూడదు. ఆత్మ నేర్పు మాటలు ముందుగా మన జీవితాలకి అవసరం. వాక్యాన్ని నేర్చుకోవాలి. అంటే బైబిలును క్షుణ్ణంగా చదవాలి. మనకు ఉండేది 66 గ్రంథాలే. 10వ తరగతి చదివే పిల్లవాడు సంవత్సరమునకు 12 పుస్తకముల చొప్పున ఆరేండ్లకు కనీసం 72 పుస్తకా చదివి ముగించాడు. కాని దేవుడు నీకు ఇచ్చిన 66 పుస్తకాలు అంతకంటే తక్కువే. వీటిల్లో కూడా 1, 2,3,4 అధ్యాయాలు పుస్తకాలు చాలా వున్నాయి. 10 అధ్యాయాల లోపు పుస్తకాలు సగం వున్నాయి. దాదాపు 32 గ్రంథాలు 10 కంటె తక్కువ అధ్యాయములు కలిగినవే. మిగిలిన సగము 20 నుండి 50 అధ్యాయాలు కలిగినవి ఉన్నాయి. యిర్మీయా 52 అధ్యాయాలు, యెషయా 66 అధ్యాయాలు, కీర్తనలు 150 అధ్యాయాలు. వీటినన్నింటిని నేర్చుకోవాలి. వీటిని చదివితే మిగిలినవి అక్కరలేదు. సహాయంగా ఇతర పుస్తకాలు చదవండి. ఇతర పుస్తకాలు సహాయము మాత్రమే గాని నేర్చుకొనవలసినవి 66 పుస్తకాలు. వీటిని ఆత్మ నేర్పిస్తాడు.

ఇక్కడ ఒక హెచ్చరిక ఉంది. మనుష్యజ్ఞానము నేర్పుమాటలతో కాక అని వుంది. అనగా మనుష్యజ్ఞానము కూడా కొంత నేర్పిస్తుందన్నమాట. మనుష్య జ్ఞానం కూడా నేను నేర్పిస్తాను అని మధ్యలో అడ్డువస్తాడు. మనుష్య జ్ఞానం నేర్పు మాటలతో నేర్చుకోకూడదు.

పౌలు మనుష్యజ్ఞానము నేర్పు మాటలతో నేర్చుకోలేదు. నా జ్ఞానము నాకు నేర్పిస్తుంది. అయితే వాటినిబట్టి నేను బోధించుటలేదు అంటున్నారు. మన నేర్పుదల విషయంలో మనుష్యజ్ఞానాన్ని ప్రక్కన పెట్టడమే మంచిది. ఆత్మ నేర్పించు మాటలు నేర్చుకోవాలి. సహాయకరమైన గ్రంథాలు చదవండి. చదువవద్దని వాక్యము చెప్పదు. దానియేలు వంటి భక్తుడు కూడా యిర్మీయా 9వ అధ్యాయంలో 70 ఏండ్ల చెర ముగిసిందని యిర్మీయాగ్రంథము ద్వారా తెలుసుకొంటిని అన్నాడు. అంటే దానియేలు యిర్మీయాగ్రంథాన్ని చదివివుంటాడు. యిర్మీయా నాలాంటి ప్రవక్తనే కదా! నేను కూడా పెద్ద ప్రవక్తనే, నేను యిర్మీయా గ్రంథాన్ని ఎందకు చదవాలి అనుకున్నాడా? లేదు. దానియేలుకు నేర్పించు సంగతులు దేవుడు దానియేలుకు నేర్పించాడు. యిర్మీయాకు నేర్పించు సంగతులు దేవుడు యిర్మీయాకు నేర్పించాడు. యిర్మీయాకు చెప్పిన ప్రత్యేక సంగతులు దానియేలుకు నేర్పించలేదు. దానియేలు యిర్మీయా గ్రంథము చదివి నేర్చుకోవాలి. అవి దేవుని చిత్తము.

అలాగే యెషయాకు నేర్పించిన ప్రత్యేక సంగతులు దానియేలుకు, యిర్మీయాకు చెప్పలేదు. పరిశుద్ధాత్ముడు ఎవరికి ఏ సంగతులు నేర్పించాడో ఆ సంగతులు వారికే పరిమితమయ్యాయి. కాబట్టి ఒకరి గ్రంథాన్ని ఒకరు చదవడం నేర్చుకోవడం అవసరమే. అయినా పరిశుద్ధాత్మ దేవుడు నేర్పిస్తాడనే సంగతి ఎప్పుడు మరచిపోవద్దు:

మనుష్య జ్ఞానం నేర్పు సంగతులు ప్రక్కన బెట్టాలి. పరిశుద్ధాత్మ దేవుడు వివేచన శక్తిని ఇస్తాడు, నేర్పిస్తాడు. ఆయన కాడి క్రింద మనము నేర్చుకోవాలి. 1 కొరింథీ. 2:10లో మనకైతే వాటిని తన ఆత్మవలన బయలుపరచివున్నాడు. ఆ ఆత్మ అన్నింటిని దేవుని మర్మములను కూడా పరిశోధించుచున్నాడు. 9వ వచనంలో కొన్ని మర్మాల గురించి

చెప్పాడు. అవి కంటికి కనబడలేదు. చెవికి వినబడలేదు. మనుష్య హృదయానికి గోచరం కాలేదు. అవి మర్మాలుగానే మిగిలిపోయాయి.

మనకైతే దేవుడు వాటిని తన ఆత్మ వల్ల బయలుపరచుచున్నాడు. ఆ ఆత్మ అన్నింటిని దేవుని మర్మములను కూడా పరిశోధించుచున్నాడు. కొన్నిసార్లు మనుష్య జ్ఞానమునకు అందని సంగతులు ఉన్నాయి. అవి మన చెవులకు వినబడలేదు. కన్నులకు కనబడలేదు. మనుష్య హృదయానికి గోచరం కాలేదు కాని పరిశుద్ధాత్మ దేవుడు వాటిని మనకు బయలుపరచుచున్నాడు.

అట్లయితే మనము ఆయన దగ్గర కనిపెట్టుకునే అవసరత ఎంతగా ఉందో చూడండి. పరిశుద్ధాత్ముని దగ్గర కనిపెట్టుకోవాలి. ఆయన మాత్రమే బయలు పరచేవాడు. ఆ ఆత్మ అన్నింటిని దేవుని మర్మములను కూడా పరిశోధించుచున్నాడు. దేవుని మర్మములు కూడా పరిశోధించుచున్నాడు. దేవుని మర్మములు కొన్నివున్నవి. పాతనిబంధన కాలంలో కొన్ని మర్మాలు ఉన్నాయి. దానియేలుకు కొన్ని సంగతులు మర్మముగా ఉన్నాయి. వాటికి ముద్రవెయ్యమని దానియేలు 12:6 అధ్యాయంలో ఉన్నాడు. దానియేలు ముద్రవేశాడు. అయితే ఆత్మ ఈ యుగాంతమందున్న మనకు వాటిని బయలుపరచేవాడుగా ఉన్నాడు.

ఆ ఆత్మ మర్మములను పరిశోధించే శక్తిని మనకు ఇస్తాడు. పరిశీలించడం, పరీక్షించడం, పరిశోధించడం అనే పదాలు ఇంచుమించు ఒకే అర్థము కలిగివున్నా పరిశోధించు అనేమాట అన్నిటికంటే మించినది. ఉదా: ఒకటి చదివేటపుడు ఒకరు పరిశీలించి, చదువుచున్నారు. మరొకరు పరిశోధించి చదువుచున్నారు అనుకోండి. తేడా వుందా? లేదా? పరిశోధన అంటే ఏదో ఒకటి అందులో నుంచి కనుగొనడం అన్నమాట. మన వాళ్ళు పశ్చిమగోదావరి జిల్లాలో నూనె ఉందని పరిశోధించి కనుగొన్నారు. పరిశోధన అంటే ఒక క్రొత్త సంగతిని కనుగొనడం. లేఖనాల్లో మర్మాలు ఉన్నాయి. ఆ మర్మాలను పరిశోధించడానికి శక్తిని కూడా పరిశుద్ధాత్మ దేవుడు మనకు ఇస్తాడు. వాటిని తెలియపరచేది కూడా పరిశుద్ధాత్మ దేవుడే.

అట్లయితే ఒక క్షణం ఆగి ఆలోచిద్దాం. నేను రక్షించబడి ఎంతకాలం అయ్యింది. ఎంతకాలంగా లేఖనాలను పరిశీలిస్తున్నాను. ఎంత పరిశోధన జరిపాను. ఎన్ని ఫలితాలు కనుగొన్నాను. పరిశోధన అంటే అర్థం చేసుకోవడానికి ఈనాటి రీసెర్చ్ సెంటర్లను జ్ఞాపకం చేసుకుందాం. పట్టుగూళ్ళ రీసెర్చ్ సెంటర్లు ఉన్నాయి. వ్యవసాయంలో రీసెర్చ్ సెంటర్లు ఉన్నాయి. వాటిల్లో పరిశోధన చేస్తుంటారు. పరిశోధించి కొన్ని ప్రత్యేకమైన వాటిని కనుగొంటూ ఉంటారు. సరిగా దిగుబడి లేని మొక్కలను ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా పరిశోధిస్తూ ఉంటారు.

లేఖనాలు కూడా పరిశోధన చేయాలి. ఎన్నో మర్మాలు ఉన్నాయి. కాని మనుష్యజ్ఞానంతో వాటినికనుగొనలేము. నీ చదువు, హోదా అందుకు పనికిరావు. పరిశుద్ధాత్మ దేవుడే వాటి మర్మములను కూడా నీకు అందించగలడు. మరి నీవు లేఖనములను ఎంతగా పరిశోధించావు. రోమాపత్రికలో పరిశుద్ధాత్ముని పరిచర్యలను పరిశోధించాము. ఇపుడు కొరింథీ మొదటి పత్రికలో పరిశుద్ధాత్ముని పరిచర్యలను పరిశోధించుచున్నాము. క్రొత్తనిబంధన అంతటిలో పరిశుద్ధాత్ముని పరిచర్యలను గురించి పరిశోధించండి. రమ్యమైన సంగతులను దేవుడు బయల్పరుస్తాడు.

నేను ఒక రోమాపత్రికలో పరిశుద్ధాత్ముని పరిచర్య గురించి ఆలోచించినపుడు నామట్టుకు నాకు మేలుకలిగింది. అవి మీతో పంచుకుంటున్నాను. కొరింథీ పత్రిక ఆలోచించాను. వాటిని మీతో పంచుకుంటున్నాను. ఆత్మ అన్నింటిని పరిశోధించేవాడు. ఆయన దగ్గర మనం కనిపెట్టుకొని ఉండడం ద్వారా మర్మములు బయలుపడతాయి. 1 కొరింథీ. 2:4, 5 వచనాలలో విశ్వాసము మనుష్యుల జ్ఞానం ఆధారం చేసికొనక దేవునిశక్తి ఆధారం చేసుకొని వుండవలెనని నేను మాటలాడినను సువార్త ప్రకటించినను జ్ఞానయుక్తమైన తియ్యటి మాటలను ఉపయోగించక పరిశుద్ధాత్మయు దేవునిశక్తియు కనపరచు దృష్టాంతములనే వినియోగించితిని అని వ్రాయబడివుంది.

మనుష్యజ్ఞానం ఆత్మనేర్పు మాటలకు అడ్డు తగులుతుంది అని గమనించాము. అందుకే మనుష్యజ్ఞానమును ఆధారము చేసికొనక దేవుని శక్తిని పరిశుద్ధాత్మ శక్తిని ఆధారం చేసుకొని వుండవలెనని నేను మాటలాడినను సువార్త ప్రకటించినను జ్ఞానయుక్తమైన

తియ్యటి మాటలను వినియోగించలేదని పౌలు అంటున్నాడు. జ్ఞానయుక్తములైన తియ్యటి మాటల వల్ల తొందరలు వస్తాయి. ఆత్మ నేర్పిన మాటల వల్ల క్షేమము ఉంటుంది.

మనుష్య జ్ఞానాధారముగా తియ్యటి మాటలు చెప్పడానికి కొంతమందికి సామర్థ్యత ఉంటుంది. అలాంటి మాటలు మన నోటిలో చక్కగా వస్తూ వుంటాయి. కాని వాటిని ఆధారం చేసుకోలేదు అంటున్నాడు. అంటే నేను కూడా వాటిని మాటలాడగలను గాని వాటిని వినియోగింపక పరిశుద్ధాత్మ శక్తిని దేవుని శక్తిని కనబరచు దృష్టాంతములను వినియోగించేటపుడు అది జీవితానికి సంబంధించినదైనా, ఇంకేదైనా దేవుడు కనబరిస్తేనే లేక పరిశుద్ధాత్ముడు అనుగ్రహిస్తేనే చెప్పాలి. లేకుంటే చెప్పకూడదు.

దేవుని శక్తి మీకు దృష్టాంతములు తెలియజేస్తాడు. కాని చెప్పేముందు ఒక పరీక్ష మనం చేసుకోవాలి. ఇది పరిశుద్ధాత్మ దేవుని దృష్టాంతమేనా కాదా అని పరీక్షించుకోవాలి. మనము మాటలాడినను సువార్త ప్రకటించినను పరిశుద్ధాత్మయు, దేవుని శక్తియు కనబరచు దృష్టాంతములనే వినియోగించాలి. కాబట్టి బోధకులకు గూడా ఇందులో హెచ్చరిక ఉంది. మనుష్య జ్ఞానము తియ్యటి మాటలను ఆధారం చేసికొనక దేవుని శక్తిని ఆధారం చేసికొని బోధించాలి.

పరిశుద్ధాత్మ దేవుడు మనకు సంగతులను వివేచించే శక్తిని ఇస్తాడు. పరీక్షల్లో జయించడానికి శక్తిని ఇస్తాడు. ప్రసంగించడానికి, బోధించడానికి సువార్త చెప్పడానికి అవసరమైన దృష్టాంతములు కూడా ఆయనే ఇస్తాడని విశ్వాసముతో ముందుకు సాగాలి.

12:13 లో ఏలాగనగా యూదులమైనను, గ్రీసుదేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను మనమందరము ఒక శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. ఒక్క ఆత్మను పానం చేసిన వారమైతిమి. ముందు విశ్వాసము తర్వాత రక్షణ పరిశుద్ధాత్మ కార్యము అని చెప్పుకున్నాము. బాప్తిస్మము కూడా ఆత్మకార్యమని వ్రాయబడి ఉంది. ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. ఒకరు ఎన్ని బాప్తిస్మాలు పొందాలి అని నన్ను అడిగారు. ఒక్కసారి బాప్తిస్మము పొందాలి. బాప్తిస్మము ఒక్కటే. ఎఫెసీ. 4:5 రక్షించబడిన పిదప ఒక్క ఆత్మయందు పొంది ఉంటే చాలు.

అపొ. 19:1 లో ఎఫెసీయులతో పౌలు మీరు విశ్వసించినపుడు ఆత్మను పొందితిరా అన్నాడు. వారు ఆత్మ సంగతే మాకు తెలియదు అన్నారు. మీకు యోహాను బాప్తిస్మము ఇచ్చాడు. రాబోయే క్రీస్తును చూపించాడు. కాని ఆత్మయందు మీకు బాప్తిస్మము ఇవ్వలేదని చెప్పాడు. అపుడు వారికి మరల నిజమైన బాప్తిస్మము ఇచ్చాడు. నిజమైన బాప్తిస్మము ఆత్మయందే కాని ప్రపంచ క్రైస్తవ కోటిలో విధానాలలో కొన్ని తప్పులు ఉన్నాయి.

పుడుతూనే ఏదో ఒక రకమైన ఆచారం జరిపించడము. హాస్టలులో సీటు కావాలంటే ఏదో ఒక షరతు పెట్టి అప్పుడొక కార్యము నిర్వహించడము. సెమినారిటి కాలేజీలో సీటు కావాలంటే బాప్తీస్మము సర్టిఫికెటు కావాలి. ఈ సర్టిఫికెటు తీసుకున్న వాళ్ళలో చాలామంది ప్రభువును నమ్మని వాళ్ళు కూడా ఉన్నారు. ఇలాంటి పొరపాట్లు ఉండడం వల్ల అనేక బాప్తిస్మాలు అగుపిస్తాయి.

1 కొ. 10:3 నుండి చదివితే అందరు ఆత్మసంబంధమైన ఒకే ఆహారం భుజించిరి. అందరు ఆత్మసంబంధమైన ఒకే పానీయము పానము చేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధమైన బండలోనిది త్రాగిరి అని ఉంది. అది ఆత్మీయముగా యేసుక్రీస్తును ఒకే ఆహారముగా భుజించడానికి సాదృశ్యముగా ఉంది. మనము రొట్టె, రసం స్వీకరించడంలో కూడా ఈ సాదృశ్యాన్ని చూడవచ్చు.

అట్లయితే ఆత్మసంబంధమైన ఆరాధన అనగా ఆత్మీయులతో కలిసి చేసే ఆరాధన అని దాని భావము. ఎవరితో ఆరాధిస్తే ఏముంది అనుకోకూడదు. 10:21 లో మీరు ప్రభువు పాత్రలోనిది దయ్యముల పాత్రలోనిది కూడా త్రాగనేరరు. ప్రభువు బల్లమీద ఉన్నదానిలో దయ్యముల బల్లమీద ఉన్నదానిలో పాలుపొందనేరరు. కాబట్టి ఆత్మీయులు ఆత్మీయులతోనే ఆరాధన చేయాలి. ఆచార సంబంధ ఆరాధనలు లోకంలో చాలా ఉన్నాయి. వాటి ద్వారా క్షేమం లేదని గుర్తించాలి. .

ఆత్మసంబంధమైన బాప్తిస్మము, ఆత్మసంబంధమైన భోజనం, ఆత్మీయులమైన మనజీవితాలలో ఉండాలి. ఇవి కూడా పరిశుద్ధాత్మ దేవుని వలననే కలుగుచున్నాయి

అనే సత్యము మరువకూడదు. 15:43 నుండి 46 వచనాల్లో కూడా ఆత్మను గూర్చిన ప్రస్తావన మనకు కనబడుతుంది. శరీరము ఘనహీనమైనదిగా విత్తబడి మహిమగలదిగా లేపబడును. ప్రకృతి సంబంధమైన శరీరముగా విత్తబడి ఆత్మసంబంధమైన శరీరముగా లేపబడును. ఇప్పుడు మనశరీరం ఆత్మకు, ఆత్మ మన శరీరమునకు విరోధముగా అపేక్షించుచున్నాయి. కాని ఈ శరీరము మట్టిలో విత్తబడుతుంది. ఒకరోజు మహిమ శరీరముగా లేస్తుంది. ప్రకృతి సంబంధమైన శరీరముగా విత్తబడి ఆత్మసంబంధమైన శరీరముగా లేస్తుంది. ప్రకృతి సంబంధమైన శరీరం ఉన్నది గనుక ఆత్మసంబంధమైన శరీరం కూడా ఉన్నది.

15:45లో ఆదాము మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి ఆయెనని వ్రాయబడి ఉన్నది. కడపటి ఆదాము జీవింపజేయు ఆత్మ ఆయెను. కడపటి ఆదాము అనగా యేసుప్రభువు జీవింపజేయు ఆత్మ. ఆయన చనిపోయాడు. సమాధి చేయబడ్డాడు. తిరిగి లేచాడు. తిరిగి లేచిన శరీరము ఆత్మశరీరము మరియు మహిమ శరీరము. ఆయన లేచినప్పుడు మరియ ముట్టుకోబోతుంటే నేను తండ్రి యొద్దకు ఎక్కిపోవాలి కాబట్టి నన్ను ముట్టుకోవద్దు అన్నాడు. తోమా "దగ్గరకు వచ్చి నా చేతిలో వ్రేలుపెట్టు" అన్నాడు. మరియమ్మను ముట్టుకోవద్దు అన్నాడు. తోమాను ముట్టుకోమన్నాడు. అంటే ఇంతలోపు తండ్రియొద్దకు పోయివచ్చాడు. తండ్రి యొద్దకు పోవుటకు ఈ మట్టి శరీరమునకు అసాధ్యము. కాని ఆత్మశరీరానికి సులభం. ఒక్కక్షణంలో ఎక్కడికైనా వెళ్ళిరావచ్చును. దీనినే మహిమ శరీరం అని పిలుస్తున్నాం. ప్రభువే కాదు మనం కూడా ఒకరోజు అలాంటి శరీరాన్ని ధరించుకోబోతున్నాం.

12:4-6లో కృపావరములు నానావిధములుగా ఉన్నవి. కాని ఆత్మ ఒక్కడే. మరియు పరిచర్యలు నానావిధములుగా ఉన్నవి. ప్రభువు ఒక్కడే నానావిధములైన కార్యములు గలవు కాని అందరిలోను అన్నిటిని జరిగించు దేవుడు ఒక్కడే అని చదువగలము. ఈ భాగంలో ఆత్మ ఒక్కడే. ప్రభువు ఒక్కడే, దేవుడు ఒక్కడే అని చూడగలము. పరిశుద్ధాత్మని గురించి మనము మాట్లాడుతూ ఉన్నా ఆయనలో కుమారుడైన దేవుడు, తండ్రియైన దేవుడు కూడా ఇమిడివున్నట్లు చూడగలం. 12:7లో

అయినను అందరి ప్రయోజనం కొరకు ప్రతివానికి ఆత్మ ప్రత్యక్షత అనుగ్రహింపబడుచున్నది. ఆత్మయొక్క కార్యములను పరిశుద్ధాత్మ యొక్క దేవుడు అందరి ప్రయోజనం కొరకు అనుగ్రహిస్తున్నాడు. **14:12**లో ఈ మాట మరియొక విధంగా వుంది. మీరు ఆత్మసంబంధమైన వరముల విషయమై ఆసక్తి గలవారు గనుక సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగు నిమిత్తము అవి మీకు విస్తరించునట్లు ప్రయత్నము చేయండి.

పరిశుద్ధాత్మ దేవుడు ఎవరికైనా వరం ఇస్తే దాన్ని వాడుట యందు ప్రయత్నించాలి. అనగా వారు వాడుతూ ఉండాలి. సాధకం చేయాలి. ఉదా॥ ఒక కత్తి కలిగి ఉన్నాం అనుకోండి. ఆ కత్తి వాడుతుంటేనే బాగుంటుంది. కొన్ని ఏండ్లు వాడకుంటే తుప్పుపట్టిపోతుంది. శక్తినికోల్పోయి విరిగిపోతుంది. అలాగే దేవుడిచ్చిన వరము కూడా మనం సాధకం చేయాలి. సువార్త ప్రకటించు వరము కలవారు ప్రకటిస్తూనే ఉండాలి. నన్ను ఎవరు పొమ్మనలేదనో, నన్ను ఎవరూ పట్టించుకోలేదనో కనిపెట్టుకోకూడదు. దేవుడు నీకు ఎక్కడ పని అప్పగిస్తే, అక్కడ చేస్తుండాలి. సాధకం చేయాలి. దేవుని పనిని సంఘ క్షేమాభివృద్ధి కోసమే చేయాలి. మనుష్యుల అందరి ప్రయోజనాల కొరకై దేవుడు మనకు వరాలు ఇచ్చేవాడు.

వరము అంటే పరిచర్య మరియు కార్యములు అని అర్థము. ప్రభువు కొరకై నీవు చేసే కార్యాలు నీవు చేసినట్లు ఎవరూ చేయలేరు. కొంతమందికి పత్రికలు పంచే విధానం ప్రత్యేకంగా ఉంటుంది. వారు పంచినట్లు ఎవరు పంచలేరు. మరికొంతమందికి మీటింగులకు పిలుచుకొని వచ్చే వరము ప్రత్యేకంగా ఉంటుంది. వారు పిలిచినట్లు ఎవరు పిలుచుకొని రాలేరు. నానా రకాల పరిచర్యలు ఉన్నాయి. ఎవరికి వారే ప్రసిద్ధిచెందిన వారిగా చూడగలం.

మన పరిచర్య అందరి ప్రయోజనముల కొరకై ఉండాలి. అంతేకాని స్వప్రయోజనము కొరకు కాదు. దేవుడు నాకు ఆ వరము ఇచ్చాడు. నీకు నష్టమైతే నాకేమి? సంఘానికి నష్టమైతే నాకేమి? అన్నతలంపులో ఉండకూడదు. ఏ పరిచర్య అయినా ఏవరమైనా, ఏ కార్యమైనా

సంఘము యొక్క క్షేమాభివృద్ధి నిమిత్తమే వాడాలి. సంఘానికి కీడు గాని తొందర కలిగించేది అయితే ఆపెయ్యాలి.

అయినను వీటన్నిటిని ఆ ఆత్మ ఒక్కడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచి ఇచ్చును. కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు. (1 కొ. 11:12) ఆత్మ ఒక్కడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ఇస్తాడు. మన చిత్తము చొప్పున కాదు. నీకిచ్చేది వేరు. నా కిచ్చేది వేరు. నాకు ఇది ఆయనకు అదా అనవలసిన పనిలేదు. ఒక్కొక్కరికి ప్రత్యేకముగా ఉంటాయి. ప్రత్యేకముగా పంచి ఇస్తూ ఆయన కార్యసిద్ధి కలుగుజేయుచున్నాడు. ఇవ్వడంలో కార్యసిద్ధి కలగాలి అని ఆయన ఉద్దేశము. ఆయన ఇచ్చిన వరాలను మనం సాధకం చేయలి. దాని ద్వారా కార్యసిద్ధి కలగాలి.

12:7లో ఆత్మ ప్రత్యక్షత అని వ్రాయబడింది. ప్రత్యక్షత అంటే ఒక నూతన రీతిగా బయలుపరచడం అన్నమాట. ప్రత్యక్షత అంటే అంతకు ముందు కనబడక ఇప్పుడు కనబడేది అన్నమాట. ఒక గదిలో ఒక విషయము ఉంది. తాళం తెరుస్తూనే కనిపిస్తే ప్రత్యక్షత అన్నమాట. అంతకుముందు మూయబడి ఉంది తెలియదు. ఇపుడు మన కనులకు అర్థమయ్యేటట్లుగా మన ముందు ఉంచబడింది. ఆత్మ ప్రత్యక్షత అలాగు వుంటుంది. ఒక నూతనమైన రీతిగా నిన్ను వాడుకోవడానికి ప్రభువు ఇష్టపడుతున్నాడు.

ఆయన శిరస్సై ఉన్నాడు. ఆయన నుండి సర్వశరీరం చక్కగా అమర్చబడి తనలో ఉన్న ప్రతి అవయవం తన తన పరిమాణం చొప్పున పనిచేయుచు ఉండగా ప్రతి కీలువలన కలిగిన బలము చేత అతుకబడి ప్రేమయందు తనకు క్షేమాభివృద్ధి కలుగునట్లు శరీరము అభివృద్ధి కలుగజేసుకొనుచున్నది (ఎఫెసీ. 4:16). ప్రతి అవయవము పనిచేస్తేనే క్షేమాభివృద్ధి కలుగుతుంది, లేకపోతే లేదు. సంఘం కూడా శరీరానికి పోల్చబడింది. సంఘం అనగా ఆయన శరీరము. ఆ శరీరమునకు క్షేమాభివృద్ధి కలగాలంటే అవయవాలమైన మనం మన పరిమాణం చొప్పున పనిచేస్తూ ఉండాలి. ప్రతి అవయవమునకు బలం కలుగుజేయాలి. దేవుడు మీకు ఏ వరం ఇచ్చాడో అనగా మిమ్మును ఏ అవయవముగా ఉంచాడో ఆ పని, ఆ కార్యము, ఆ వరము, ఆ పరిచర్య మీ చేత జరుగుచూ ఉండాలి.

ఒకనికి ఆత్మమూలముగా బుద్ధివాక్యము, మరియొకనికి ఆ ఆత్మను అనుసరించి జ్ఞానవాక్యము (1 కొ. 12:8) అని వుంది. బుద్ధివాక్యము అనుగ్రహించబడి వ్యక్తి వాక్యము చెపుతూ వుంటే వినే వారికి బుద్ధి కలుగుతుంది. బుద్ధి వాక్యము దేవుడిచ్చిన వరమే. నాకు బుద్ధి వాక్యం చెప్పేవరం ఇవ్వమని అడుగకూడదు. అడిగిన దానిని బట్టి దేవుడు మనకు వరములను ఇవ్వడు. ఆయన తన చిత్తానుసారంగా ఇస్తాడు.

మరియొకనికి ఆ ఆత్మను అనుసరించే జ్ఞానవాక్యం ఇవ్వబడుతుంది. బైబిలులో ఎంతో జ్ఞానము ఉంది. ఇది మనుష్యుల జ్ఞానం కాదు. లోకజ్ఞానం కాదు. మనుష్య జ్ఞానానికి, లోకజ్ఞానానికి బైబిలు జ్ఞానానికి తేడా ఉంది. వాక్యజ్ఞానము, మనుష్యజ్ఞానముతో వివేచన చేయబడదు. లౌకిక జ్ఞానము దానికి సరిపోదు. కాని ఆ జ్ఞానవాక్యము. అనగా వాక్యసంబంధమైన జ్ఞానము కూడా ఒక వరమే. మీటింగుల కొరకు ఫలానా వారిని పిలవాలి అనుకున్నపుడు మన మధ్య ఆలోచన వస్తుంది. ఫలానా అన్న బుద్ధివాక్యము బాగా చెప్పగలడు. ఆయన వస్తే అందరికి బుద్ధికలుగుతుంది. ఆ అన్నకు తర్ఫీదు ఉంది. ఆ అన్నను పిలుద్దాము అనుకుంటాము. ఫలానా అన్న జ్ఞానవాక్యము కలిగిన వాడు. పరిశుద్ధాత్మదేవుడు ఆయనను జ్ఞానవాక్యముచే నింపినాడు. ఆ అన్నను పిలుచుకుంటే బాగుండు అనుకుంటాము.

నేను భాషతో ప్రార్థన చేసినయెడల నా ఆత్మ ప్రార్థన చేయును గాని నా మనస్సు ఫలవంతముగా ఉండదు. కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతో ప్రార్థన చేతును. ఆత్మతో పాడుదును. మనస్సుతో పాడుదును. (1 కొరింథ 14:14-15) 12వ అధ్యాయంలో ఆత్మ నేర్పిస్తాడు అని వుంది. ఆత్మలో ప్రార్థన చేతుము అనగా ప్రార్థనను కూడా ఆత్మ నేర్పిస్తాడు. రోమా 8:26లో అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయం చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదుగాని ఉచ్చరింప శక్యముగాని మూలుగులతో ఆ ఆత్మతానే మన పక్షముగా విజ్ఞాపన చేయుచున్నాడు అని వుంది. ప్రార్థన ఎలాగు చేయాలో మనకు తెలియదు. గాని ఆత్మ తానే మనపక్షముగ విజ్ఞాపన చేయుచున్నాడు. ఆత్మతో చేసే ప్రార్థన ఉంది. మనస్సుతో చేసే ప్రార్థన ఉంది.

అలాగే జ్ఞానవాక్యము, బుద్ధివాక్యము అనుగ్రహించబడే విధానము ఉంది. మనుష్య జ్ఞానం ఆధారము చేసుకొని శరీరమును ఆస్పదము చేసుకొని, ప్రకృతిని ఆధారం చేసుకొని వాక్యము నేర్చుకొనే విధానము కూడా వుంది. మనుష్య జ్ఞానము ఆధారము చేసుకొనక ఆత్మ నేర్పు మాటలతో మనం బోధించాలి. వాక్యాన్ని మనకు ఆత్మ నేర్పిస్తాడు. మనకు ప్రార్థన కూడా ఆత్మ నేర్పిస్తాడు.

ఆత్మతో పాడుదును. మనస్సుతో పాడుదును. ఆత్మతో అయినా పాడవచ్చు. మనస్సుతో అయినా పాడవచ్చు. పౌలు ఆత్మతో పాడగలడు. మనస్సుతో పాడగలడు. మనము పాటలు పాడే విషయంలో ఆత్మలోనే పాడాలి. మనస్సుతో కూడా పాడగలం. 1 కొ. 14:16లో ఆత్మతో స్తోత్రము అంటున్నాడు. ఆత్మతో ప్రార్థన, ఆత్మతో పాడుట, ఆత్మతో బోధించుట, ఆత్మతో స్తోత్రం. అన్ని ఆత్మతోనే. మనం ఆలోచిస్తే, మన ఆత్మీయ జీవిత విధానంలో ఇంతకు మించిన వేరే పని లేదు. ఇవన్నీ జరిగించేది ఆత్మ దేవుడే.

ఆత్మతోపాటు శరీరముతో కూడా పాడుదును అన్నాడు. ఆత్మదేవుడు మనలను పాటలతో నడిపిస్తుంటే శరీరము కూడా కొన్నిసార్లు నడిపిస్తున్నాడు. ఆత్మతోపాటు అన్నిటిలో శరీరము కూడా మనలను నడిపిస్తుంది అని గుర్తుంచుకోవాలి. కాబట్టి ప్రభువు పరిచర్యలన్ని మనము ఆత్మతో చేయుటకు అలవాటుచేసుకోవాలి.

ఒక చిన్నవాడు గట్టిగా ప్రార్థన చేస్తున్నాడట. దేవా నాకు సైకిలు ఇవ్వు అని అడుగుచున్నాడు. వాళ్ళమ్మ దేవునికి చెవుడనుకున్నావా, అంతగట్టిగా ప్రార్థన చేస్తున్నావు అంది. దేవునికి చెవుడు కాదు. తాతయ్యకు చెవుడు మమ్మీ అందుకే గట్టిగా ప్రార్థన చేస్తున్నాను అన్నాడట. దీని అర్థము ఏమి? ప్రార్థన ఆత్మతో దేవునికి చేస్తున్నాడు గాని శరీరం తాతయ్యకు మొరపెట్టుచున్నది అన్నమాట.

అలాగే మన ప్రార్థన కూడా ఒక్కొసారి ఉంటుంది. దేవునికి ఆత్మతో ప్రార్థన చేసినా మన అక్కర్లు అందరికి తెలిసేలా చేస్తాం. దీన్ని ఆత్మ ప్రార్థన అంటామా? శరీర ప్రార్థన అంటామా?

మరియొకనికి అద్భుతకార్యములు చేయు శక్తిని, మరియొకనికి ప్రవచనవరమును, మరియొకనికి ఆత్మల వివేచనయు మరియొకనికి నానావిధ భాషలను, మరియొకనికి భాషల అర్థము చెప్పు శక్తియు అనుగ్రహింపబడినది (1 కొరింథీ. 12:10). ఇక్కడ చాలా విషయాలు ఉన్నవి. ప్రస్తుతము అవి గలిబిలిగా వున్నవి, గనుక 1 కొరింథీ. 14:1 చదువుదాము. ప్రేమకలిగి ఉండుటకు ప్రయాసపడండి. ఆత్మసంబంధమైన వరములను ఆసక్తితో ఆపేక్షించండి. ఆత్మసంబంధమైన వరములను ఆపేక్షించడములో తప్పేమి లేదు. కాని ఇచ్చేవాడు పరిశుద్ధాత్మ మనము అడిగిన ప్రకారము తన ఇష్టానుసారంగా ఇస్తాడు. విశేషముగా మీరు ప్రవచన వరము ఆపేక్షించండి. వాక్య విషయమైన అపేక్షకలిగివుండాలి. లోకంలో ఉన్నవన్నియు గతిస్తాయి. కాని దేవుని వాక్యం గతించదు. వాక్యము నేర్చుకొను విధానము, ప్రకటించుట విధానము, ప్రవచించు విధానము ఆపేక్షించండి. అది ఎంతో అవసరమైనది.

మీ కొరకు ఆత్మసంబంధమైనవి మేము విత్తి వుండగా (1 కొరింథీ. 9:11) అని పౌలు అంటున్నాడు. విత్తడము అంటే పొలములో విత్తడము కాదు. ఆత్మ సంబంధమయినవి విత్తే విధానము గూర్చి చెబుతున్నాడు. తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంటను కోయును. ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంటకోయును. (గలతీ. 6:8) విత్తు సమయంలో కూడా శరీరము అడ్డువస్తున్నాడు. ప్రార్థన చేసేటప్పుడు అడ్డువచ్చాడు. బోధించేటప్పుడు అడ్డువచ్చాడు. విత్తు విషయంలో కూడా శరీరమును బట్టి విత్తువాడు, ఆత్మనుబట్టి విత్తువాడు అని ఉంది. శరీరమును బట్టి అయినా మనము విత్తవచ్చును, ఆత్మనుబట్టి అయినా మనము విత్తవచ్చును. విత్తే వాళ్ళు చాలామంది ఉన్నారా? లేరు. కొద్దిమందే. కోత విస్తారముగా ఉందిగాని పనివారు కొద్దిమందే అని ప్రభువు చెప్పాడు. అలాగే విత్తువారు కొద్దిమందే. ఈ కొద్దిమందిలో కూడా ఆత్మను బట్టి విత్తువారు కొద్దిమంది, శరీరమును బట్టి విత్తువారు కొద్దిమంది. శరీరమును బట్టి విత్తుచున్నామా ఆత్మను బట్టి విత్తుచున్నామా అని ఎవరికి వారు పరీక్షించుకోవాలి.

ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మ నుండి నిత్యజీవమను పంటను కోయును. ఆత్మీయుడా నీవు విత్తు విధానము ఆత్మను బట్టి ఉంటే నిత్యజీవమనే పంటను కోస్తావు. మీ కొరకు ఆత్మసంబంధమైనవి మేము విత్తియుండగా మీ వలన శరీర ఫలములు కోసుకొనుట గొప్ప కార్యమా (1 కొరింథీ.9:11) అంటే గొప్పకార్యము కాదు అని అర్థము. అనగా ఆత్మనుబట్టి విత్తే వారికి శరీరసంబంధమైన ఫలము కూడా ఉంటుంది. అంటే ఆత్మసంబంధమైన పనికి రెండు జీతాలు ఉన్నాయి. భూలోకంలో ఒక పనికి ఎవరైనా రెండు జీతాలు ఇస్తారా? ఒక పనికి ఒక జీతం ఇచ్చేదే కష్టం. కాని ఆత్మను బట్టి విత్తే వారికి రెండు జీతాలు. ఆత్మఫలం, శరీరఫలం రెండూ వున్నాయి. ఆత్మపరిచర్య ఎంత గంభీరమైనదో గమనించండి.

1 కొరింథీ. 9 అధ్యాయంలో మొత్తం 27 వచనాలు ఉన్నాయి. 14వ వచనాన్ని దీనికి కేంద్రవచనముగా చదువుకోవచ్చు. సువార్తను ప్రచురించువారు సువార్త వలన జీవింపవలెనని ప్రభువు నియమించుచున్నాడు (14). సువార్త ప్రకటించుట కాదు ప్రచురించుట అని ఉంది. ఎంత మంచిపేరో చూడండి. ఆత్మనుబట్టి విత్తువారికి సువార్తికుడు అని పేరు. నీవు ఎవరు అంటే సువార్తికుడిని అని చెప్పడం బాగుంది. సువార్త ప్రచురించువాడిని, సువార్త ప్రకటించువాడిని అను మాటలు చాలా బాగున్నాయి. కాని ప్రకటనకు, ప్రచురణకు తేడా వుంది. ప్రకటన అంటే చెవులకు మాత్రమే వినిపిస్తుంది. ప్రచురణ అంటే కండ్లకు కూడా కనిపిస్తుంది. నీవు చెప్పే ప్రకటనలో నోటితో ఏమి చెప్పినా వినేవాడి కండ్లకు అగుపించాలి. అబ్బ కండ్లకు కట్టినట్లుగా చెప్పినావయ్యా అంటూ వుంటారే అలాగు ఉండాలన్న మాట.

ఏమి చెప్పినాడో నోమో అన్నట్లు కాక ఆత్మను బట్టి విత్తే పరిచర్య చెవులకు వినిపించాలి. కండ్లకు కనిపించాలి. నీకు 20 ఏండ్ల తర్వాత ఆ ఊరికి వెళ్ళినా ఆరోజు నువ్వు చెప్పిన మాటలు అట్లానే గుర్తుకు ఉన్నాయి. అవి నాకండ్లముందు కండ్లకు కట్టినట్లు ఉన్నాయి. నా జీవితంలో కార్యసిద్ధి కలిగించాయి అనే మాటలు వినపడాలి. లేకపోతే ప్రొద్దున చెప్పినది మధ్యాహ్నము గుర్తు లేకపోతే అది ప్రచురించే పరిచర్య కాదు.

13వ వచనంలో ఆలయకృత్యములు జరిగించువారు. ఆలయం వలన జీవనము చేస్తున్నారనియు, బలిపీఠము యొద్ద కనిపెట్టుకొని వుండువారు బలిపీఠముతో పాలివారై ఉన్నారనియు మీరు ఎరుగరా? ఇందులో ఆలయకృత్యములు జరిగించే పరిచర్య జరుగుతుంది.

ఒక కర్నూలు జిల్లాలో 100 నుండి 120 వరకు సంఘములు ఉన్నవి అనుకుంటే అవే ఆలయాలు. ఈ ఆలయాలలో కృత్యాలు జరిగించేవారున్నారు. అది కూడా పనే. ఉదాహరణకు ఒక ఊరులో సంఘములో పనిచేసేవారు ఉన్నారు అనుకోండి. వారు సరిగా పనిచేయకపోతే ఉపయోగము లేదు. కొందరి ఇండ్లను దర్శించినపుడు "మేము ఆ మీటింగులలో తీర్మానం చేశాము. తర్వాత మమ్మును కలిసినవారు లేరు" అంటూ వుంటారు. దీని అర్థము ఆలయకృత్యములు సరిగా జరిగించలేదు అని.

స్పెషల్ మీటింగులతో వచ్చే ఉజ్జీవం కొంతవరకే ఉంటుంది. ఉజ్జీవం కూడా స్పెషల్‌గా వస్తుంది. స్పెషల్‌గా తగ్గిపోతుంది. ఆ తర్వాత ఆలయాల్లో, మందిరాల్లో, కృత్య ములు నిత్యము జరిగించే వారు తయారు కావాలి. దానికి సంపూర్ణముగా సేవకు అర్పించుకున్నవారే అక్కర్లేదు. ఏ ఆలయకృత్యానికైనా సంపూర్ణ సేవకులే అవసరంలేదు. ఎవరికి చేతనైన కృత్యములు వారు జరిగించవచ్చు. కొన్ని మండలాలలో సువార్తకు అప్పగించుకున్నవారు లేకపోయినా మండాలాలు మండలాలు సువార్త చేస్తున్నారు. ఎన్నో సంఘాలు కట్టబడ్డాయి. వాటిల్లో ప్రత్యేకించబడిన సువార్తికులు లేరు. వారు మనకు ఎంతమాదిరి.

అట్లని ప్రత్యేకించబడిన సువార్తికులు అవసరమే లేదని కాదు. వాళ్ళు చాలా అవసరమే. ఆలయములో కృత్యములు జరిగించుటను, కార్యక్రమాలు జరిగించుటను నమ్మినవారు ఎవరైన చేయగలరు. ఈరోజు విత్తారు చిన్న మొలక వచ్చింది. ఆ మొలక ఏమిటో చూచుకోవాలి. చూడకపోతే ఫలం ఎలాగు వస్తుంది. ఇవి చూచేవారే ఆలయకృత్యములు జరిగించేవారు. ఇంకా 13వ వచనంలోనే బలిపీఠము వద్ద కనిపెట్టుకొని ఉండువారు అని ఉంది. ఇలా చాలా పేర్లు ఉన్నాయి. సువార్త ప్రచురించేవారు, ఆలయకృత్యాలు జరిగించేవారు, కనిపెట్టుకొని ఉండేవారు ఎవరి పని వారిది.

16వ వచనంలో నేను సువార్తను ప్రకటించుచున్నను నాకు అతిశయ కారణం లేదు. అనగా ఆలయకృత్యములు జరిగించువారు అతిశయపడకూడదు. ఎందుకంటే సువార్తను ప్రకటింపవలసిన భారము నామీద మోపబడి ఉంది అని పౌలు అంటున్నాడు. కనుక ఆలయకృత్యములు భారము మనమీద ఉంది.

శారీరకముగా వీత్తినవాడు ఏమంటాడు? ఆ ఊరికి నాలుగుసార్లు పోయాను. చార్జీలు పెట్టుకున్నాను. నాకు ఏమీ సహాయం లేదు. కాబట్టి ఆపేశాను అంటాడు. కాని ఆత్మనుబట్టి విత్తువాడు నా మీద ఉన్న భారమును తీర్చుకోవడానికి ఆ ఊరికి వెళ్ళాను. భారము వాళ్ళ మీద పెట్టాను అంటాడు. శరీర సంబంధమైన దానిని అపేక్షించడు. ఆత్మఫలం కొరకే ఎదురు చూస్తాడు.

16వ వచనంలో ఇంకా అయ్యో! సువార్త ప్రకటింపక పోయినయెడల నాకు శ్రమ అంటున్నాడు. సువార్త ప్రకటిస్తే, శ్రమలేదు. శుభ్రంగా ఇంట్లోనే ఉండే శ్రమ ఆత్మసంబంధంగా విత్తడం అంటే ఇదే. సువార్తను ప్రకటించకపోతే శ్రమలను ఎదుర్కొంటాడు. కాడికి అలవాటు కాని కోడె దెబ్బలకు లోబడునట్లు నేను శిక్షను లోబడుచున్నాను (యిర్మియా 31:18). కాడికి అలవాటు కాకపోతే రైతులు కోడెల వీపులు పగులగొడతారు. ముల్లు గర్రతో రక్తం వచ్చేటట్లు పొడుస్తారు.

ఆత్మను బట్టి విత్తేవారి భారం ఇట్లే ఉంటుంది అన్నమాట. పోకుండా ఉండలేడు. ఉంటే తన దేవుడు ఉండనీయడు. ఆత్మనుబట్టి విత్తుచున్నావా ఆ భారమును దించుకోకపోతే శ్రమ అని గుర్తించాలి. కొద్దిమందికి ఆ గుర్తింపు లేదు. 365 దినములలో ఒకనాడు సువార్త చెబితే మిగిలిన 364 దినాలలో సువార్త చెప్పినాము, సువార్త చెప్పినాము అని చెప్పుకోవడమే ఎక్కువ. ఒకసారి ఒక సంఘమువారు ఫలానా గ్రామములో సువార్తను చెప్పాము అన్నారు. ఎప్పుడు అని వివరాలలోనికి వెళితే 10 సంవత్సరముల క్రితం అని తేలింది.

జనవరిలో సువార్త చెప్పినావు. ఫిబ్రవరిలో, మార్చిలో, ఏప్రిల్‌లో చెప్పావా? జనవరిలో రెండు రోజుల సువార్త యాత్ర చేసినాము. మంచిదే మిగిలిన 29 రోజులు

ఏమయింది? సువార్త ప్రకటించే భారము నీమీద మోపబడలేదా? ఆత్మనుబట్టి విత్తువాడు మౌనంగా ఉండలేడు.

శరీరాన్ని బట్టి విత్తేవాడు మాత్రం కాళ్ళు నొప్పులు, వొళ్ళునొప్పులు అంటాడు. ఆ జబ్బు ఈ జబ్బు అంటాడు. బలహీనతలు లేనివారు ఎవరు లేరు. కాని శరీరమును బట్టి విత్తువానికి అన్ని కనిపిస్తాయి. మరి ఎలా విత్తుచున్నావో ఆలోచించండి.

17వ వచనములో ఇది నేను ఇష్టపడి చేసినయెడల నాకు జీతము దొరుకును. ఇష్టపడకపోయినను గృహనిర్వాహకత్వము నాకు అప్పగించబడెను అంటున్నాడు. నా నెత్తిన బరువుపెట్టినావు, మరేమి చేయాలి. నాకు ఇష్టం లేదు. అయినా చెప్పి తీరాలి. కాని సేవకులు అట్లు అనడం లేదు. నా ఇష్టం నేను పోను అంటున్నారు. నీకు ఇష్టమయినా ఇష్టము కాకున్నా పోవాలి. గృహ నిర్వాహకత్వము నీకు అప్పగించబడినది. ఆ భారం నీవు గుర్తించావా?

నీకు ఇష్టము వస్తే పోతావు. ఇష్టం లేకపోతే పోవు. ఇష్టమైన స్థలానికి పోతావు. ఇష్టము కాని స్థలానికి పోవు. ఆత్మను బట్టి విత్తువాని పరిస్థితులు అట్లు ఉండవు. నేను ఇష్టపడకపోయినను గృహనిర్వాహకత్వము అప్పగించబడినది. ఇష్టపడకపోయినా విత్తే పరిచర్య నాకు అప్పగించబడినది. విత్తితీరాలి. మీ భూమి పదును అయ్యింది. శరీరంలో మీకు అనారోగ్యముగా ఉన్నది. రెండురోజులు విత్తకపోతే ఏమవుతుంది. భూమి ఆరిపోతుంది. అబ్బే నాకు ఇష్టములేదు అన్నారు అనుకోండి. ఊరుకుంటారా? ఎంత నష్టం. ఆత్మీయ పరిచర్య అటువంటిది. ఇష్టపడకపోయినా సరే విత్తాలి.

18వ వచనంలో అట్లయితే నాకు జీతం ఏమి? జీతాలు జీతాలు ఈ రోజులలో జీతాల గురించి సమస్యలు వస్తున్నాయి. జీతము కోసము ఎదురు చూచేవారు జీతం కోసమై పనిచేసేవారు ఉన్నారు. పౌలు జీతం ఏమిటో చూడండి. నేను సువార్తను ప్రకటించునపుడు సువార్త యందు నాకున్న అధికారమును పూర్ణముగా వినియోగపరచుకొనకుండా సువార్తను ఉచితముగా ప్రకటించుటయే నాకు జీతము అంటున్నాడు. ఏదైనా పనికొరకై ఉచిత జీతము అని వ్రాశారు అనుకోండి. ఆ పనికి వెళ్తారా? ఇది ఆత్మీయముగా విత్తువాడు కలిగి వుండవలసిన భారము.

**19-22** చదివితే నేను అందరి విషయం స్వతంత్రుడనై ఉన్నను ఎక్కువమందిని సంపాదించుకొనుటకు నన్ను నేను దాసునిగా చేసుకొంటిని అంటున్నాడు. అదే నీ జీతం. ఎక్కువమందిని సంపాదించుకొనడమే విత్తువానికి జీతం. ఎంతమందిని సంపాదించావు. నీవు రక్తము కార్చలేదు. రక్తము కార్చింది ప్రభువే. బోధించువాడు పరిశుద్ధాత్ముడే. పరిశుద్ధాత్ముడు నిన్ను ఒక మైకులాగా వాడుకుంటున్నాడు. అంతా మేము చేసినాము. మేము రక్షించినాము. మేము కట్టినాము. మేము బాప్తిస్మమిచ్చినాము. ఇలాంటి మాటలు మనకు తగదు.

ఎంతమందిని సంపాదించావు. ఎంతమందిని సంపాదించాలనుకుంటున్నావు. ఎక్కువమందిని సంపాదించుటకు అందరికి నన్ను నేనే దాసునిగా చేసుకొంటిని అని పౌలు అంటున్నాడు. ఎక్కువమందిని సంపాదించాలి. అంటే యజమానునిగా కాదు. దాసునిగా వుండాలి. యూదులను సంపాదించుకొనుటకు యూదులకు యూదుని వలె ఉంటిని. ధర్మశాస్త్రమునకు లోబడిన వారిని సంపాదించుకొనుటకు నేను ధర్మశాస్త్రమునకు లోబడిన వాడను కాకపోయినను ధర్మశాస్త్రమునకు లోబడిన వానివలె ఉంటిని. ధర్మశాస్త్రము లేని వారిని సంపాదించుకొనుటకు ధర్మశాస్త్రము లేని వాని వలె ఉంటిని. బలహీనులను సంపాదించుకొనుటకు బలహీనులకు బలహీనుడనైతిని. ఏవిధము చేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధముల వాడనై ఉన్నాను.

పౌలు ఉద్దేశము సంపాదన. ఎవరిని సంపాదించుటకు వారివలె ఉన్నాడు. ఇహలోకములో ఆత్మనుబట్టి విత్తువారికి పౌలు మంచి మాదిరి. మరియు పందెమందు పోరాడువాడు అన్ని విషయముల యందు మితముగా ఉండును. వారు క్షయమగు కిరీటమును పొందుటకు మనమైతే అక్షయ కిరీటము పొందుటకును మితముగా ఉన్నాము. ఈ రీతిగా ఆత్మను బట్టి విత్తువానికి అక్షయ కిరీటము దొరుకుతుంది. పరలోకంలో ఫలము దొరుకుతుంది. అదే వారి సంపాదన. భూలోకంలో సంపాదన లేదు. ఆ ఆత్మీయుల సంపాదన పరలోకంలో కిరీటముల సంపాదన. ఇదే పౌలు మాదిరి.

9-11 మళ్ళీ చదువుదము. మీ కొరకు ఆత్మసంబంధమైనవి మేము విత్తి వుండగా మీ వలన శరీర సంబంధమైన ఫలములు కోసికొనుట గొప్ప కార్యమా? ఆత్మసంబంధమైనవి విత్తినవారు శరీరసంబంధమైన ఫలములు కోసికొనుట తప్పుగాదు, ఉచితముగా ప్రకటించుచున్నాడు. బైబిలు అలాగే చెబుతుంది అని సేవకుల నోర్లు కొట్టవద్దు. వారి ఖాళీ చేతులతో పంపవద్దు. శరీర సంబంధమైన ఫలములను వారికిచ్చుట అన్యాయం కాదు. అది బైబిలు క్రమము.

మీ శరీరానికి ఏవేవి పెడుతున్నారో వాళ్ళకు అవే పెట్టండి. శరీరసంబంధమైన ఫలాలు ఇవ్వండి. తమకు వేల జీతము ఉండగా సేవకునికి ఒక రు.1000/- ఇవ్వడానికి కష్టపడేవారు చాలామంది ఉన్నారు. మా సంఘం వారు నాకు ఒక రు.100/- ఇవ్వడానికి కష్టపడినారు అన్నా అని ఒకాయన అన్నాడు. ఎంత అవమానకర పరిస్థితి. ఆత్మసంబంధమైనవి విత్తేవాళ్ళకు శరీరసంబంధమైన ఫలములను మీరెందుకు ఇవ్వరు? వాళ్ళ శరీరాలకు ఏమేమికావాలో ఇవ్వండి. కడుపుకు అన్నము కట్టుకోవడానికి బట్టలు కావాలి. సువార్తకు పోవాలంటే సైకిలు కావాలి. నోటితో గట్టిగా అరవాలంటే మైకు కావాలి. బ్యాటరీలు అవసరం. బస్సు చార్జీలు అవసరం. వారికి భార్యాబిడ్డలు ఉన్నారు. కుటుంబ అవసరములు వున్నవి. శరీర ఫలములు ఇవ్వాలా వద్దా. మీరు ఇస్తున్నారా చెప్పండి.

సేవకులు ఆత్మసంబంధమైనవి విత్తువారు. శరీర సంబంధమైనవి విత్తరు. వారి శరీర ఫలముల కొరకు మీరేమి విత్తుచున్నారో ఆలోచన చేయుండి. మీ ఇంట్లో 10 మూటల వడ్ల గింజలు ఉంటే ఒక్కొక్కరు ఒక్క మూట చొప్పున పదిమంది పది మూటలు వారి ఇంట్లో దింపిరండి. వారికి కూడా 10 మూటలు అవుతాయి. ఇది ఒక ఉదాహరణ చెప్పుచున్నాను. ఆత్మసంబంధమైనవి విత్తేవారికి శరీరఫలాలుకూడా అందివ్వాలి. దేవుడు మిమ్మును ఆశీర్వదించును. అలాగు చేయుటకునడిపించునుగాక!

★★★

# 2 కొరింథీ పత్రికలో పరిశుద్ధాత్మని పరిచర్యలు

ఇందులో ఆత్మ అనే పదము 12 పర్యాయాలు ఉన్నది. 2 కొరి. 1:22లో ఆయన మీతో కూడ క్రీస్తునందు నిలిచి ఉండునట్లుగా మమ్మును స్థిరపరచి అభిషేకించినవాడు దేవుడే అని ఉంది. ఆయన మనకు ముద్రవేసి మన హృదయములో ఆత్మ అను సంచకరువును అనుగ్రహించి ఉన్నాడు. మనలను అభిషేకించినవాడు దేవుడే. అభిషేకం అను పదానికి ఆత్మాభిషేకం అని సర్వసాధారణముగా చెప్పుకోవచ్చు. మనలను ఆయన ఆత్మచేత అభిషేకించాడు. మమ్మును అంటే పౌలును, నమ్మిన మనందరిని కూడా అభిషేకించాడు. అభిషేకం అనగా ఆత్మముద్ర అని కూడా అర్థం. అనగా ఆత్మ చేత ముద్రించి మనహృదయంలో మనకు ఆత్మ అను సంచకరువును అనుగ్రహించాడు.

కొరింథీ రెండవ పత్రికలో 13 అధ్యాయములు ఉన్నవి. సగానికి చేస్తే (7+6) గా విడగొట్టవచ్చు. మరలా 7ను (2+4+1)గా, 6ను (2+4)గా విడగొట్టవచ్చు. పత్రిక అంతా 13 = 2+4+1+2+4 గా విడగొట్టవచ్చు. పత్రిక సారాంశమంతా పరిచర్య అని ఒక్కమాటలో చెప్పవచ్చును. మొదటి రెండు అధ్యాయాలలో క్రీస్తునందు జీవించు పరిచర్య వివరముగా చెప్పాడు. 3 నుండి 6 వరకు క్రీస్తునందు చేయవలసిన పరిచర్య 7వ అధ్యాయములో ప్రభువునందు ప్రత్యేకత గల పరిచర్య చెప్పబడినది. 8, 9లలో ప్రభువుకు ఇచ్చు పరిచర్య ఉంది. 10 నుండి 13లలో క్రీస్తు నందు భద్రపరచుకొను పరిచర్య ఉంది. ఈ రీతిగా విభజించినపుడు ప్రతిభాగంలో పరిశుద్ధాత్ముని పరిచర్యను మనం చూడవచ్చు.

ఆత్మాభిషేకము, ఆత్మముద్ర, ఆత్మ అనే సంచకరువును గురించి 1:21, 22 వచనాలలో చదువగలం. చాలాసార్లు లోకములో అభిషేకము, ఆత్మాభిషేకము అనే మాట తప్పుగా అర్థము చేసుకొని వివరించడము చూస్తున్నాము. చాలా పత్రికలు (మాగజైన్స్) మా యింటికి వస్తాంటాయి. అందులోనేను 96 నం॥లో రక్షింపబడ్డాను, 97లో బాప్తిస్మము పొందాను, 98లో ఆత్మాభిషేకము పొందాను అని ఆ పత్రిక కవరు మీద ఉంది. కానీ ఆ మాట వాస్తవమైనా, లేఖనాలు దాన్ని అంగీకరిస్తున్నాయా అని గమనిస్తే లేఖనాల్లో ఆ సత్యము లేదు.

ఆత్మాభిషేకము అనగా ఆత్మచేత మనము ముద్రించబడడమే. ఆత్మ అనే సంచకరువు మనకు అనుగ్రహించబడడమే. ఎప్పుడు మనము ముద్రించబడుచున్నాము? ఎప్పుడు మనము సంచకరువును పొందుచున్నాము? ఎఫెసీ 1:13,14 చదివితే మీరును సత్యవాక్యమును అనగా మీ రక్షణ సువార్తను విని క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిరి. దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు అని ఉంది. విశ్వాసము ఉంచినపుడే వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్ర కలిగింది. 96లో విశ్వాసము ఉంచితే 98లో ముద్ర కలుగుతుందా? కాదు. విశ్వాసముంచుట ఆత్మతో ముద్రింప బడుట. ఒకేసారి జరుగునవి అని అర్థం.

విశ్వాసముంచడము, ఆత్మచేత ముద్రించబడటము వెనువెంటనే జరుగుతాయి. ఆత్మముద్రనే ఆత్మాభిషేకము అంటారు. 1996లో విశ్వాసముంచారు, 96లోనే విశ్వాసముంచినపుడు ఆత్మాభిషేకము పొందుతారు. 14వ వచనంలో ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు అని ఉంది. స్వాస్థ్యమునకు సంచకరువు అనగా మనలను సంపాదించుకొనినాడు అని అర్థం. అనగా కొన్నాడు అని అర్థం. ఎలా కొన్నాడు? తన సొంత రక్తమును, అమూల్యమైన రక్తమును ఇచ్చికొన్నాడు. కొన్నప్పుడు సంచకరువు ఇస్తారు. మన ప్రాంతాలలో సంచకారము అంటారు. ఏదైనా వస్తువును కొన్నపుడు సంచకారము ఇస్తే ఆ వస్తువును ఇక ఎవ్వరికీ అమ్మకూడదు.

ఒకడు ఒక లక్షకు ఒక జీపును కొన్నాడనుకోండి. ఒక వెయ్యి రూపాయలు సంచకారము ఇచ్చాడనుకోండి. రేపు ఇంకోవ్యక్తి వచ్చి, లక్షాయాభైవేలకు అడిగినా జీపు యజమాని అమ్మడము అయిపోయింది, సంచకారము కూడా యిచ్చారు, ఇక ఎంతకైనా మీకు రాదు అంటాడు. వెయ్యి రూపాయలు ఇచ్చినా లక్షరూపాయల జీపు మీద హక్కు ఏర్పడింది. అలాగే మనలనుకొన్నందుకు ఆయన ఆత్మ అనే సంచకరువును ఇచ్చాడు. అయిపోయింది. మనము ఆయన వారము. నేను 96లో రక్షించబడ్డాను, 97లో

బాప్తీస్మము పొందాను, 98లో ఆత్మను పొందాను అంటే సరియైన క్రమము కాదు. 96లో కొన్నవాడు, 98లో సంచకరువు ఇస్తాడా? లేదు లేదు. లోకసంబంధమైన మాటలు చాలా ఖచ్చితముగా అర్థం చేసుకుంటాం. ఆత్మీయ విషయాలను ఎందుకు అర్థం చేసుకోలేము.

కాబట్టి ఆత్మ అనే సంచకరువును మనము నమ్మినపుడే పొందుచున్నాము. యేసు రక్తం ద్వారా కడుగబడినపుడే పొందుచున్నాము: యేసురక్తంలో కడుగబడిన వారికే ఆ ఆత్మ సంగతులు సంతోషాన్నిస్తాయి. కడుగబడ్డారా? లేదా? ఆలోచించండి. ఆయన మిమ్మును కొన్నాడా? మీరు ఆయన సంపాద్యమేనా? మీరు ఆయన ప్రజలేనా? లేకుంటే ఇప్పుడే ఆయన కొనడానికి ఇష్టపడుచున్నాడు. మీ స్థితిగతులు ఏవైనా ఆయన మిమ్మును ఆహ్వానిస్తున్నాడు. ఒకవేళ మీరు ఆయనలో వివాదముతో ఉన్నారా? రండి మన వివాదము తీర్చుకొందము అంటున్నాడు. మీ పాపాలు నా రక్తంలో కడిగి మిమ్మును కొనుక్కుంటాను అంటున్నాడు. ఇదిగో సంచకరువును ఇస్తాను అంటున్నాడు. కొనేవారు అమ్మేవారికి సంచకరువును ఇస్తారు. మనలను మనమే అమ్ముకుంటున్నాము. ఆత్మ సంచకరువును ఇచ్చి అమూల్యమైన ఆయన రక్తం ద్వారా కొంటున్నాడు.

పుస్తకాలు కొంటున్నాము, అనేక వస్తువులు కొంటున్నాము. వాటి మీద వెలలు ఉంటాయి. అమూల్యము అంటే వెలకట్టలేనంత వెల. అమూల్య వస్తువులను కొనలేము. ఈ లోకంలో ఏ వస్తువుకైనా, దేనికైనా వెలకట్టవచ్చు. లక్షల్లోనో, కోట్లల్లోనో వెలకట్టునవి ఉంటాయి కాని యేసు కల్వరిలో కార్చిన రక్తానికి వెలకట్టలేము. వెల ఎప్పుడు వస్తాయి? పోటీ వచ్చినపుడు మార్కెట్లోకి ఒక కంపెనీ వస్తువులు వచ్చాయి అనుకోండి బాగున్నాయనుకోండి. ఇంకో కంపెనీ దానికి పోటీగా వస్తువులను ప్రవేశపెడితే వెలలు తగ్గిపోతాయి. కాని యేసురక్తానికి పోటీగా ఇంకెవరూ రక్తం చిందించలేదు. పరిశుద్ధులు ఈ లోకంలో ఎవరూ లేరు. పరిశుద్ధ రక్తం ఈ లోకంలో ఎవరికీ లేదు.

దూతలు ఉన్నారు: వారికి రక్తమాంసాలు లేవు. దేవుడు ధరింపజేస్తే తప్ప స్వతంత్రంగా ధరించుకోలేరు. కాని దేవుడు ధరించుకొనగలడు. దేవుడు రక్తమాంసాలు

ధరించుకొని ఈ లోకానికి వచ్చారు. హెబ్రీ 10:5లో నాకొక శరీరరమును అమర్చితివి అంటున్నాడు. ఆత్మ అయిన ఆయనకు దేవుడొక శరీరమును అమర్చినట్లు తెలుస్తున్నది. ఎందుకు రక్తమాంసములు ఆయనకు అనుగ్రహించాడు. రక్తం చిందింపకుండా పాపక్షమాపణ కలుగదు (హెబ్రీ 9:22). అందుకే ఆయనకు రక్తమాంసములు అవసరమై ఉన్నవి. అంతేకాదు. పరిశుద్ధ రక్తము ఎవరికీ లేదు. మనుష్యుల మధ్య పరిశుద్ధ రక్తము అమర్చుకొనగలిగిన వాడు సృజించగలిగిన వాడు కూడా దేవుడే. దూతలు పరిశుద్ధులే అయినా రక్తమాంసాలు ధరించుకోలేరని ముందే చెప్పబడింది.

ఆయన పరిశుద్ధ రక్తానికి పోటీ లేదు. అందుకే ఆయన రక్తము అమూల్యమయినది. సాటిలేనిది. అటువంటి పావన రక్తము ప్రపంచంలో మరొక చోట ఎక్కడా దొరకదు. అటువంటి అమూల్యరక్తముతో నిన్ను కొన్నాడు. నీవడిగితే నీ పాపాలు ఆ రక్తంలో కడుగుతాడు. యేసురక్తం ప్రతి పాపము నుండి కడుగుతుంది. నీవు కడుగబడ్డావా? ఎప్పుడు?

బయట తిరిగి వచ్చాము. చెమట పోసింది. వస్తూనే ముఖం కడుక్కుంటాము. ముఖం కడుక్కున్నారా అంటే కడుక్కున్నాము అని చెబుతాము. అలాగే యేసురక్తంలో కడుగుకున్నారా అంటే ఏమో అంటారు. ముఖం కడుక్కునే అనుభవము ఎంత స్పష్టమైందో పాపములు కడుగుకునే అనుభవము అంతే స్పష్టము. ఆత్మ ముద్ర కూడా అప్పుడు అనుగ్రహించబడినది. అదీ స్పష్టమే. అలాగే ఆత్మఅనే సంచకరువు అనుగ్రహించబడడము కూడా స్పష్టమే. కాని ఈ విషయాలు అర్థము కాకపోవచ్చు.

అప్పుడే పుట్టిన బిడ్డలో గుండె ఉంటుంది. రక్తనాళాలు ఉంటాయి. అవి ఒకదానికి ఒకటి జతచేస్తే లక్ష కి.మీ. పొడవు ఉంటాయట. మీరు నమ్ముతారా? నేను నమ్మలేకపోయాను. మనము నమ్మినా నమ్మకపోయినా ఇది సత్యమే. అలాగే కడుగబడడము, ఆత్మ ముద్ర, సంచకరువు ఇవి కూడా సత్యమయినవే.

ఫలానా రోజు పాపాలను ఒప్పుకున్నాము అని సాక్ష్యాలు చెప్తూ వుంటాము. ఎవరు మిమ్మలను ఒప్పింపచేశారు. ఆయనే. అలాగే రక్షణకార్యము కూడా ఆయనదే.

లేకపోతే మనము పాపాలను ఒప్పుకోలేము. లోకములో తప్పుచేసిన వారిని ఒప్పింప చేయడానికి 16 సాక్ష్యాలు తీసుకురావాలి. అయినా ఒప్పింపచేయలేకున్నారు.

విశ్వాసుల మధ్యకుడా తప్పు చేయలేదు అంటూ ఉంటారు. కాని ఒప్పింపజేయువాడు పరిశుద్ధాత్ముడు ఉన్నాడు. నిన్ను నన్ను ఒప్పింపజేయువాడు ఆయనే. అంటే పరిశుద్ధాత్మ దేవుని ఆధీనానికి అప్పగించుకున్నావు. ఆయన నీలోనికి వచ్చాడు. ఆయన మనలోను, మనతోను ఉంటాడు. నమ్మినరోజే నీలోనికి వచ్చాడు. నీలో ఉన్నాడు. విమోచన దినం వరకు ఉంటాడు. ఆత్మచేత ముద్రించబడ్డావు.

ముద్ర అనే మాటను జ్ఞాపకము చేసుకుందాము. ఎవరిదైనా భూమిని కొన్నావు. కాగితాలు బాగారాసుకున్నారు. అని రిజిస్టరు ఆఫీసులో నమోదు చేయబడకపోతే చెల్లవు. ఆఫీసులో కాగితాలు మీద ముద్ర పడాలి. లేకుంటే చెల్లవు. ఆఫీసుకు పోకముందు అమ్మినవాడు మనసు మారి ఆ భూమిని నేనే ఉంచుకుంటాను అనవచ్చు.

ఆఫీసులో కాగితాలు ఇచ్చిన తర్వాత ముద్రవేసి రికార్డులో రాసుకున్నారు. ఇప్పుడు పొలము ఇవ్వను అంటే సరిపోదు. ఆయన పొలము ఇవ్వను అన్నా ఆ పొలము నీదే. కాబట్టి ముద్ర అనేది కార్యము సంపూర్ణమై ఉన్నదానికి గుర్తుగా ఉంది.

ఆత్మచేత ముద్రించాడు. అంటే నీలో రక్షణకార్యము అయిపోయింది. ఆ కార్యము ముగించబడింది. నిన్ను కొనే విధానం అయిపోయింది. సంచకరువు ఇచ్చి ముద్రించబడింది. దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే. మరియు ఆయన తన ఆత్మ అను సంచకరువును మనకనుగ్రహించి ఉన్నాడు (2 కొరింథీ. 5:5) ఆ నివాసమును దీనిపైన ధరించుకొనగోరుచున్నాము (5:4) ఒక నివాసము మనకిచ్చారు. భూమిమీద మన గుడారమైన ఈ నివాసము శిథిలమై పోయినను, చేతిపనికాక దేవుని చేత కట్టబడినదియు నిత్యమైనదియునై నివాసము పరలోకమందు మనకున్నదని ఎరుగుదుము (5:1 – 2). పరలోకమందు మనకు నివాసము ఉంది. నమ్మినవాళ్ళు ఎక్కడికి పోతారు. తమ నివాసమైన పరలోకానికి పోతారు.

మనము ఎన్నో పనులకు బయటికి వెళ్తుంటాము. మన పనులు కాగానే మన ఇళ్ళకు వెళ్తాం. అలాగే ఈ లోకం వదలగానే నమ్మినవారు పరలోకం వెళ్తారు. యోహా 14:1-3లో మీ హృదయములను కలవరపడనియ్యకుడి. దేవునియందు విశ్వాసము ఉంచుచున్నారు. నా యందును విశ్వాసముంచుడి. నా తండ్రి ఇంట్లో అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును. మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద ఉండుటకు మిమ్మును తీసుకొనిపోవుదును అంటున్నాడు. పరలోకంలో నివాసం సిద్ధపరుస్తున్నాడు. సిద్ధపరచిన తర్వాత మరల వస్తాడు. తీసుకొని వెళ్తాడు. ఆ నివాసంలో మనలను పెడ్తాడు. దీని నిమిత్తమై మనలను సిద్ధపరచిన వాడు దేవుడే. దానికొరకై ఆత్మను సంచకరువుగా ఇచ్చాడు. దేనికొరకై సంచకరువు. పరలోకంలో ఆయన మనకొరకు ఇచ్చే స్వాస్థ్యము కొరకు సంచకరువు. మనకొరకై ఇంటిని సిద్ధపరుస్తున్నాడు. సిద్ధపరచిన ఆ యింటిలో మనలను చేర్చబోతున్నాడు. దానికొరకై మనకు సంచకరువు ఇచ్చాడు. నమ్మిన వారికి ఎంత ధన్యతో చూడండి. ఈ లోకంలో ఏమి ఉన్నా లేకపోయినా నమ్మినవారికి పరలోకము ఖాయము.

అంతేకాదు పరలోకములోని స్వాస్థ్యము నిత్యమైనది అంటున్నాడు. భూలోకములో ఏ ఇల్లు అయినా నిత్యమైనది కాదు. ఇల్లే కాదు ఏ స్వాస్థ్యమైనా (ఆస్తి) శాశ్వతము కాదు.

పరలోకంలో ఆయన దేని నిమిత్తమై మనలను సిద్ధపరచాడో, దేని నిమిత్తమై ఆత్మ అనే సంచకరువును మనకు ఇచ్చాడో ఆ స్వాస్థ్యము నిత్యమైనది. అది దేవుని చేత కట్టబడినది. అనుభవము గల పెద్ద ఇంజనీరు మనకు ఇల్లు కట్టిస్తే మనకు ఎంతో నమ్మకము. పరలోకంలో దేవుడే మన ఇంటిని కట్టాడు. భూలోకంలో ఎంతగొప్ప ఇల్లయినా చిన్న భూకంపం వస్తే చాలు కూలిపోతుంది. కాని పరలోకంలో ఆయన మనకొరకై కట్టిన కట్టడము యుగయుగములు నిలిచేది. ఆ కట్టడము పరలోకం నుండి భూలోకానికి దిగి వస్తుంది. ప్రక 21:10, 12 లో నూతన యెరూషలేము అను పట్టణము దిగివచ్చుట

నాకు చూపెను అని ఉంది. ఏ బిల్డింగు అయినా దిగిరావడము మనము చూశామా. మరి ఇది వస్తున్నది. అంటే ఎంత భద్రమైనదో చూడండి. ఎన్ని కదలికలు ఉన్నా ఎన్ని చలనాలు ఉన్నా ఏమయ్యేది కాదు. ఇది శాశ్వతమైనది, నిత్యమైనది.

నేను మీకు స్థలము సిద్ధపరచవెళ్ళుచున్నాను అని తెలుగు బైబిలులో ఉంది. కానీ ఇంగ్లీషు బైబిలులో భవనాల సముదాయము సిద్ధపరచుటకు వెళ్ళుచున్నాను అని ఉంది. భవనాల సముదాయము భూమి మీదికి దిగి వచ్చుట యోహాను చూచాడు. అది మనకు ఇవ్వనైయున్నారు. అందుకే ఆత్మ అనే సంచకరువును ఇచ్చాడు.

**2** కొరింథీ పత్రికలో జీవించే పరిచర్య ఉంది అనుకున్నాము. **3:3** రాతి పలక మీదగాని సిరాతో గాని వ్రాయబడక మెత్తని హృదయములు అను పలకమీద జీవము గల దేవుని ఆత్మతో మా పరిచర్యమూలముగా వ్రాయబడిన పత్రికయై ఉన్నారని మీరు తేటపరచబడుచున్నారు. మీరు పత్రికలు వ్రాస్తూ ఉంటారు. సిరాతో కాగితము మీద వ్రాసి లేదా సిరాతో కాగితము మీద ముద్రించి వ్రాసే విధానము చాలా ఉన్నాయి. ఎప్పుడు మీటింగులు అవీ ఇవీ వచ్చినా వ్రాసి పంచుతూ ఉంటారు. పలకలమీద వ్రాస్తూ కొండమీద రాతిపలకమీద చెక్కబడిన వాక్యాలున్నాయి. ప్లేట్లమీద, అక్కడక్కడ బోర్డుల మీద వాక్యాలు వ్రాసి మనము పెట్టాము. అవన్నీ మనము వ్రాసినవి. కానీ చేతితో వ్రాయబడకుండా మనహృదయమనే పలకమీద వ్రాయబడి ఉన్నాము. క్రీస్తు పత్రికలు మనమేనట. హృదయమనే పలకమీద వ్రాయబడి ఉంది. అంటేమన జీవితాలే ఒక పత్రిక. ఎవరు వ్రాస్తున్నారు? దేవుని ఆత్మ. దేవుని ఆత్మతో మన పరిచర్య మూలముగా వ్రాయబడే పత్రికలు. దేవుని ఆత్మ ఇంకా ఏమి చేస్తున్నాడు. ఆత్మతో ముద్రించాడు. ఆత్మతో స్వాస్థ్యముగా నిన్నుకొన్నాడు. ఆత్మ అనే సంచకరువు ఇవ్వబడింది. ఆత్మ మీ హృదయంలోనికి వచ్చి తర్వాత నీ హృదయమే ఒక పత్రికగా వ్రాస్తున్నాడు.

మన శరీరాలే ఒక పత్రికగా ఉన్నాయి. మన జీవితాలే పత్రికలు. రోడ్లలో పత్రికలు పంచుట మంచి అలవాటు. ఇపుడు పెద్దపెద్ద మీటింగులపుడు తప్ప ఒంటరిగా పత్రికలు పంచే అలవాటు ఆగిపోతోంది. కాని గుర్తుంచుకోండి. మన జీవితాలే పత్రికలు.

బస్సు ప్రయాణంలో సీట్లకొరకై కొట్లాడుతూ ఉంటాము. మనమే ముందు కర్చీఫు వేసినా ఎవరో ఒకరు కూర్చున్నారనుకోండి. వదలిపెట్టము. అతను లేచినంతవరకు కొట్లాడుతాము. ఆ తర్వాత పత్రికలు తీసి అతనికి ఇచ్చామనుకోండి. ఏమంటాడు? నీ పత్రిక నీ దగ్గరే పెట్టుకోవయ్యా చూసినాము గానీ అంటాడు. అంటారా? అనరా? ఎన్నిసార్లు ఇలాంటి విషయాల్లో ఓడిపోతున్నాము. రిక్షావాడి దగ్గర, ఆటో డ్రైవర్ దగ్గర చిల్లర కొరకో, దేని కొరకో కొట్లాటలు ఉన్నాయి. పెద్దవాళ్ళము, చిన్నవారు అనేక విషయాల్లో తప్పిపోతున్నారు. మన జీవితాలు ఒక పత్రికలు. మనము ఎవరింట్లో అయినా బాడుగకు ఉండవచ్చు, ఏదైనా ఆఫీసులో పనిచేస్తూ ఉండవచ్చు. మీరే ఒక పత్రిక.

ఫాక్స్ గారికి అనంతపురంలో స్వంత ఇల్లు లేదు. అనంతపురంలో బాడుగకు ఉండేవారు. చాలాకాలం ఆయన ఒక బ్రాహ్మణుడి ఇంట్లో ఉండేవారు అంటారు. ఆ యజమానిని పలకరిస్తే ఫాక్స్‌గారి భార్యను గూర్చి ఆమె ఒక మహాతల్లి అనేవాడట. ఆమెలో ఒక మహాతల్లిని చూచాడు. వ్రాయబడిన క్రీస్తు పత్రిక అంటే ఆమెలో క్రీస్తును చూచారు. మిమ్మును గూర్చి మీ యింటివారు ఏమనుకుంటున్నారు. మీ యింటిలో బాడుగకు ఉండేవారు ఏమనుకుంటున్నారు. మిమ్మల్ని గూర్చి పొరుగింటివారు ఏమనుకుంటున్నారు. మీరు ప్రయాణం చేస్తుంటే మీ తోటి ప్రయాణీకులు, మీరు ఉద్యోగం చేస్తుంటే మీ సహోద్యోగులు మిమ్ములను గూర్చి ఏమనుకుంటున్నారు. మిమ్మును క్రీస్తుపత్రికగా చెబుతున్నారా లేక సాతాను పత్రికగా చెబుతున్నారా?

**2** కొరింథీ. **3:6** ఆయనే మమ్మును క్రొత్తనిబంధనకు అనగా అక్షరమునకు కాదు గాని ఆత్మకే పరిచారకులమగుటకు మాకు సామర్థ్యము కలిగించియున్నాడు. **3**వ అధ్యాయమును క్రీస్తుకొరకై చేయాల్సిన పరిచర్య అన్నాము. మనలను పరిచారకులనుగా చేశాడు. పనివారలనుగా చేశాడు. బైబిల్లో పరిచర్య – పని అనే పదాలు కొంచెం తేడాగా కన్పిస్తున్నాయి. పని అనునది అధికారముతో కూడినది. పరిచర్య అనగా అధికారము లేదు. పాతనిబంధనలో లేవీయుల గురించి మాట్లాడుతూ సంఖ్యా. **8:24-26**లో **50** ఏండ్ల వయసు వచ్చేంతవరకు పనిచేయాలి. **50** దాటితే పని మానమన్నాడు. కాని

పరిచర్య చేయమన్నాడు. అంటే బాధ్యతతో కూడిన పని యవ్వనకాలము మధ్య కాలములో చేయమన్నాడు. మిగిలిన జీవితకాలములో పరిచర్యా చేయాలి. అయితే బాధ్యత ఏమీ ఉండదు. దానినే పరిచర్య చేయవలెను అన్నాడు.

మొన్న ఐ.ఏ.యస్. ఆఫీసరు ఒకాయన హైదరాబాదులో చనిపోయారు. ఆయన 55 ఏండ్ల వరకు కలెక్టరుగా పనిచేశారు. అపుడు గొప్ప అధికారము ఉండేది. పని విరమణ తర్వాత హైదరబాదులో ఇల్లు కట్టుకొని తనకున్న అనుభవమును బట్టి ఆఫీసులో ఉన్నవారికి తాను చనిపోవు వరకు సలహాలు ఇచ్చేవాడు. ఇది పరిచర్య. అవి ఆఫీసులో ఉన్నవారు వినవచ్చు, వినకపోవచ్చు. అంతకుముందు ఆఫీసులో ఆయన సంతకము చేసి అలాగు చెయ్యాలి అంటే చేసితీరాలి. ఇప్పుడు ఆఫీసులో లేడు. ఆయన చెప్పే మాటలు సహాయకరమైనవే కాని అధికారపూర్వకమైనవి కావు. సహాయకరమైన వాటిని అధికారులుగా ఆఫీసులో ఉన్నవారు పరీక్షించి సందర్భానుసారముగా వాడుకుంటారు. పరిచర్య అనగా జరిగేపనికి సహాయకరమైనది. ఆలాగే సేవాజీవితంలో కూడా రెండు రకాలు ఉన్నాయి. దేవుడు అధికార పూర్వకముగా కొన్ని పనులు అప్పగించాడు. ఆ తర్వాత చనిపోవువరకు అధికారము లేని పరిచర్య చేయమన్నాడు. దేవుడు మనకు అధికారము చేయమని, పెత్తనం ఇచ్చాడని పరిశుద్ధాత్మ చెప్పడము లేదు. ఇక్కడ పరిచారకులుగా చేశాడు. అక్షరానికి కాదు ఆత్మకు పరిచారకులుగా చేసారు. బాధ్యతతో కూడిన పనియైనను ఇతరులకు సహాయము చేయుపరిచారకులముగా చేయాలి.

ప్రియులారా ఆత్మ నిన్ను, నన్ను కొన్నాడు. ముద్రవేశాడు. పరిచారకులనుగా చేశాడు. కనుక మనము పరిచారకులము. కాని మనశరీరము పరిచర్య చేయుటకు ఒప్పుకోదు. పెత్తనము చేయడానికి ఒప్పుకుంటుంది. మీరే కాదు, నేనుకూడా, మనకు చాలాసార్లు పెత్తనము చేయడానికి మనస్సు ఉంటుంది. కాని దేవుడు పరిచర్య చేయమంటున్నాడు. ఆత్మీయులందరు పరిచర్య చేసేవారు అయితే ఎంత బాగుంటుంది.

అలెగ్జాండరు చక్రవర్తిగా పరిపాలన చేసే దినాలలో ఆయన మారువేషము వేసికొని అధికారులు ఎలా పనిచేస్తున్నారో, ప్రజలు ఎలా పనిచేస్తున్నారో అని చూడడానికి

వెళ్ళేవాడు. ఒకసారి అతని సైనికులు ఒక పెద్దరాతిని పొర్లిస్తున్నారు. వారిపై అధికారి ఒకటి, రెండు, మూడు అంటున్నాడు. సైనికులు నెడుతున్నారు కాని రాయి కదలలేదు. ఇంకొకరు నెడితే ఆ రాయి కదులుతుంది. అధికారి ఆ పనిచేయడం లేదు. అంతలో అటుగా వెళ్లున్న అలెగ్జాండరు గారు జరిగేది అర్థం చేసుకొని, గుర్రం దిగి సైనికులకు సహాయం చేశాడు. రాయి తొలగించబడింది. గుర్రమెక్కుతూ ఆ అధికారితో నీకు ఎప్పుడైనా ఇలాంటి సహాయము కావలసివస్తే అలెగ్జాండరు అనే నేను ఉన్నాను, పిలవండి వస్తాను అన్నాడట. అపుడు ఆ అధికారి కండ్లు తెరిచాడు. చక్రవర్తి మారువేషాన్ని కనుగొనలేకపోయాడు.

మన చక్రవర్తి అయిన యేసుక్రీస్తు ఉద్దేశ్యము ఏమిటి? పరిచారము చేయించుకొనుటకు రాలేదు కానీ పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమునిచ్చుటకు వచ్చెనని చెప్పెను. (మత్తయి **20:28**). పరిచారకుని సంపూర్ణత తన ప్రాణం పెట్టడమే.మనకు ప్రాణము పెట్టునంతటి పరిచర్య చేశాడు. ఇస్కరియోతు యూదా ప్రభువును అప్పగించునపుడు నీవా నన్ను పట్టించేది అనలేదు. చెలికాడా నీవు చేయవలసినది చేయి అన్నాడు. అంటే పరిచర్య అనేది అధికారము లేకుండా జరిగించేది. ఆత్మ నిన్ను నన్ను తనకు పరిచారకులుగా నియమించుకున్నాడు. మరి మనము పరిచర్య జరిగించుచున్నామా?

**2** కొరింథీ. **3:7, 8** మరణకారణముగు పరిచర్య రాళ్ళమీద చెక్కబడిన అక్షరములకు సంబంధించినదైనను మహిమతో కూడినదాయెను. అందుకే మోషే ముఖము మీద ప్రకాశించుచుండిన ఆ మహిమ తగ్గిపోవునదైనను ఇశ్రాయేలీయులు అతని ముఖము తేరిచూడలేకపోయిరి. ఇట్లుండగా ఆత్మ సంబంధమైన పరిచర్య ఎంత మహిమగలదై యుండును?

ఇక్కడ మోషే ముఖము ప్రకాశించినది. ఆత్మయొక్క పరిచర్యలో ఒక భాగముగా రూపాంతర కొండమీద ఉన్నపుడు ఆయన ముఖము ప్రకాశించింది. మోషే

దిగివచ్చినప్పుడు ప్రజలు చూడలేకపోయినందున ముసుగు వేసుకున్నాడు. ధర్మశాస్త్ర సంబంధమయిన పరిచర్య అది మరణకరమయిన పరిచర్య. మరణకరమైన పరిచర్యే. మహిమకరమైనదైతే జీవింపజేయు పరిచర్య మీరు నేను చేయు పరిచర్య ఎంత మహిమకరమై ఉంటుంది.

ప్రియులారా మనము చేసే పరిచర్య, మనలను జీవింపచేసే పరిచర్య మనకు మహిమనిచ్చే పరిచర్య. 2 కొరింథీ. 4:4లో మహిమ అనగా ప్రకాశము అని చెప్పబడినది. మనకు అప్పజెప్పబడిన పరిచర్య ప్రకాశించే పరిచర్య. నీతి మార్గము ననుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో వారు నక్షత్రములవలె నిరంతరము ప్రకాశించెదరు. (దానియేలు 12:3). ప్రభువు కొరకు ఎంతపనిచేస్తే అంత ప్రకాశాన్ని పొందుతాము. రేపు పరలోకములో నిరంతరము ప్రకాశిస్తాము.

తేడాలు కూడా ఉంటాయి. 2 కొరింథీ. 15:41లో మహిమనుబట్టి ఒక నక్షత్రమునకు, మరియొక బేధము కలదు అని ఉంది. ఈ లోకములో ఆత్మకు ఎంత పరిచర్య చేస్తే ఆ పరిచర్య చొప్పున ప్రకాశమును, మహిమను కలిగివుంటాము. మన పరిచర్య మహిమకు కారణమయ్యే పరచర్య.

కాబట్టి పరిచర్య చేసేటపుడు భూలోకములో ప్రతిఫలమును కోరకుండా దేవుడిచ్చు మహిమను మన కండ్లముందుంచుకోవాలి. నేడు ముఖాలకు అనేక పౌడరులు, పొడులు వచ్చాయి. ముఖానికి గంటసేపు పరిచర్య చేస్తే ముఖాలు ప్రకాశిస్తాయి అని చెప్పుతున్నారు. అబ్బో! వాటికొరకు ఎంత తాపత్రయపడుతున్నారో చెప్పలేము. ఈ లోకములో ముఖప్రకాశము కొరకు ఎంతో డబ్బు ఖర్చుపెట్టి ఎంతో పరిచర్య చేయుచున్నారు. మరి ప్రభువు పరలోకములో ఇచ్చే మహిమ ప్రకాశము కొరకు ఎంత పరిచర్య చేయుచున్నాము.

2 కొరింథీ. 3:17, 18 ప్రభువే ఆత్మ. ప్రభువు యొక్క ఆత్మ ఎక్కడ ఉండునో అక్కడ స్వాతంత్ర్యముండును. మనమందరమును ముసుగులేని ముఖముతో ప్రభువు

యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింపజేయాలి. మహిమ నుండి అధిక మహిమను పొందుచు ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము. ప్రభువే ఆత్మ, ఆత్మే ప్రభువు. తండ్రికుమార పరిశుద్ధాత్మలు వేరు వేరు కాదు. ఒకరే. అయినా పరిచర్యలు వేరుగా ఉన్నాయి. ప్రభువు ఆత్మ ఎక్కడ ఉండునో అక్కడ స్వాతంత్ర్యము ఉంటుంది. ప్రభువు స్వాతంత్ర్యమిచ్చేవాడు. రోమా 8:16లో మరల భయపడుటకు మనము దాస్యపుత్రాత్మను పొందలేదు. దత్తపుత్రాత్మను పొందితిమి అని ఉంది. దత్తపుత్రాత్మ అంటే దేవునికి మనము స్వంత పుత్రునిగా ఉండే ఆత్మను పొందుతాము.

మనకు స్వాతంత్ర్యత లేకపోతే అది ఆత్మ ఇచ్చిన పరిచర్య కాదు. ఎక్కడయినా స్వాతంత్ర్యతలేనపుడు అది ఆత్మ అప్పగించిన పరిచర్యకాదు. మనుష్యులు స్వాతంత్ర్యం ఇవ్వవచ్చు. కానీ నిదానముగా నీ స్వతంత్రత హరించబడుతుంది. ఆత్మ ఎక్కడ ఉంటే అక్కడ స్వాతంత్ర్యం ఉంటుంది. ఇంకా ఆత్మ సమాధానము, ఆత్మ ఏకత్వము ఇలా చాలా ఉన్నాయి.

2 కొరింథీ. 12:18లో ఒక్క ఆత్మవలనే ఒక్క అడుగుజాడల యందు నడుచుకొనలేదా? అంటున్నాడు. ఒక్క ఆత్మ ఒకే ఒక అడుగుజాడల్లో నడుచుకొనేటట్లు చేస్తాడు. ఏకత్వమును ఇస్తాడు. సమాధానము, సంతోషము ఆత్మ ఇస్తాడు. మీరు 40 మంది ఉన్నారనుకోండి. 40 మంది 40 అడుగులు వేయడము కాదు. 40 మంది ఒకే అడుగు వేయడము. ఒకే అడుగును ఆత్మ ఇస్తాడు. పరిశుద్ధాత్ముడు మనకు స్వతంత్రత ఇస్తాడు గానీ ఒకే అడుగుజాడల్లో నడిపిస్తాడు. మీ అడుగుజాడలే నా అడుగుజాడలై ఉండాలి, నా అడుగుజాడలే మీ అడుగుజాడలై ఉండాలి. నా తలంపులు, మీ తలంపులు ఒకటైనపుడు, ఇపన్ని ఆత్మ అనుగ్రహిస్తాడు అనుకోవాలి. ఆత్మ ఒకే అడుగుజాడల్లో నడిపిస్తాడు. స్వతంత్రతను కూడా ఇస్తాడు.

ఆత్మ పరిచర్యలో మన ముఖాలు ప్రకాశిస్తాయి. ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము. 3:18 ఆత్మపోలికగా అంటే ప్రభువు పోలికగా మారుస్తాడు.

ప్రభువుకు పొడవు వెంట్రుకలు ఉంటాయని, గడ్డము ఉందని ఆ పోలికలోనికి మార్చబడుతామా అనికాదు. కొందరు ఆయన పోలిక అని గడ్డము పెంచే వారున్నారు. ఆయనలాగా బట్టలు వేసుకునేవారున్నారు.

అనంతపురంలో బత్తలపల్లి దగ్గర ఒకసారి సువార్త చెబుతున్నాము. ఒకాయన వచ్చాడు. క్రీస్తును చూస్తే ప్రేమ పుడుతుంది కానీ మిమ్మలను చూస్తే పుట్టదు అన్నాడు. క్రీస్తు పేరు మీరు పేరు ఆయనలో ఉన్నవి మీలో లేవే అన్నారు. ఆయన పోలికలు ఉండాలి. ఆయనలో ఉండే సరళత మనలో లేదు.

2 కొరి 11:3లో క్రీస్తుయేసు నందున్న సరళత నుండి అపవాది మిమ్మను తప్పిస్తాడేమో అని నాకు భయముగా ఉంది అంటున్నాడు. సరళత అంటే ఇంగ్లీషులో సింప్లిసిటి. యేసులో సింప్లిసిటి ఉంది. మనలో లేదు. మనము కాంప్లికేట్ పర్సన్‌లాగా ఉంటాము. లోకము ఆయనను చూస్తే ఏ పేరు పెట్టలేదు.

2000 సంవత్సరము జనవరి 1 నాటికి ఒక రాష్ట్రములో కాంగ్రెసు ప్రభుత్వము ఉంది. కేంద్రంలో బి.జె.పి. వారున్నారు. బి.జె.పి. వారికి క్రీస్తు మార్గము అంటే అంతగా ఇష్టము లేదు. ఎట్లయినా క్రైస్తవులకు బి.జె.పి. మీద చెడుబుద్ధి పుట్టించాలి అని కాంగ్రెసు వాళ్ల ప్లాను. రాష్ట్రప్రభుత్వము యేసుక్రీస్తుకు 2000 సం॥లో జన్మదినాన్ని జరపాలి అనుకున్నారు. ఒకఫంక్షన్ ఏర్పాటు చేశారు. ప్రధానులను పిలిచారు. అందరిని పిలిచారు. క్రీస్తును గురించి అందరు మాట్లాడారు. ఏం మాట్లాడగలరు. ఆయనలో ఏ చెడుగు ఉందని మాట్లాడగలరు. క్రైస్తవులపై ఎన్ని మాటలైనా మాట్లాడగలరు. ఎన్ని కేసులయినా పెట్టగలరు. ప్రధానులందరు ఏమి మాట్లాడుతారో అనుకుంటూ ఉండగా వారు లేచి యేసు అనగా ప్రేమ అని చెప్పారు. అంతకంటే ఏమి చెప్పగలరు. ఎవరినీ యేసు ద్వేషించలేదు. ఎవరినీ పల్లెత్తు మాట అనలేదు. తనను పట్టించిన యూదా ఇస్కరియోతును కూడా చెలికాడా అన్నారు. ఎవరంటారు చెప్పండి. మనమైతే ఏమైనా మాట్లాడగలం. మనచేతి ద్వారా ఎంతోమందిని కొట్టి ఉంటాము. యేసుప్రభువు

శిష్యులు ఉన్నారు. అంతా మంచివాళ్ళు కాదు. భ్రష్టులు ఉన్నారు. వాళ్ళలో ఒకడు ఒక పట్టణము వారిని అగ్నిలో కాల్చివేస్తాము అన్నాడు.

మనమైతే అట్లాంటి శిష్యులపై మండిపడి ఉందుము. ఆయన మండి పడ్డాడా లేదు. ఇస్కరియోతు యూదా ఆయనను పట్టించాడు. ఇంకా యూదా దొంగ దోచుకొనువాడు అని తెలిసినా డబ్బు సంచిని అప్పగించాడు. ఈ రోజు సంఘాలలో డబ్బు సంచులతో చాలా సమస్యలు వస్తున్నాయి. దోచుకునే వాళ్ళు ఉన్నారు. అలాంటి కేసులు కూడా ఉన్నాయి. ప్రధానులలో ఒకాయన దైవత్వం మానవుల మధ్య నివసించింది అంటే అది క్రీస్తే అని చెప్పుకు వచ్చాడు. ఎప్పుడయినా దైవత్వం మానవత్వంగా కనిపించింది అంటే అది క్రీస్తు అని ఇంకొకరు అన్నారు.

ఆయన 2000 ఏండ్లక్రితం ఈ లోకంలో ఉన్నాడు. ఆయనకు ఏ రాజరికము లేదు. ఏ సింహాసనము లేదు. ఏ ఆస్తిపాస్తులు లేవు. తలవాల్చడానికి స్థలము కూడా లేనివాడు. బీదవానిగా నజరేతుఅను గ్రామములో ఉండేవాడు.

ఆయన పోలికలు మనలో లేనే లేవు. ఉన్నాయి అని ఎంత చెప్పుకున్నా లేనే లేవు. కాని ఒకరోజు ఆయన పోలికలోనికి మార్చబడుతాము. 1 యోహా 3:2 ప్రియులారా ఇపుడు మనము దేవుని పిల్లలమయి ఉన్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు. కాని ఆయన ప్రత్యక్షమైనపుడు ఆయన ఉన్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయన్ను పోలి ఉందుమని ఎరుగుదుము. కోటి సూర్యుల కాంతికంటే మిన్న అని యేసు గూర్చి పాడుతాము. ఆ పోలిక మనది అంటే ఆలోచించాలి.

అలా మార్చబడాలంటే ఒక్కరోజులో జరిగేది కాదు. రోజూ మార్పు జరుగుతూ ఉండాలి. ఎంతగా మారినాము. 2002కు 2003కు, 2003 నుండి 2004కు, 2004 నుండి 2005 కు ఏమయినా మార్పు ఉందా? మనలో 2001కి 2003కు ఏమైనా మార్పు ఉందా? మహిమ నుండి అధిక మహిమను పొందుతూ ఆయన పోలికలోనికి మారిపోవాలి. 2003లో 2004లో మనము కొత్తగా నేర్చుకున్న గుణము ఏమిటి?

మనకు మనం చెప్పుకుందాం. ఆయన గుణాలు మీరు ఏమి నేర్చుకున్నారు? ఆయన పోలికలు మీలో ఏమి ఏర్పడ్డాయి? ఆయన పద్ధతులు ఏమి ఏర్పడ్డాయి? 2001లో ఈ పద్ధతి నాలో ఉండేది కాదు. అయితే క్రీస్తును ధ్యానిస్తూ ఉండగా నాలో లేనిది నాకు అర్థమయింది. ఫలానా పోలిక 2002లో వచ్చింది అని చెప్పగలమా. సంవత్సరానికి కనీసం ఒక్క పోలిక అయినా వచ్చిందా చెప్పండి లేకపోతే ఏమి లాభము? సంవత్సరాలు గడిచినా ఎన్ని మీటింగులు విన్నా ఏమి లాభము. మనకు వాక్య ధ్యానకూడికలుండి ఏమి లాభము? కేవలము వినువారలేనా? మనము అక్షరానికి పరిచారకులము కాదు. 2 కొరి. పత్రిక బాగా బోధించగలము. మీరు బాగా బోధించి ఉంటారు. అయితే అక్షర సంబంధమయిన పరిచర్యకు పరిచారకులము కాదు. మనము ఆత్మకు పరిచారకులము. ఆత్మీయముగా, వీటన్నిటిని మనజీవితంలో చూపించగలగాలి.

2 కొరింథీ. 6:6 పవిత్రతతోను, జ్ఞానముతోను, దీర్ఘశాంతముతోను, దయతోను, పరిశుద్ధాత్మవలన నిష్కపటమైన ప్రేమతోను సత్యవాక్యము చెప్పాలి. వాక్యము చెప్పుట అనేది పరిచర్య. జీవితము అనేది పరిచర్య. క్రియలు ఒక పరిచర్య. వాక్యము ఎలా చెప్పాలి. పరిశుద్ధాత్మ వలన వాక్యము చెప్పాలి. మన స్వంత జ్ఞానము లేదా స్వంత తలంపులు లేదా కొరింథి పత్రికలో చూచినట్లు మనుష్యజ్ఞానము నేర్పుమాటలతో కాక ఆత్మనేర్పు మాటలతో బోధించాలి. 1 కొరింథీ. 2:4-5లో పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనపరచు దృష్టాంతములనే వినియోగించితిని. మనుష్యజ్ఞానము కొన్ని సాదృశ్యాలు మనకిస్తాడు. నీవు సాదృశ్యము చెప్పవలసివచ్చినా పరిశుద్ధాత్ముడు నీకు ఇచ్చి వుండాలి. వాక్యపరిచర్యలో సువార్త చెప్పాలి. బోధ చేయాలి. పరిశుద్ధాత్ముడే వీటిని నీకు అనుగ్రహించాలి. ఆయనకు నీకు సంబంధం ఉండాలి. పుస్తకాలు చూచి చెప్పవద్దు. అంటే పుస్తకాలు చదవడం తప్పని కాదు. పుస్తకములు చదివి నేర్చుకోవడం మంచిదే. కాని అక్షర సంబంధమయిన జ్ఞానం మాత్రమే నేర్పుదల కాదు. ఆత్మ ద్వారా వాటిని పొంది ఆత్మ అనుగ్రహిస్తేనే వాటిని మనము చెప్పాలి. పరిశుద్ధాత్మ వలన సత్య వాక్యమును చెప్పాలి. 2వ కొరింథీ. 7:1లో ప్రియులారా, మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక

దేవుని భయములో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకు కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసికొందము అంటున్నాడు. ఇక్కడ ఉంటే ఆత్మ పరిశుద్ధాత్మ కాదు. మన ఆత్మ శరీరానికి కల్మషము కలుగదు. కాబట్టి మన ఆత్మకు కల్మషము కలిగిందేమో ఆలోచించాలి. మన శరీరాలకు ఉన్న కల్మషమును ఆలోచించాలి. వాక్యం వింటూ ఉండగా వాక్యము మనలను కడుగుతుంది.

ఎఫెసీ 5:25 ఉదకస్నానము చేత అని ఉంది. ఉదకను అంటే నీరు. వాక్యమనే నీరు. వాక్యమనే నీటిచేత దేవుడు మనకు స్నానం చేయిస్తున్నాడు. శుభ్రంగా మనమీద దుమ్మును పోగొడ్తున్నాడు. స్నానం చేయించేపుడు చిన్నపిల్లలు చాలా ఏడుస్తారు. కాని చేసిన తర్వాత బాగా మంచి దుస్తులు వేసికొని బయటికి వస్తే బిడ్డకు సంతోషం. రోడ్లో ఉండే వారందరు ఎత్తుకొని ముద్దుపెట్టుకుంటారు. బిడ్డకు ఎంతో ఆనందం. ఎంతో ఆధిక్యత. స్నానం ఎంతమంచిదో చూడండి.

వాక్యమనే ఉదకస్నానం కూడ మంచిదే మనశరీరాలకు మన ఆత్మకు కల్మషం పోతుంది. నాకు కల్మషము లేదు అనడానికి లేదు. మనము ఊరొక ఇంట్లోనే ఉన్నా మరునటి రోజుకు శరీరంలో కల్మషము ఉంటుంది. ఎందుకు అన్నిసార్లు ఊడుస్తున్నారు? మట్టిని తెచ్చుకొని ఇంట్లో పెట్టుకుంటారా లేదు. బయటి నుంచి దుమ్ము వస్తూనే ఉంటుంది. మన శరీరాల పైకి వద్దన్నా కల్మషము వస్తూనే ఉంటుంది. అలాగే నేను ఏమీ చేయలేదన్నా అనవచ్చు. ఏమీ చేయకపోవచ్చు. వద్దన్నా నీకు, నీ ఆత్మకు కల్మషము సోకుతుంది. అందుకే వాక్యమనే ఉదకము ద్వారా మన శరీరాలను కడుక్కోవాలి. ఆత్మలను కూడా కడుక్కోవాలి.

శరీరము కొన్నిసార్లు పాపము చేస్తుంది. మన ఆత్మపాపము చేస్తుంది. దాని నుంచి కడుక్కోవాలి. దేవుడు మిమ్మును దీవించుగాక.

★★★

# గలతీ పత్రికలో పరిశుద్ధాత్మని పరిచర్యలు

ఈ పత్రికలో ఆత్మను గురించిన ప్రస్తావన 18 పర్యాయములు 6 అధ్యాయములలో మనకు కనబడుతుంది. అందులో ఒకసారి పరిశుద్ధాత్మను గురించి కాకవేరుగా ఉన్నట్లు మనము చూడగలము. 6:18లో సహోదరులారా మన ప్రభువైన యేసుక్రీస్తు కృప మీ ఆత్మతో ఉండును గాక. మీ ఆత్మ అంటె గలతీయుల ఆత్మ అని అర్థము. ఇక్కడ పరిశుద్ధాత్మ కాదు. ఈ ఒకచోట మినహా మిగిలిన అన్నిచోట్ల పరిశుద్ధాత్ముని విషయాలు కనిపిస్తాయి.

గలతీయులు ఐరోపాఖండానికి చెందినవారు. ఈశాన్య ప్రాంతంలో గాలులు అని పిలువబడే ఒక కొండజాతివారు. వీరు మూర్ఖులు. చాలా కఠినమైన వారు. వీరు క్రీ.పూ. 4వ శతాబ్దంలో వారి ప్రాంతం నుండి బయలుదేరి ఫ్రాన్సును జయించారు. తర్వాత రోమును జయించారు. తర్వాత క్రీ.పూ. 280లో గ్రీసును కూడా జయించారు. గ్రీసును జయించిన నాటికి వీరు చాలా క్రూరమైన వారు. మధ్యధరా సముద్రము దాటి ఆసియా ఖండంలో బితూనియా ప్రాంతానికి వచ్చారు. బితూనియాను నికోదేము అనేరాజు పరిపాలిస్తున్నాడు. వాళ్ళలో అంతర్యుద్ధాలు జరుగుచుండేవి. ఈ అంతర్యుద్ధాలు అణచడానికి గాలులు తగినవారు అని ఆ రాజు వీరిని ఆహ్వానించాడు. వీరు వచ్చి అంతర్యుద్ధాలను అణచివేశారు. తర్వాత రాజు వీరిని గలతీయ ప్రాంతంలో ఉండమన్నాడు. అక్కడ వీరు స్థిరపడ్డారు. గాలులు నివసించిన ప్రదేశము కాన గలతీయ గాల్స్ ఇన్ ఏషియా, గలేషియా అన్నారు. తర్వాత రోమీయులు వీరిని వశపరచుకున్నారు. యేసుక్రీస్తు వారి దినములలో గలతీయ ఒక దేశముగా మారింది.

బైబిల్‌లో గలతీయ అనగా లుస్త్ర, ఈకొనియ, దెర్బే పట్టణాల ప్రస్తావన ఉంది. తిమోతి ఊరు లుస్త్ర (అ.కా. 16:1). అంటే తిమోతి గలతీయ దేశమునకు చెందినవాడు. ఆ దేశంలో గలతీయులు కొద్దిమంది యేసుప్రభువును నమ్ముకున్నారు. వీరు స్థిరమైన మనస్సు కలవారు కారు. గలతీ. 4:14లో వారు పౌలును దూతలాగా

ఎంచుకున్నారు. కాని అదే పౌలు బోధ నుండి త్వరగా తొలగిపోయాడు. పౌలు చేసిన దానిని చూచి పౌలుకు, బర్నబాకు బలి అర్పించాలనుకున్నారు. (అ.కా.14:7-13). తర్వాత అంతియొకయ, ఈకొనియ వారి మాటలు విని పౌలును చనిపోయేదాకా కొట్టారు (14:19). ఇలాంటి అస్థిరులు.

అలాగే పరిశుద్ధాత్మను గురించికూడా వీరికి స్థిరమయిన మనస్సు లేదు. గలతీ. 3:2లో ఇది మాత్రమే మీ వలన తెలిసికొనగోరుచున్నాను. ధర్మశాస్త్ర సంబంధమయిన క్రియలు వలన ఆత్మను పొందితిరా లేక విశ్వాసముతో వినుట వలన ఆత్మను పొందితిరా? అంటున్నాడు. ఆత్మను పొందిన విషయములో కూడా స్థిరమైన అభిప్రాయము లేదు.

తప్పుడు బోధకులను అనుమతించారు. సున్నతి పొందకపోతే రక్షణలేదు అనే బోధకు తావిచ్చారు. వీరు అనేకసార్లు గలిబిలికి తావిచ్చారు. అందుకే ఒక భక్తుడు ఈ పత్రికకు గలతీయుల గలిబిలి అని గలతీలో కలితీ అని పేరు పెట్టితే బాగుండేది అన్నాడు. ఇంకొకాయన గలతీయుల గోల అంటే సరిపోతుందన్నాడు. గలతీయులు ఎక్కువసార్లు కలవరము తెచ్చిపెట్టుకునేవారు. అపవాది ఇలాంటి వారిని పట్టుకుంటాడు. తన వెంట ఈడ్చుకుపోతాడు. ఇలాంటి వారికి పౌలు గలతీ పత్రికలోని 6 అధ్యాయములలో 17 సార్లు ఆత్మను గురించి ప్రస్తావించాడు.

గలతీ. 3:3, 5లో మొదట ఆత్మానుసారముగా ఆరంభించి, ఆత్మను మీరు అనుగ్రహించి అనే పదాలు మనకు కన్పిస్తాయి. 3:13లో ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసమువలన మనకు లభించునదిగా చెబుతూ 2లో ఆత్మను ఏవిధముగా పొందారు అని ప్రశ్నిస్తున్నాడు. వినుటవలననే అని ఆ అధ్యాయములో తీర్మానిస్తున్నాడు. ఎఫెసీయులతో కూడా అ.కా.19:1లో విశ్వసించినపుడు పరిశుద్ధాత్మను పొందితిరా అని ప్రశ్నిస్తున్నాడు. అంటే విశ్వసించినపుడు పరిశుద్ధాత్మను పొందుతారు అన్నది వాక్య ప్రకారమైన సత్యము అని పౌలు కొరింథీయులతోను చెప్పాడు. ఎఫెసీయులతో చెప్పాడు. గలతీయులతో చెప్పుచున్నాడు. ఎందుకంటే నేడు పరిశుద్ధాత్మను గురించి భిన్న

అభిప్రాయాలు ఉన్నట్లే ఆనాడు కూడ ఉన్నది అంటాడు. బైబిలంతా కలసి 1189 అధ్యాయాలే. ఇంతకంటే చాలా పెద్ద పెద్ద పుస్తకాలు లోకములో అనేకము ఉన్నాయి. దేవుడు దైవత్వపు సారాంశాన్నంతటిని క్లుప్తపరచి చిన్నదిగా మనకు అందించాడు.

నేను చదువుకునే దినాల్లో పదియవ తరగతి ఇంగ్లీషు పుస్తకములో లూకా 15వ అధ్యాయం ఉండేది. అది ఒక పేజీ మాత్రమే ఉండేది. దానికి మా సారు పాఠం చెబుతూ 3 పేజీలు చెప్పాడు. ఇదేమిటి ఒకపేజీ పాఠము ఉంటే రెండు మూడు పేజీలు నోట్సు చెబుతున్నాడే అని అడిగితే బైబిల్‌లోని విషయాలు పెంచుకోవచ్చు గానీ తగ్గించడానికి వీల్లేదు. ఒక చిన్నపదము తీసివేసినా ద్వంద్వార్థాలు వస్తాయి అన్నాడు. అంత క్లుప్తపరిచిన గ్రంథము బైబిలు.

ఈ గ్రంథంలో పరిశుద్ధాత్మని గురించి పదే పదే చెబుతున్నాడు. ఇంచుమించుగా అన్ని సంఘాలకు చెప్పాడు. అంటే ఆత్మను గురించిన అంశము ఎంత ప్రాముఖ్యమైనదో గమనించండి. రేపు ఎవరైనా వచ్చి గలిబిలి చేస్తే మన సంఘాలకు గలిబిలి కలిగితే మనలో ఆత్మ లేదంటారు. ఆత్మతో నింపబడ్డారా మీలో కదలికలు లేవు. చలనము లేదు. మీలో ఆత్మశక్తి లేదు. మీ రక్తమాంసములలో శక్తిలేదు. మీ సంఘంలో శక్తిలేదు. మీరు నడిచే విధానంలో శక్తిలేదు అని ఇలాంటి మాటలతో గలిబిలి చేస్తారు.

ఆత్మను పొందే విధానమేమిటో మనము స్పష్టముగా తెలుసుకోవాలి. ఏ పత్రికలో చూచినా విశ్వాసముతో వినుట వలన ఆత్మను దేవుడు అనుగ్రహిస్తున్నాడు అనేది స్పష్టము. అనుగ్రహించేది ఆయన పొందువారము మనము. ఆత్మను గూర్చిన వాగ్దానములు కూడా మనకు విశ్వాసము వలనే లభిస్తుంది అని గలతీ 3:13లో చెప్పబడింది.

ఎఫెసీ 1:13లో మీరు సత్యవాక్యమును అనగా మీ రక్షణసువార్తను విని క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిరి అని ఉంది. ఆత్మ వాగ్దానము చేయబడ్డాడు. విశ్వసించువానికి ఆత్మనిస్తానని దేవుడు వాగ్దానం చేశాడు.

వాగ్దానం చేయబడిన ఆత్మ అని అ.కా. లలో తరుచుగా చెప్పబడింది. పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రి వలన పొంది మీరు చూచుచు వినుచున్న దీనిని కుమ్మరించాడు. (అ.కా. 2:33). ఈ వాగ్దానం చేయబడిన ఆత్మ విశ్వసించిన వారిమీద కుమ్మరింపబడుతుందని గుర్తుంచుకోవాలి. లూకా 11:13 లో పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించును అని ఉంది. దీని భావమేమిటి? పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అంటే సమృద్ధిగా అనుగ్రహిస్తాడు అనే తలంపు ఇందులో ఉంది. అనగా ఆత్మ నింపుదల అనుభవము క్రింద చూడవచ్చు. ఆత్మ నింపుదల గురించి ముందే చర్చించాము.

ఒక భక్తుడు రిలీజ్ ఆఫ్ ది స్పిరిట్ అనే పుస్తకము వ్రాశాడు. నేను నా విశ్వాసంలో ఆ పుస్తకమును చదివాను. ఆ పుస్తకంలో దేవుని ఆత్మ మనలో ఉన్నాడు. కానీ ఆయనను బంధిస్తున్నాము అని చెప్పాడు. మన హృదయము ఆయనకు ఆలయమై ఉంది గానీ ఆయన బంధించబడ్డాడు. దేవున్ని హృదయంలో ఒక మూల ఉంచేసి అన్ని కార్యక్రమాలను మనమే చేస్తూ ఉంటాము.

కొన్నిసార్లు మన ఇళ్ళలోకి యేసుక్రీస్తు అతిథిగా వస్తూ ఉంటాడు. అతిథికి ఇంట్లో సర్వ స్వాతంత్ర్యం ఉండదు. మనము ఎంత గౌరవించినా మనము చెప్పినచోట ఉంటాడు. ఏ రూముకు వెళ్ళాలన్నా అడిగివెళ్తాడు. అదే ఇంటి యజమాని అయితే ఇంట్లో స్వేచ్ఛగా తిరుగుతాడు. అన్ని పనులు చెప్పి చేయిస్తుంటాడు. క్రీస్తును మన అతిథిగా కాక ఆయనను మనయజమానిగా చేసుకొని ఆయన చెప్పినట్లు చేయుటకు ఆత్మను బంధించకుండా విడుదల చేయడమన్నమాట. ప్రభువా నేనేం చెయ్యాలి అని ఆయనయందు కనిపెట్టుకోవడం ఆయనను అడగటం ఆయన చెప్పినట్లు చేయడమన్నమాట. ఆయన వెళ్ళమంటే వెళ్లడం వద్దంటే మానివేయడం. ఆయనే అన్నీ చూస్తాడు.

అ.కా. 16:6-8 లో ఆసియాలో వాక్యము చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారిని ఆటంకపరిచినందున వారు ఫ్రుగియ గలతీయ ప్రదేశముల ద్వారా వెళ్ళిరి. ముసియ దగ్గరకు వచ్చి బితూనియకు వెళ్ళుటకు ప్రయత్నము చేసిరిగాని యేసు యొక్క ఆత్మ

వారిని వెళ్ళనియ్యలేదు. 2 కొరి 6:6లో పరిశుద్ధాత్మ వలన సువార్త ప్రకటించాలని ఉంది. గాని ఈ పరిశుద్ధాత్ముడే ఆసియాలో వాక్యము చెప్పవద్దన్నాడు. స్వతంత్రత ఆయనదే. ఆయన ఆధీనములో మనముండాలి. ఆయన సర్వ స్వతంత్రుడుగా మనలో ఉండాలి. తన్ను అడుగువారికి నిశ్చయముగా ఆత్మను సమృద్ధిగా అనుగ్రహిస్తాడు. అంటే మన జీవితాలు ఆయన ముందు పెట్టి ఆయనకు అప్పగించుకొని ఆయన చిత్తానుసారముగా మనము చేయడానికి ఇష్టపడాలి.

ఆత్మను పొందుటకు అనే అనుభవానికి ఆత్మచేత నింపబడుట అనే అనుభవానికి తేడా ఉంది. ఆత్మను పొందుట ఒకసారే. ఆత్మచేత నింపబడుట సారిసారికి జరగాలి. ఎన్నోసార్లు ఆత్మచేత నింపబడాలి. ప్రతి గంట, ప్రతిక్షణం ఆత్మచేత నింపబడుతూ ఉన్నా ఒక క్షణంలోనే ఆత్మకు దూరమైపోయి శరీరధారిగా ఉండగలము. ఉదాహరణకు దావీదు జీవితం గురించి మీరు ఎన్నిసార్లు విని వుంటారు. ప్రసంగాలు కూడా చేస్తూంటారు. ఆత్మచేత నింపబడి ప్రభువుచేత ఎంతో గొప్పగా వాడబడిన సమయాలున్నాయి. శరీరం చేత నింపబడి తప్పిపోయిన సంధర్భాలు ఉన్నవి. దావీదును గురించి మాట్లాడడానికి నాకేమధికారముంది అనిపిస్తుంది. దేవుడు దావీదును గురించి నా ఇష్టానుసారుడైన మనుష్యుడు అన్నాడు. నా చిత్తానుసారమైన మనుష్యుని నేను కనుగొన్నాను అన్నాడు. దేవుని చిత్తానుసారమైన మనుష్యుడు, దేవుని హృదయానుసారమైన మనుష్యుడు కూడా శరీరానుసారుడుగా ప్రవర్తించాడు గదా! ఎప్పుడు? 30 ఏండ్లకు దావీదు రాజయ్యాడు. చాలా చిన్న వయసులోనే ప్రభువును నమ్ముకున్నాడు. పెళ్లి కాకముందే ఆత్మచేత నింపబడ్డాడు.

గొల్యాతును ఎదుర్కొనడానికి నీవు బాలుడవు అని సౌలు అన్నాడు. నేను సింహాన్ని ఎలుగుబంటిని చంపాను. వాటి నుండి నన్ను రక్షించిన యెహోవా ఈ ఫిలిష్తీయుని చేతినుండి నన్ను విడిపించును అన్నాడు. చిన్నప్పుడే యెహోవాను నమ్మాడు. ఫిలిష్తీయుని ఓడించాడు. మీకాలును పెళ్ళి చేసుకున్నాడు. సౌలు అన్యాయపడి 21 సార్లు దావీదును అంతము చేయడానికి ప్రయత్నించాడు. అయినా ఎంతో నమ్మకముగా ఉన్నాడు. రెండుసార్లు సౌలును చంపే అవకాశము వచ్చింది. యెహోవాచేత అభిషేకించబడిన వానిని చంపను అన్నాడు. దేవుని మీద ఎంత గౌరవము ఎంత నమ్మకము!

30 ఏండ్లలో రాజయి 7 ఏండ్లు హెబ్రోనులో ఏలాడు. తరువాత యెరూషలేము వచ్చాడు. వాగ్దానాలు పొందాడు. తన 40–50 ఏండ్ల వయసు మధ్య మందిరము కడతాను అన్నాడు. సౌలును రాజును చేసి 40 ఏండ్లు దేవుడు పరిపాలన ఇప్పగిస్తే సౌలుకు మందసము మీద ధ్యాసే లేదు. దావీదు హృదయమంతా మందసము, మందిరము మీదనే. వీధుల్లో నాట్యమాడుతూ మందసాన్ని తెచ్చాడు. సౌలు కుమార్తె మీకాలు వ్యర్థుడు బట్టలను విప్పేసినట్లు ఇశ్రాయేలు రాజవైన నీవు నేడు బట్టలను తీసివేసి ఎంత ఘనముగా కనబడితివి అని ఎగతాళిచేసింది. అంటే ఒంటి మీద బట్టలు ఉన్నాయో లేదో కూడా చూసుకున్న వాడు కాదు. దేవునితో అంతగా ఏకమయ్యాడు. అటువంటివాడు 50 ఏండ్ల వయసులో అందరూ యుద్ధానికి వెళితే ఇంట్లో పడుకుని నిద్రపోతున్నాడు.

సాయంకాలము మిద్దెమీదికి ఎక్కి స్నానం చేయుచున్న స్త్రీని చూచి పాపం చేసి పాపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఊరియాను చంపించాడు. 21 సార్లు హత్యాప్రయత్నం చేసిన సౌలును విడిచిపెట్టాడు గానీ ఊరియాను చంపించాడు. ఏమైంది ఆత్మపూర్ణత? ఏమైంది దేవుడిచ్చిన సాక్ష్యం. పైగా బాల్యంలో కాదు, యవ్వనంలో కాదు దాదాపు 50 సం॥ల వయస్సులో.

50 ఏండ్ల వరకు ఆత్మతో నింపబడ్డాను బ్రదర్ అని చెప్పవద్దు. 51లో నీవు ఖాళీగా ఉంటే ప్రమాదము ఉంది. చిట్టచివరివరకు కూడా ఆత్మచేత నింపబడి ఉండాలి. 2 తిమోతి 4:10లో దేమా ఇహలోకమును స్నేహించి నన్ను విడిచి థెస్సలొనీకకు వెళ్లెను అని పౌలు అంటున్నాడు. ఒకప్పుడు నాతో కలిసి ఉండేవాడు. కానీ లోకాన్ని స్నేహించాడు. ర॥ లోకములో ఉన్నవాటినైనను లోకమునైనను ప్రేమించవలదు అని బోధలు చేసినవాడే. తీతు వెళ్లిపోయాడు. క్రేస్కే వెళ్లిపోయాడు. అందరు నన్ను విడిచి వెళ్ళిపోయారు. లూకా మాత్రమే నా యొద్ద ఉన్నాడు. నన్ను అంటే క్రీస్తును విడిచి వెళ్లిపోయాడు.

దావీదును గురించి మాట్లాడడానికి నాకు ధైర్యం చాలదు. దేవుడే ఇతడు నా హృదయానుసారుడు, నా చిత్తమంతటిని నెరవేర్చువాడు అన్నాడు అని ముందే చెప్పాను.

50 ఏండ్ల వయసులో తప్పిపోయాడు. అంతటివాడు కూడా ఆత్మ నింపుదల లేనపుడు పడిపోగలడు. అల్లయితే మనము ఎంతటివారమైనా కావచ్చు. ఎంత అనుభవమైనా ఉండవచ్చు. జాగ్రత్తగా ఉండాలి.

జయించినవాళ్ళు ఎలా జయించారు. యోసేపుకు తోడుగా ఉంటానన్నాడు. దావీదుకు తోడుగా ఉంటానన్నాడు. మనకు తోడుగా ఉంటాను అన్నాడు. దేవుని విధానాలు వేరుగా ఉంటాయి. నానా విధాలయిన పరీక్షలకు మనలను గురిచేస్తాడు. నా కుమారుడు గెలుస్తాడా, ఓడిపోతాడా. అని పరీక్షపెడతాడు. డిగ్రీల మీద డిగ్రీలు పాసయి మంచి ఉద్యోగంతో చేరవచ్చు. ఉద్యోగంలో రిటైరయ్యే వరకు నమ్మకంగా ఉండాలి. ఈ మధ్య ఒకాయన ఆ రోజు సాయంత్రము 5 గంటలకు రిటైర్ అవుతున్నారు. 4.30కి సస్పెండ్ ఆర్డర్ వచ్చింది. జీవితకాలం 36 ఏండ్లు సర్వీస్ చేశాడు. అనేకవాటిలో రాణించాడు. మంచిపేరు తెచ్చుకున్నాడు. చివరిలో డిస్మిస్ అయ్యాడు.

ఆత్మీయజీవితం కూడా అంతే. ఆత్మపూర్ణత అనేదాని నుండి మనము ఎప్పుడైనా తొలగిపోవచ్చు. ఒక దైవసేవకుడి గూర్చి విన్నాను. 150 కీర్తనల గ్రంథము మీద చాలా పెద్ద పుస్తకము వ్రాశాడు. అంతటి ఆయన కూడా పాపములో బడ్డాడు. ఇవన్నీ చూస్తే దేవుని బిడ్డలు ఎవరైనా ఎప్పుడైనా ఆత్మనింపుదల లేకపోతే ఏ పరిస్థితిలోనైనా అధోగతి: దిగజారి పోగలరు అని మనము ఆలోచించుకోవాలి. కనుక ఆత్మచేత నింపబడుట అనే అనుభవము మన జీవితంలో నిత్యము కలిగివుండాలి.

గలతీ 5:25 చదువుదాం. మనము ఆత్మననుసరించి జీవించువారమైతిమా ఆత్మను అనుసరించి క్రమముగా నడుచుకొందము అంటున్నాడు. 16లో నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడుచుకొనుడి అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు అంటున్నాడు. విశ్వాసి ఆత్మానుసారముగా నడుచుకోవాలి. ఆత్మ నింపుదల అంటే ఇదే. దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారు దేవుని కుమారులై ఉందురు. (రో 8:14). ఆత్మచేత నడిపించబడిన వారిని లోకము చూచినపుడు దేవుని కుమారులు అని పిలుస్తారు. వారు అన్నారని మనము దేవుని కుమారులము అనుకోవచ్చు. అయితే దేవుని కుమారులు

అని గుర్తింపు పొందాలంటే ఆత్మను అనుసరించి క్రమమైన విధానంలో మనము నడుచుకోవాలి.

ఆత్మను అనుసరించి జీవించువారమైతిమా అని గలతీ 5:25లో ఉంది. నడక జీవితంలో ఒకభాగము మాత్రమే. జీవితంలో మెట్లు ఉన్నాయి. నేను కూర్చుండుట, నేను లేచుట, నా పడక నీకు తెలుసు అని 139 కీర్తనలో ఉంది. ఇవి జీవితంలో మెట్లు. ఇంకా ఎన్నో ఉన్నాయి. జీవన విధానమంతా ఆత్మననుసరించి క్రమంగా ఉండాలి.

ఆత్మానుసారముగా నడుచుకొనుడి. అపుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు. శరీరము ఆత్మకును, ఆత్మ శరీరమునకును విరోధముగా అపేక్షించును. (గలతీ 5:17). ఆత్మకు విరోధి ఉన్నాడు. ఎవరు? మన శరీరము. ఎంత దూరములో ఉన్నాడు. మనతో కలిసే ఉన్నాడు. ఆత్మశరీరము వేరయ్యే దినము అనగా మరణదినము వరకు మన విరోధి మనతో ఎప్పుడూ కలిసి ఉండాల్సిందే. ఆత్మీయుడా నీ విరోధి ఎప్పుడూ నీతో కలిసే ఉన్నాడు. ఆత్మీయుడు ఎంతజాగ్రత్తగా జీవించాలో గమనించండి. శత్రువు చుట్టూ ఉంటే ఎవరికైనా నిద్రపడుతుందా? ఎంత భయము. మనము కూడా అంత భయంతో జీవించాలి.

5:18-20లో ఆత్మచేత నడిపించబడితే, శరీరము చేత నడిపించబడితే మనజీవితం ఎట్లుంటుందో చెప్పబడింది. మీరు ఆత్మచేత నడిపింపబడిన యెడల ధర్మశాస్త్రమునకు లోనైన వారు కాదు. శరీర కార్యములు స్పష్టమైయున్నవి. అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషము, కలహము, కక్ష్యలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితోకూడిన ఆటపాటలు మొదలైనవి. మొదటనే జారత్వము చెప్పబడింది. దావీదు జారత్వము జరిగించాడు. ఇది ఏ కార్యము? శరీర కార్యమా, ఆత్మకార్యమా? శరీర కార్యము. అలాగే ద్వేషాలు. ద్వేషాలు మనమధ్యలేవా? చెప్పండి. నీవు ద్వేషించేవారు ప్రపంచంలో ఎంతమంది ఉన్నారు? మీ సంఘంలో ఉన్నారా? మనము నిష్పక్షపాతంగా ఆలోచన చేసినపుడు మనకు ఎవరెవరి మీద ద్వేషముందో అర్థమవుతుంది.

నాకు ఎవరెవరి మీద ద్వేషమున్నదో దేవుడు నాకు జ్ఞాపకం చేసాడు. అప్పో నేనేదో పెద్ద ఆత్మీయున్ని అనుకున్నాను. నాలోన ఉండకూడని శరీర కార్యాలున్నాయి. ఎంత అవివేకంగా ఉన్నాయి అనిపించింది. సాతాను మనలనందరిని మోసగించాడు. నీవంటే ఏమనుకున్నావ్ అంటూనే వాళ్ళమీద వీళ్ళమీద ద్వేషాలు నీ హృదయంలో సమృద్ధిగా అనుగ్రహిస్తాడు.

మీరు ఎవరితోనైనా కలహించారా? అట్లయితే ఆ సమయంలో నీకు ఆత్మ నింపుదల లేదు. క్రోధములు, కక్ష్యలు ఇవన్నీ అందరిలో ఉండగలవు. బోధించే బోధకులలో కూడా ఉండగలవు. ఆత్మీయంగా గొప్పవారం అనుకునే వాళ్ళలోను, చిన్నవారం అనుకునే వాళ్ళలోనూ ఉండగలవు. స్త్రీలలో, పురుషులలో యువకులలో, యువతులలో, పిల్లలో ఉండగలవు. ఆలోచించండి.

ఎవరిమీదైనా కక్ష్యకలిగి ఉన్నామా? నేటికి కూడా ఎవరిమీదైనా క్రోధం కలిగి ఉన్నామా? యేసుప్రభువు జీవితాన్ని గమనించండి. ఆయన ఎవరినైనా ద్వేషించాడా? ఒక్క అపవాదిని ద్వేషించాడు. అపవాది అంటే రెండు మనసులు కలిగినవాడు. ఆఖరుకు ఇస్కరియోతు యూదా మీద కూడా ఆయనకు ద్వేషము లేదు. చెలికాడా అన్నాడు. మనము నోరు తెరచి మనకు సరిపోనివారిని స్నేహితుడా అన్నామా? అన్నయ్యా అన్నామా? మనకు అపకారం చేస్తాడని తెలిసిన వ్యక్తిని మనకు శిష్యునిగా పెట్టుకుంటామా? ఇస్కరియోతు యూదాను శిష్యునిగా చేర్చుకున్నాడు. అందరితోపాటు కూర్చోబెట్టుకున్నాడు. మొట్టమొదట ముక్కముంచి వాడికే ఇచ్చాడు.

మనకు ఇష్టము కాని వాళ్ళు ఇంటికి వస్తామంటే కూడా మేము ఆ సమయంలో ఉండము అని చెప్పడానికి ప్రయత్నిస్తాము. శరీర కార్యాలు మనలో అన్నీ ఉండవచ్చు. కొన్ని ఉండవచ్చు. వీటిని గూర్చి ఆలోచించాలి. ఎవరిమీదనైనా కక్ష్యగాని, ద్వేషంగాని, అసూయగాని ఉంటే ఇది శరీరకార్యమని వెంటనే దిద్దుకోవాలి. దిద్దుకోకపోతే శరీరానుసారుడు మనలో ఉన్నాడు. శరీరానుసారులు విశ్వాసం లేని పిల్లలు అని లేఖనాలు చెబుతున్నాయి. దిద్దుకుంటే ఆత్మానుసారులము.

అప్పుడు ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము అని గలతీ **5:22**లో వ్రాయబడివుంది. **9** రకములైన గుణములు గల ఒకే ఒక్క ఫలం ఇది. ఆత్మఫలములు అనలేదు. ఫలము ఒక్కటే 9 గుణాలున్నాయి.

మొదటిది ప్రేమ. నీవు ప్రేమించని వ్యక్తి ఎవరైనా ఉన్నారేమో ఆలోచన చేయి. వాళ్ళు ఎవరైనా గానీ నీవు ప్రేమించలేని వాడు ఉంటే నీలో ఆత్మఫలం లేదు అని అర్థం చేసుకోవాలి. అతనిని ప్రేమించు, నీలో ఆత్మఫలము ఉంటుంది. సంతోషం రెండవది. అందరితో సంతోషంగా ఉండగలుగుచున్నామా. ఒకపక్క సంతోషం మరోపక్క సంతోషం లేకపోవడం. ఎవరినైనా పలుకరించినా సంతోషం లేకుండా పలుకరించడం ఇది ఆత్మనింపుదల కాదు. ఒక అక్కకు సంతోషంతో వందనాలు పెట్టినా ఇంకో అక్క వస్తుంటె తప్పించుకొని పోయావు. నేను మందిరానికి వెళ్దామనుకుంటున్నాన్నా అయినా ఆయనను చూసి వెళ్ళిపోయాను, అనే వాళ్ళు ఉన్నారు. నేను అన్నల అక్కల సంగతి మాట్లాడుతున్నాను. లోకుల సంగతి కాదు. సంఘంలో వందనాలు చెబుదామంటే వెళ్ళిపోయాడు అంటున్నారు. సమాధానం లేదు. పరిశుద్ధాత్ముడు అల్లరికి కర్తకాదని సమాధానానికి కర్త అని వ్రాయబడింది. ఈ సమాధానము పరిశుద్ధాత్మకార్యమే.

తరువాత దీర్ఘశాంతము. అసలు శాంతమే లేదు. దీర్ఘశాంతము ఎక్కడనుండి వస్తుంది. ఆ అక్క ఏదో అనిందట. ఏమాటైనా ఇద్దరి ద్వారా వచ్చే కొద్దీ ఏమౌతుంది. పూర్తిగా మారిపోతుంది. అలా ఎన్నిసార్లు మనం అనడం లేదు. అలా అన్నానట, ఇలా అన్నానట అని మీదికి పోతుంటారు. వినబడకుంటే విడిచిపెట్టితే సరిపోతుంది. విడిచిపెట్టే మనస్సు లేదు. ఎందుకు లేదు. శాంతము లేదు. క్రైస్తవుల మధ్య శాంతమ్మ అని పేరు పెట్టుకునే వాళ్ళున్నారు. దీర్ఘశాంతమ్మ అనిపేరు పెట్టుకునేవాళ్ళు లేరు. ప్రేమ, సంతోషం, సమాధానం అని పేరు పెట్టుకున్నవాళ్ళు ఉన్నారు. కానీ దీర్ఘశాంతం అని ఎందుకు పేరు పెట్టుకోలేదని నాకు అనిపిస్తుంది. ఏ పేరు పెట్టుకున్నా ఆ గుణం మనలో ఉందా అని ఆలోచించుకోవాలి. నేనూ ఆలోచించుకోవాలి. మనందరిలో ఈ గుణాలు పెంపొందేట్టుగా చేసుకోవాలి. ఇదే ఆత్మఫలం.

తరువాత దయాళుత్వం, మంచితనం, సాత్వికము. ఇకవీటి గురించి చెప్పనవసరం లేదు. ఆశానిగ్రహం. ఎన్నో ఆశలు మనలో ఉన్నాయి. బజారులో వెళుతుంటే చూసినదంతా కావాలనుకుంటాం. ఆశానిగ్రహం ఉందా? లోతు కన్నులెత్తి చూచాడు. సొదొమ, గొమొఱ్ఱాలను చూచాడు. అంతే వెళ్ళాడు. ఒకాయన అన్నాడు. లోతు లోకంలోకి లోతుగా వెళ్ళిపోయాడని. లోతు చాలా లోతైన మనిషి. అలా ఎందుకు అనాల్సి వచ్చింది. ఆశానిగ్రహం లేకుండా పోయింది. నేను చూశాను, ఆశించాను, తెచ్చుకున్నాను అని ఎదురు ప్రసంగం చెబుతున్నాడు, ఆకాను యెహోషువ 7:21లో ఆత్మీయులైన మనకు ఆశానిగ్రహం ఉండాలి.

6:8లో తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమును పంటకోయును. ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుబట్టి నిత్యజీవమును పంటకోయును. అని ఉంది. ఆత్మను బట్టి విత్తుట అంటే ఏమి? ఇది సేవా సంబంధమయినది. సువార్త విత్తుట వాక్యములో స్పష్టముగా ఉన్నది. లోకము లోనికివెళ్ళి సువార్త ప్రకటించాలి. కీర్త 126:5లో కన్నీటితో విత్తితే సంతోషగానంతో పంటకోస్తాం అని ఉంది.

1 కొ 9:11లో మీ కొరకు ఆత్మసంబంధమయినవి మేము విత్తివుండగా మీ వలన శరీరసంబంధమైన ఫలములు కోసికొనుట గొప్పకార్యమా అని ఉంది. ఈ మాట బాగా ఆలోచించండి. ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మనుబట్టి నిత్యజీవమును పంటను కోస్తాడు. కాని ఇక్కడ ఆత్మనుబట్టి విత్తువాడు శరీరసంబంధమైనఫలములు కోస్తున్నాడు. పంట, ఫలము రెండు ఒక్కటే. అట్లయితే ఆత్మను బట్టి విత్తువానికి రెండు రకాలయిన జీతాలు ఉన్నాయన్నమాట. ఒకసనికి రెండు రకాలయిన ఫలములు ఉన్నాయి. లోకంలో దేనికున్నాయి చెప్పండి. ఇప్పుడు అన్ని డిపార్టుమెంటులకు లోటు వుంది. జీతాలు రావడమే కష్టమయింది. ఆ జీతాలు ఇవ్వలేక ప్రభుత్వాలు, కర్మాగారాలు సతమతమవుతున్నాయి.

కానీ ఆత్మను బట్టి విత్తువానికి రెండు జీతాలున్నాయి. అట్లయితే ఈ పరిచర్య ఎంత గంభీరమయినది. ఆత్మసంబంధమయిన పరిచర్య చేసేవారికి ఫలములు ఇస్తాడు. ఇంగ్లీషులో వస్తుసంబంధమైనవి అని ఉంది. ఆత్మను బట్టి విత్తేవారికి వస్తుసంబంధమైన

అక్కరలు ఉంటాయి. నీకు నాకు కడుపు కాలుతుంది. వాళ్ళకు కూడా కడుపు కాలుతుంది. నీకు నాకు బియ్యం అవసరం. వాళ్ళకూ అవసరం. నీకు నాకు ఎన్నో వస్తువులు అవసరం. వాళ్ళకూ కొన్ని వస్తువులు అవసరం.

వారికి వస్తుసంబంధమయిన ఫలాలు ఇస్తానన్నాడు. ఇచ్చే పని సంఘానికి అప్పగించాడని గుర్తుంచుకోవాలి. ఒకచోట జరిగిన సంభవం నేను చెబుతున్నాను. ఒక ఊరిలో ఒకాయనను సేవకు అప్పగించారు. ఒక్కపైసా కూడా ఇవ్వడం లేదు. ఆ సేవకుడు ఏమి తినాలి? ఎలా నిర్వహించబడాలి? ఇంకొక ఆయన సంఘంలో ఏమీ తీసుకోకుండా సేవచేస్తున్నాడట. అట్లాంటి సువార్తికుడు మాకు కూడా దొరికితే బాగుండును అంటున్నారు. మనవాళ్ళ ఆశ ఎట్లుందో చూడడండి. ఆత్మసంబంధమైన విత్తనాలు ఆయన విత్తుతూ ఉండాలి. మేము మాత్రం శరీరఫలం ఆయనకు ఇవ్వం.

ఆ సేవకుని గురించి నేను సంఘ పెద్దలతో మాట్లాడితే నెలకు రు.200 ఇస్తామన్నారు. తర్వాత మళ్ళీ జ్ఞాపకం చేశాను. ఇపుడు ఒక అబ్బాయి ఆ సేవకునికి పుట్టాడు. ఆ కొడుక్కి పెద్ద ఆపరేషను జరిగింది. ఆయన పరిస్థితి చాలా కష్టమయింది. తర్వాత వాళ్ళకు నేను ధైర్యం చెప్పాను. ఆయనకు మీరు తక్కువ ఇస్తున్నట్లున్నారు. మీరు ఆలోచించి ఎక్కువ ఇస్తే మంచిదన్నాను. ఎంత ఇవ్వాలి చెప్పన్నా అన్నారు. ఇవ్వాల్సింది మీరు కనుక మీరే ఆలోచించాలి అన్నాను. నాకు చెబుదాము అనిపించినా చెప్పలేదు. కొద్దికాలానికి వారు ఆలోచించి ఇంకో రు.200లు ఇచ్చారు. ఒంటరిగా ఉన్నపుడు రు.200లు ఇచ్చారు. భార్య కొడుకు వచ్చారు. కనీసం భార్యకు రు.200లు కొడుకుకు రు.200 అయినా ఇచ్చారా అంటే అదీ లేదు. కుమారునికి ఏం పెడతారు. ఆత్మసంబంధంగా విత్తువాడు శరీర సంబంధముగా ఫలములు కోసుకుంటారు. ఆ వాక్యము ఏమని చెబుతుంది? మీ కొరకు ఆత్మసంబంధమైనవి విత్తియుండగా మీవలన శరీర సంబంధమైన ఫలములు కోసికొనుట గొప్పకార్యమా? అది గొప్పకార్యము కాదే? గొప్పకార్యము కాదు. అంటే చాలా చిన్న కార్యమని దాని అర్థము. కానీ ఈ దినాలలో సంఘాలలో దాని గురించి అవగాహన లేదు.

నేను చెప్పే సంఘంలో ఒక సంఘపెద్ద ఒకసారి మాట్లాడుతూ నాకెంత జీతమో చెబితే మీరు కళ్ళుతిరిగి పడిపోతారు అన్నాడట. దేవుడు ఈయనకు కళ్ళు తిరిగిపోయేంత జీతము ఇస్తున్నాడు. అంటే జీతము ఎంత ఉంటుందో మీరే ఊహించుకోవచ్చు. వీరు సేవకునికి ఎంత ఇవ్వాలో మీరు చెప్పండి. ఇంకో రెండు వందలు ఇస్తే సరిపోతుందా అనుకుంటున్నారు. అది గొప్పకార్యమా. వీరి దృష్టికి గొప్పకార్యముగా కనిపిస్తుంది. నీకేమో ఇతరులు కళ్ళు తిరిగిపడే అంతటి జీతము. మీ సంఘములో సేవ చేసేవారికి చాలా తక్కువ జీతము.

మీ మీ ప్రాంతాలలో దేవుని కొరకు ఆత్మని బట్టి విత్తేవారు ఉన్నారు. వాళ్ళకు మీరు ఎటువంటి ఫలాలు అందిస్తున్నారు. శరీర సంబంధమైన ఫలాలు ఎన్ని అందిస్తున్నారు. మెటీరియల్ బెనిఫిట్స్ మీరు ఏమి ఇస్తున్నారు? వాళ్ళకు ఇవ్వాలి. అది గొప్పకార్యం కాదు. నేను మీకిచ్చాను అని చెప్పుకోవలసిన విషయము కూడా కాదు. అది దేవుడు నియమించిన సిద్ధాంతం. కనుక ఆత్మను బట్టి విత్తువారిని మనము గమనించాలి. శరీర సంబంధమైన ఫలములు వారికి అందించాలి.

నేను చిన్నవానిగా ఉన్నప్పుడు ఒక దొరగారు నేనున్న గ్రామానికి సువార్త సేవకై వచ్చాడు. ఆయన సేవాజీవితం గురించి మాట్లాడుతూ మనదేశంలో ఉండగా ఒక మీటింగ్‌కు రమ్మని పిలిచారన్నారు. టిక్కెట్టు కొనడానికి తన దగ్గర డబ్బు లేదన్నాడు. మరి ఏమి చేస్తాడు? ఇతర దేశమునుండి ఇండియాకు వచ్చి దేవుని సేవచేస్తూ టికెట్టు కొనుక్కోలేని పరిస్థితులలో ఈ దొరగారు ఉన్నారట. మిగిలినవాళ్ళ పరిస్థితి ఏమిటా అని ఆలోచించాలి. ఎందుకలా జరిగింది. అక్కడ ఉన్న సహోదరులకు వస్తు సంబంధమయిన ఫలములను సేవకులకు అందించే ఆలోచనలేదు. కాని సంఘముల మధ్య దీనిని గూర్చిన అవగాహన ఎంతైనా ఉండాలి. ఆత్మసంబంధమయిన ఫలములు విత్తినవారికి శరీర సంబంధమయిన ఫలములు అందించాలి. అదేమీ కష్టము కాదు. మన ఇంట్లో 10 మందిమి ఉన్నామనుకోండి. ఒక అతిథి వచ్చాడు. ఆయన కోసం ప్రత్యేకముగా చేసేది ఏమి ఉంటుంది. 10 మందికి పెట్టే దాంట్లోనే 11వ ప్లేట్లో పెడితే సరిపోతుంది.

10 మంది తలొక గరిటె పెడితే చాలు. సంఘంలో 10 మంది తమకున్న వాటిని ఆ 11వ వాడితో అనగా సేవకునితో పంచుకుంటే సరిపోతుంది. అదియే సంఘమునకు దశమ భాగమివ్వాలి అనే తలంపు.

గలతీ. 6:1 సహోదరులారా, ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనిన యెడల ఆత్మసంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడునేమో అని తన విషయమై చూచుకొనుచు సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచిదారికి తీసుకొని రావలెను.

సహోదరులారా ఒకడు తప్పిదములో చిక్కుకుంటే చిక్కుకున్నవాడు సహోదరుడా? అన్యుడా? సహోదరుడే. సోదరులు కూడా తప్పిదములో చిక్కుకుంటారా? అని అడిగే వాళ్ళు ఉన్నారు. చిక్కుకుంటారు. ఎవరైనా యం.యల్.ఏ. సంబంధులు అనుకోండి. ఎక్కడికి వెళ్ళినా మేము యం.యల్.ఏ. సంబంధులమని చెప్పుకుంటారు. అలా చెప్పినపుడు రండి కూర్చోండి అని గౌరవిస్తూ ఉంటాము. కానీ మనము ఎవరము? ఆత్మసంబంధులము. చిన్నవాళ్ళము కాదు. ఈ లోకాన్ని సృష్టించిన తండ్రి కుమారులము. పరిశుద్ధాత్మ సంబంధులము. మన జీవితం ఎల్లా ఉండాలంటే అలాగే ఉండాలి! సరే ఆత్మసంబంధులమైన మనము తప్పులో చిక్కుకోకూడదు. కానీ చిక్కుకున్నాము. చిక్కుకుంటే ఏమి చేయాలి చెప్పండి? ఒక మైకు తీసుకొని ప్రకటన చేయాలా? లేదా ఒక చిన్న పుస్తకము వ్రాయాలా? లేక ఇతర సంఘాలకు పత్రికలు వ్రాయాలా చెప్పండి. నీవు ప్రచురించు పత్రికలో ప్రచురించాలా? నాలో 95 మంచి గుణాలు, 5 చెడ్డగుణాలు ఉన్నాయనుకోండి. ఆ అయిదే చెబుతారు. ఒకబ్బాయి 100 ప్రశ్నలు వ్రాశాడు. 95 కరెక్టు అయ్యాయి. 5 తప్పులు పోయినాయి. టీచరు ఏమి చేస్తాడు చెప్పండి. క్లాసులో నిలువబెట్టించి అందరిచేత చప్పట్లు కొట్టిస్తాడు. ఒక గోల్డ్‌మెడల్ ఇచ్చి ఒక సర్టిఫికెట్ ఇస్తాడు. వాడు బ్రతికున్నన్ని రోజులు చెబుతాడు. కాని నాలాంటి వాడు అలా చేయక నీవు ఐదు తప్పులు చేశావు అంటే ఎలాగుంటుంది. వాడు బ్రతికినన్ని రోజులు ఇతను 5 తప్పులు చేశాడని చెప్పువారు సంఘములలో నున్నారు.

ఇంకోమాట! పాస్ కావడానికి 30 మార్కులు రావాలనుకోండి. 30 మార్కులే చాలు. అంటే 70 తప్పులు ఉన్నా ఫరవాలేదు. ఎట్లా పాస్ చేస్తారు అని మీరు నిందిస్తారు. ఇది ఆత్మసంబంధమయిన లక్షణం కాదని తెలుస్తుంది. ప్రేమించే టీచరు 30 మార్కులు వచ్చే విద్యార్థిని అది తప్పు చేశావు కనుక ఇట్లా చేయి, ఇంకా ఎక్కువ మార్కులు వస్తాయంటాడు. 30కి పాస్ చేసి తరువాతి క్లాస్‌కి పంపిస్తాడు. టీచరు చెప్పినట్లు చేస్తే తర్వాత క్లాస్‌లో 60 మార్కులు వస్తాయి. తప్పులు సవరించుకుంటే 70 వస్తాయి. ఇంకా స్టేట్ ఫస్ట్ కూడా వస్తుంది. అయినా తప్పులుంటాయి. ఈ మధ్య కాలేజీలు చాలా వచ్చిన తర్వాత ప్రవేశపరీక్షలో సున్నా మార్కులు వచ్చిన వారికి కూడా సీటు ఇచ్చారు. అయితే పరీక్ష వ్రాసి ఉండాలనే షరతు మీద.

ఆత్మీయులుగా మనము సున్నా మార్కులకి సీట్లు పొందినవారము. నలుగురు కూడి ఉంటే 5వ వానిలో ఉండే బలహీనతలను ఎత్తిచూపుకుంటున్నారు. దీనివిషయమై మనము జాగ్రత్తగా ఆలోచించాలి. యోహాను సువార్త 13వ అధ్యాయంలో ప్రభువు భోజన పంక్తిలో కూర్చున్నాడు. లేచి నడుముకు తువ్వాలు కట్టుకొని, నీళ్ళుతీసుకొని, ఇంకోచేత్తో ప్లేటు పట్టుకొని శిష్యుల పాదాలు కడగడం మొదలుపెట్టాడు.

పేతురు కాళ్ళవైపు చూచి మిగలా 11 మందితో పేతురు కాళ్ళమీద మచ్చ ఉంది చూడండి, ఈ దాగు ఉంది చూడండి. ఇది తొక్కాడు చూడండి అని కడిగాడా? ఒకరి మలినాలు ఒకరికి తెలియవు. ఆయనకు మాత్రమే తెలుసు. అందరికి తెలిపాడా లేదు. ఆత్మీయులమైన మనం తప్పిదాల్లో చిక్కుకున్న వారిని ఎంచవలసిన విధానము ఎంటో చూడండి. నీవు కూడా తప్పిదాల్లో చిక్కుకుంటావు. జాగ్రత్త అని చెప్పాడు. నీవేదో మొనగాడివని, నీవు జయించిన వాడివని అనుకోవద్దు. తాను శోధింప బడుదునేమో అని జాగ్రత్తగా చూచుకోవాలి. ముందు చూచుకున్న తర్వాత ఏం చేయాలి? సాత్వికమైన మనస్సు ఉండాలి. కఠినమైన మనస్సు కాదు. నీలో కఠినత్వం, భయం లేనితనం ఉంటే ఆ పనికే పోవద్దు. ఆ పని చేయడానికి నీవు సాత్వికుడవు

అనిపించుకోవాలి. తర్వాత ఒక్కనిగా వెళ్ళాలి. గుంపులుగా కాదు. సంఘంలో వాదనకాదు. అట్టి వానిని మంచి దారికి తీసుకొని రావాలి. ఒకని భారాలు ఒకని మీద మోసుకొనుడి. అది నీకు భారంగానే ఉంటుంది. ఎందుకంటే అతని భారం నీవు నీమీద వేసుకుంటున్నందుకు. నిజమే సంఘంలో పేచీలు పోవాలంటే వాళ్ళ గొడవ నెత్తిన వేసుకోవాలి. వీళ్ళ గొడవ నెత్తిన వేసుకోవాలి. ఆయన నాలుగు కోరుతారు. ఆ భారం నీ మీదవేసుకోవాలి. అది క్రీస్తునియమం. క్రీస్తు నియమించిన విధానము. యోహా 13:6లో బోధకుడను ప్రభువైన నేను ఈలాగు చేస్తే మీరు కూడా ఒకరికొకరు ఆలాగు చేసుకోండి. నేను బోధకుడను అని యేసు ఎందుకు చెప్పాడు. బోధకులమైన మనము ఇతరుల కాళ్ళు కడగాలని ఆయన ఉద్దేశం.

ఈ కాళ్ళు కడిగే ఆచారం మతాచారముగా చేసేవారు క్రైస్తవకోటిలో ఉన్నారు. ముఖ్యంగా కేథలిక్‌వారు ఒకరోజు అందరి పాదాలు కడుగుతారు. కడిగేరోజు ఏమి చేస్తారో తెలుసా. ముందు బయటికివెళ్ళి కాళ్ళు కడుక్కుందాం అంటారు. తొట్టిలో ఉన్న నీళ్ళతో ఎవరి కాళ్ళు వారు కడుక్కొని వచ్చిన తరువాత ఆచార ప్రకారముగా బోధకుడు నీళ్ళుపోసి కాళ్ళుకడుగుతాడు. ఒక టవలు పెట్టి తుడుస్తాడు. కానీ ప్రభువు అట్లన్నాడా. ఆయన భోజనం మానుకొని ఆహారం మానుకొని చేసిన పని అది. క్రీస్తు నియమాన్ని మనం నెరవేర్చాలి.

క్రీస్తు మనస్సు మనకు లేదు కాబట్టి సంఘాలలోని సమస్యలు సమస్యలుగానే మిగిలి వున్నాయి. కానీ ఆత్మసంబంధులు అలా మిగుల్చుకోరు. ఆత్మ సంబంధులమైతే ఏమి చేయాలి? గలతీ. 4:6 మరియు మీరు కుమారులై ఉన్నందున నాయనా తండ్రీ అని మొరపెట్టు తన కుమారుల ఆత్మను మన హృదయములోనికి పంపెను. మనము శోధించబడకుండా ప్రార్థన చేసుకోవాలి.

వ్యభిచారమందు పట్టబడిన ఒక స్త్రీ రేపు ప్రొద్దున 6 గంటలకు దేవాలయమునకు తీసుకొని రాబడుతుందని ప్రభువు ఎరుగును. రాత్రి కొండమీదకు వెళ్ళి నిద్రపోయాడా?

లేదు. ఒంటరిగా కొండమీద ఉన్నాడు. ఒకసారి పేతురు, యోహాను, యాకోబులు వచ్చారు. ఈ రోజు వారు కూడా లేరు. ఎవరింటికి వారు వెళ్ళిపోయారని యోహాను 7:53లో ఉంది. యేసు ఒక్కడే కొండమీద ఉన్నాడు. ఎంతటి ఆత్మచేత నింపబడ్డాడో తర్వాత దేవాలయానికి వచ్చాడు. ఆమెను పట్టుకొచ్చారు. బోధకుడా ఈ స్త్రీ వ్యభిచారము చేయుచుండగా పట్టబడెను. అట్టివారిని రాళ్ళు రువ్వి చంపవలెనని ధర్మశాస్త్రములో మోషే మనకు ఆజ్ఞాపించెను. అయినను నీవేమి చెప్పుచున్నావని ఆయననడిగిరి. ఆయన ఏమీ మాట్లాడలేదు. ఏమో నేలమీద వ్రాస్తూ ఉన్నాడు. అప్పుడు తలయెత్తి మీలో పాపంలేని వాడు మొదటగా రాయి వేయండి అన్నాడు. అంతే అందరు వెళ్ళిపోయారు. ఆయన మాటల్లో శక్తి ఉంది. ఆయన మాటలలోను క్రియలలోను శక్తిగల ప్రవక్తయై యుండెను, అని లూకా 24లో ఇద్దరు శిష్యులు ఎమ్మాయి మార్గంలో అనుకుంటున్నారు.

మనము ఎన్ని మాటలు మాట్లాడినా కార్యం జరగడం లేదు. శక్తి ఎక్కడనుండి రావాలి? శక్తిని పొందడానికి ఆయన రాత్రి కొండమీద గడిపిన సమయం ప్రార్థనా జీవితం. ఆ ప్రార్థన చేయుటకై ఆత్మ నాయనా తండ్రీ అని మొరపెట్టే ఆత్మను దేవుడు మన హృదయాల్లోకి పంపాడు. అది కూడా ఆత్మకార్యమే. మనలను మనము పరిశుద్ధాత్మునికి అప్పగించుకొనే కొలది ఆత్మలో మనం ప్రార్థన చేసుకొనే కొలది 1 కొరింథీ. 14:15 ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును అన్నట్లు వీటన్నిటిని మనం పొందుతాము.

గలతీ. 5:5 ఏలయనగా మనము విశ్వాసము గలవారమై నీతికలుగునను నిరీక్షణ సఫలమగునని ఆత్మద్వారా ఎదురు చూచుచున్నాము. ఆత్మ మనలను ఫలములు గల జీవితమునకు నడిపించి ఎదురు చూచునట్లు చేయును.

★★★

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో పరిశుద్ధాత్మని పరిచర్యలు

ఇందులో 13 పర్యాయములు ఆత్మను గూర్చిన ప్రస్తావన ఉంది. రెఫరెన్సులు వరుసగా గమనించండి. ఎఫెసీ 1:13, 14, 2:18, 21-22, 3:5, 15, 4:4, 30. 5:17, 19, 6:1, 17, 18. ఇందులో విశ్వాసిని లేదా విశ్వాసుల సమూహము దృష్టిలో ఉంచుకొని పౌలు మాట్లాడుచున్నాడు.

మొదటి అధ్యాయములో సంఘ ప్రణాళికను గూర్చి చెప్పుచున్నాడు. ప్రణాళిక అంటే ప్లాను. దేవుని సంఘపు ప్లాను వివరాలు చూడగలము. రెండవ అధ్యాయములో సంఘ పరిస్థితిని గూర్చి మాట్లాడుచున్నాడు. మూడవ అధ్యాయములో సంఘమును గూర్చిన ప్రత్యక్షతను ప్రకటిస్తున్నాడు. నాలుగు నుండి ఆరు అధ్యాయాల్లో సంఘ నడకను గూర్చి చెప్పుచు 1-3 అధ్యాయాలలో బోధ, 4-6 అధ్యాయాలలో నడక చెబుతున్నాడు.

5వ అధ్యాయంలో ఆత్మ కలిగించు ఐక్యత కాపాడుకొనుట యందు శ్రద్ధగలవారై ప్రేమతో ఒకనినొకడు సహించుచు నడుచుకొనుడి అన్నాడు. ఆత్మ ఒక్కడే. ఒక్కరముగా ఉండుటకు పిలువబడ్డాము. ఒకటిగా నడుచుకొనండి అంటున్నాడు. విమోచన దినము వరకు ఆత్మ చేత ముద్రించబడ్డారు గనుక ఆత్మను దుఃఖపరచకండి అంటున్నాడు. మన ఆత్మీయ యాత్రలో పరిశుద్ధాత్మ దేవుడు విమోచన దినము వరకు మనతో ఉంటాడు. ఆయనను దుఃఖపరచకూడదు. (4:30) ఆత్మసంబంధమైన పద్యాలతో హెచ్చరించుకుంటూ నడవాలి. ఆత్మపూర్ణులమై నడవాలి అంటున్నాడు. 6వ అధ్యాయములో ఆత్మఖడ్గము గలవారమై నడుచుకోవాలి అన్నాడు.

1 నుండి 3 వరకు సిద్ధాంతపరముగా సంఘమంటే ఏమిటి? సంఘము ప్రణాళిక ఏమిటి? దాని ప్రత్యక్షత ఏమిటి అని చెప్పాడు. 4-6 అధ్యాయాలలో సంఘము యొక్క నడకను గురించి చెప్పుచున్నాడు.

ఒక ఆస్తి పొందాలంటే (1) కొనే ఏర్పాటు జరగాలి. అంటే వెల ఎంతో నిర్ణయము జరగాలి. (2) దాని వెలకు సరిపోవు డబ్బు సమకూర్చుకోవాలి. (3) వెల చెల్లించి ఆస్తిని మనము వశపరచుకోవాలి. ఆ మూడు అంశాలు ఉంటాయి.

ఏర్పాటు 12వ వచనంలో జరిగింది. క్రీస్తునందు ముందుగా నిరీక్షించిన మనము తన మహిమకు కీర్తి కలుగజేయు వారమని, దేవుడు తన చిత్తప్రకారమైన సంకల్పము చేశాడు. ఎప్పుడు జగత్తు పునాది వేయబడక మునుపే (6). ఒకస్థలము ఏర్పాటు చేసుకొనుటకు కొనుటకు చాలా తేడా ఉంది. యేసుప్రభువు నిన్ను ఒక స్వాస్థ్యముగా ఏర్పాటు చేసుకొన్నాడు. నీకు ఒక స్వాస్థ్యాన్ని ఏర్పాటుచేసి పెట్టాడు. ఈ ఏర్పాటు జగత్తు పునాదివేయబడకముందే జరిగింది. మనము పుట్టకు మునుపే, ఆదాము కూడా పుట్టక మునుపే, జగత్తు కూడా పుట్టకమునుపే ఏర్పాటుచేసిన స్వాస్థ్యము ఇది. ఎంతగొప్పదో చూడండి.

ఉదా॥కు శ్రీశైలం ఆనకట్ట కట్టడానికి 25 ఏండ్లకు ముందే ప్రణాళికవేయబడింది. 25 ఏండ్లలో వందల కోట్లు ఖర్చు పెట్టాలి. ఎలా డబ్బు సమకూర్చాలో, ఎలా ఖర్చుపెట్టాలో, ఎలాకట్టాలో ముందే ప్రణాళిక వేయబడింది. మన ఇంటిని కట్టుటకైతే అంత మొత్తము అవసరము లేదు. అంతకుముందే ప్రణాళిక అవసరము లేదు. జగత్తు పునాది వేయబడకముందే మన స్వాస్థ్యము ఎంతగొప్పదో ఆలోచించండి. ఆదాము పుట్టి 6000 ఏండ్లు జగత్తు ఎప్పుడు పుట్టినదో మనకు తెలియదు. అంతకు మునుపే అంటే ఎంతకాలము ముందో ఆలోచించండి. ఈ స్వాస్థ్యానికి సంచకరువుగా పరిశుద్ధాత్మను ఇచ్చాడు.

దాని వెల ఎప్పుడు చెల్లించాడు. కల్వరిలో యేసు మనకొరకు రక్తము కార్చినపుడు. దేవుని కృపామహదైశ్వర్యము బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగియున్నది (7). కాలము సంపూర్ణమైనపుడు జరుగవలసిన ఏర్పాటును బట్టి (8) జరిగింది. ఇది కూడా ఏర్పాటే. యేసుక్రీస్తు వారిని కలువరి శిలువకు అప్పగించి రక్తము చిందించుటకు దేవుని ఏర్పాటు, అనగా దేవుని ప్రణాళిక యేసుక్రీస్తులో నెరవేర్చాడు. ఆయన ప్రణాళిక ప్రకారం రక్తం చిందించాడు. రక్తము చిందించి రెండు వేల సంవత్సరాలు అయింది. అప్పుడు కూడా మనము పుట్టలేదు. వయసు 30, 40 ఎక్కువ అంటే 100, 120 ఏండ్ల కంటే ఎక్కువ ఎవరికి ఉండవు.

2004 ఏండ్ల క్రితము ఆ స్వాస్థ్యానికి మూల్యము సమకూర్చి చెల్లించాడు. అలాగైతే ఆ స్వాస్థ్యము ఎంతపెద్దదో ఆలోచించండి. అది మనకు అర్థము కాదు. అంతగొప్ప స్వాస్థ్యము కొని మనకు ఇచ్చాడు. దానికి సంచకరువుగా ఆయన ఆత్మను ఇచ్చాడు.

17-19లో మరియు మీ మనోనేత్రములు వెలిగింపబడినందున (17) అంటున్నాడు. మానవులకు రెండు నేత్రములు ఉన్నవి. నమ్మినవారికి మూడవనేత్రము వెలిగింపబడినది. మిమ్మును పిలిచిన పిలుపు వల్లనైన నిరీక్షణ ఎట్టిదో? ఇది ఒక ప్రశ్న. ఆయన పిలిచాడు. మనము నిరీక్షణ ఉంచాము. ఆ నిరీక్షణ ఎట్టిదో? ఈ స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో? మనకు తెలియదు. అసలు స్వాస్థ్యము ఎటువంటిదో తెలియదు. దాని మహిమైశ్వర్యము ఎలా తెలుస్తుంది? ఆయన క్రీస్తునందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి విశ్వసించు మనయందు ఆయన చూపుచున్న తన శక్తి యొక్క అపరిమితమైన మహాత్మ్యమెట్టిదో? మీరు తెలుసుకొనవలెను అంటున్నాడు.

స్వాస్థ్య ము యొక్క మహిమైశ్వర్యము 2 కొరింథీ. 5:1-6లో చూడగలము. ప్రకటన 21లో యోహానుకు చూపించబడినది. 21:10-26 వరకు యెరూషలేము ప్రాకారము, గుమ్మము, పునాదులు చూపబడ్డాయి. ప్రాకారము పునాదులు అమూల్యమైన రత్నములలో అలంకరింపబడ్డాయి. ప్రాకార వివరములే గాని పట్టణ వివరములు లేవు. రాజవీధి శుద్ధసువర్ణమయమైన స్ఫటికమును పోలివున్నది. ఇటువంటి వీధి, ప్రాకారముగల పట్టణాలు ఎలా ఉంటుందో ఆలోచించాలి. ఆ పట్టణాన్ని మనకు స్వాస్థ్యముగా ఇచ్చాడు అంటే మన స్వాస్థ్యమెంత గొప్పదో ఊహించాలి. మనస్వాస్థ్యము ఎట్టిదో తెలియదు. మనపిలుపు ఎట్టిదో తెలియదు. స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో తెలియదు. ఆయన శక్తి యొక్క అపరిమితమైన మహాత్మ్యమెట్టిదో తెలియదు. ఇవన్నీ తెలుసుకొనుటకే మనకు ఆత్మ అను సంచకరువును ఇచ్చాడు.

ఒక ఆస్తిని ఒక లక్షను కొంటే ఒకవెయ్యి సంచకరువు ఇస్తాము. 20 వేలకు కొంటే రెండు లేదా మూడువందల సంచకరువు ఇస్తాము. వెయ్యి సంచకరువులను చూసినపుడు ఆస్థి విలువ నూరు లంతలు అన్నమాట. సంచకరువు చూస్తే దాని వెల మనకు అర్థమవుతుంది. ఆయన పిలుపును తెలుసుకొనుటకు ఈ సంచకరువు ఒక మార్గముగా ఉన్నది.

ఎఫెసీ 3:3-5. క్రీస్తు మర్మము గురించి పౌలుకు తెలియబడింది. ఈ మర్మము పూర్వకాల మనుష్యులకు తెలియబడలేదు. వారికి తెలియబడని మర్మము పౌలు గ్రహించుటకు జ్ఞానము ఇచ్చినపుడు ఆత్మ అని తెలుస్తున్నది. ఆత్మ ద్వారా పౌలు గొప్ప మర్మములు గ్రహించాడు. దీన్నిబట్టి ఆత్మయొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో తెలుస్తున్నది.

ప్రకటన 21 అధ్యాయంలో నూతన యెరూషలేము పొడవు వెడల్పులు ఇవ్వబడినవి. 750 కోసులు అని తెలుగు బైబిలులో ఉన్నది. ఇంగ్లీషు బైబిలులో 1500 మైళ్ళు, క్రొత్తగా వచ్చిన బైబిలులో 2400 కి.మీ. అని ఉన్నది. పొడవు, వెడల్పు, ఎత్తు సమానము అంటే పొడవు 2400 కి.మీ. వెడల్పు 2400 కి.మీ. ఎత్తు 2400 కి.మీ. అన్నమాట. భారతదేశము సుమారు 2400 కి.మీ. పొడుగు కలదుకాని వెడల్పు అంతగానుండదు. అసలు మన భారతదేశము చతురస్రాకారము లేదు. భారతదేశ వైశాల్యానికి నూతన యెరుషలేము రెండంతలు ఉంటుంది. ఆ పట్టణ వైశాల్యం (2400 x 2400 చ.కి.మీ.), ఎత్తు కూడా 2400 కి.మీ. అంటే ఆలోచిద్దాము. మన మందిరముల ఎత్తు 3 మీటర్ల కంటే ఎత్తు ఉండదు. అంతస్థులు ఎక్కువగా ఉన్నప్పుడు ఎత్తు 2.4 మీటర్లు ఉంటుంది.మనము ఇప్పుడు కట్టు 2.4 మీటర్ల ఎత్తుగల బిల్డింగుల ప్రకారము అంచనా వేస్తే10 లక్షలఅంతస్థులు ఉండును. సామాన్యముగా హైదరాబాదులో 10 నుండి 20 అంతస్తుల భవనాలు ఉంటాయి. 10 లక్షల అంతస్థులు అంటే మన స్వాస్థ్యము ఎంతగొప్పదో ఊహించాలి. భారతదేశమంత రెండంతల వైశాల్యంతో 10 లక్షల అంతస్తులుండే నగరము మనది.

ఆదాము నుండి నేటివరకు మనుష్యులను లెక్క గడితే 4800 కోట్లకు మించరు. ఒక అంతస్థుకు 5000మంది వస్తారు. ఆదాము నుండి జనాభాలో విశ్వాసుల సంఖ్య మాత్రమే తీసుకుంటే చాలా తక్కువ. ఇలా లెక్కవస్తే మనకు ఒక్కొక్కరికి ఒక జిల్లా కంటే ఎక్కువ స్వాస్థ్యము దొరుకుతుంది. నమ్మగలరా మీరు. మన్ను దుమ్ము లేని శుద్ధ సువర్ణమైన రాజమార్గాలు. ఇలా ఆలోచిస్తే ఈ లోకంలో మనకు స్వాస్థ్యము ఉన్నా లేకున్నా ఒకటే. దీని గ్రహించుటకు అవసరమైన జ్ఞానాన్ని ప్రత్యక్షత గల మనస్సును ఇచ్చుటకు సంచకరువుగా ఆత్మ మనకు అనుగ్రహించబడ్డాడు.

అందుకే జగత్తు పునాది వేయకముందే దేవుడు ఏర్పరిచాడు. దాని వెలను యేసు 2005 ఏండ్ల క్రిందట చెల్లించాడు. 2005 ఏండ్లుగా దానిని సిద్ధపరుస్తున్నాడు. పరిశుద్ధాత్ముడు భూలోకంలో ప్రస్తుతము మన దగ్గరకు వచ్చాడు. ఆ పాపివి నీవే అని ఒప్పించుచు యేసురక్తంలో పాపాలు పోతాయి అని మనచేత తీర్మానం చేయిస్తున్నాడు. తన ఆత్మచేత ముద్రిస్తున్నాడు. సంచకరువుగా మనలో ప్రవేశిస్తున్నాడు. మనకు జ్ఞానము, ప్రత్యక్షత గల మనస్సు అనుగ్రహిస్తున్నాడు.

సంఘమంటే (చర్చి) నాలుగు గోడల కట్టడం కాదు. కట్టడము కూడుకొను స్థలము మాత్రమే. జీవము గల సంఘము (చర్చి) మొదట పెంతెకొస్తు దినాన కట్టబడింది. 3 వేలు, 5 వేలు సంఘములో చేర్చబడ్డారు. ఇలా నాటి నుండి నేటి వరకు కట్టబడతూవుంది. అప్పుడు ఒకే సంఘము యెరూషలేములో ఉండేది. ఇపుడు ఊరి ఊరికి ఒకటయ్యాయి. ఒకటి కాదు డజను, 40, 50 శాఖలు ఉపశాఖలుగా పెరిగాయి. వీటిని స్థానిక సంఘములు అంటున్నాము. కాని సార్వత్రిక సంఘము దేవుని చేత సజీవమైన రాళ్ళచేత కట్టబడుతూ ఉంది.

2004 సంవత్సముల నుండి కట్టబడుచూ ఉంది. ఇంతకాలముగా భూలోకంలో ఏదీ కట్టబడదు. సొలొమోను 7 సంవత్సరములలో మందిరమును కట్టి ముగించాడు. అ మందిరమును వర్ణించుటకు మాటలు చాలవు. యోహాను సువార్త 2:20లో 46 సంవత్సరములు ఆనాటి దేవాలయము రాజైన హేరోదుచే కట్టబడినట్లు ఉంది. 2004 ఏండ్లుగా కట్టబడే మనస్సౌధ్యము ఎంత అద్భుతముగా ఉంటుందో చెప్పనవసరము లేదు.

ఇటువంటి విచిత్రమైన ప్రణాళిక ఆయన మన విషయమై కలిగివున్నాడు. ఇది పంచవర్ష ప్రణాళిక కాదు. ఇప్పటికే 2004 సంవత్సరములు అయినది. ఇక ఎంత కాలము అవుతుందో తెలియదు. ఈ విషయం గ్రహించుటకు ఆత్మ ప్రత్యక్షత మనకు అనుగ్రహించాడు. 2:18లో ఆయన ద్వారానే మనము ఉభయులము ఒక్క ఆత్మయందు తండ్రి సన్నిధికి చేరగలిగియున్నాము అంటున్నాడు.

2:1లో సంఘ పరిస్థితి గమనిస్తే మొదట అపరాధముల చేత పాపముల చేత చచ్చినస్థితి. ఇపుడు క్రీస్తునందు బ్రదికింపబడి రక్షింపబడ్డాము. సత్క్రియలు చేయుటకు

పిలువబడ్డాము. మొదట అన్యులు, యూదులు ఏకం చేయబడ్డారు. ఆయన చేత సిద్ధపరచిన స్వాస్థ్యము పొందుటకు తండ్రి సన్నిధికి చేరగలిగివున్నాము (2:18). తండ్రి సన్నిధికి ఎవరు తీసుకుని పోతారు? ఆత్మ తీసుకొని వెళ్తాడు. మనము హైదరాబాదుకు వెళ్ళాలంటే ఏదో ఒక వాహనము కావాలి. అలాగే స్వాస్థ్యము అనుగ్రహించి స్వాస్థ్యమును సంపాదించుకొను స్థలమునకు తీసుకొని వెళ్ళువాడు ఆయనే. ఆత్మ యందే మనము తండ్రి సన్నిధికి చేరగలుగుచున్నాము.

2:22 ఆయనలో మీరు కూడా ఆత్మమూలముగా దేవునికి నివాస స్థలమై ఉండుటకు కట్టబడుచున్నారు. సంఘాభివృద్ధి మన నాలుగు గోడల గూర్చే అనుకుంటున్నాము. ఒక బ్రహ్మాండమైన కట్టడముగా ప్రభువుకు పరిశుద్ధమైన దేవాలయంగా భూలోక మంతటిలో నుండి విశ్వాసులు కట్టబడుచున్నారు. దీనినే సార్వత్రిక సంఘము అంటున్నాము. స్థానిక సంఘాలకే పరిమితము కాక సార్వత్రిక సంఘాభివృద్ధి కూడా మన బాధ్యతయై ఉన్నదని గుర్తించుకోవాలి. ప్రభువు దృష్టి కూడా సార్వత్రిక సంఘంపై ఉంది.

సార్వత్రికసంఘము భూలోకంలోనికి వచ్చింది అనుకోండి. అపుడు ప్రస్తుతమున్న శాఖలు ఉండవు. విభేదాలు ఉండవు. 2000 ఏండ్ల క్రితము ప్రారంభించబడిన ఆ దేవాలయం వృద్ధిపొందుచున్నది. ఇంకా ముగింపు కాలేదు. 300 గదులు కడితే అద్భుత కట్టడమవుతుంది. వెయ్యిమంది నివసించుటకు అనుకూలమైన బ్రహ్మాండమైన భవనాలు ఉన్నాయి. కోట్లకొలది నివసించే ప్రభువు కట్టి అద్భుత కట్టడం సంఘము. ఇంత కట్టడము కట్టుటకు దేవునికి ఎవరు సహాయం చేయాలి? పరిశుద్ధాత్ముడే. ఆత్మమూలముగా దేవునికి నివాస స్థలమై ఉండుటకు కట్టబడుచున్నాము. (ఎఫెసీ2:22) కట్టుట పరిశుద్ధాత్ముడే తండ్రి సన్నిధికి చేర్చుట పరిశుద్ధాత్ముడే!

3:5లో ఈ మర్మము ఇప్పుడు ఆత్మమూలముగా దేవుని పరిశుద్ధులకు అపొస్తలులకు, ప్రవక్తలకు బయలుపరచి ఉన్నట్లుగా పూర్వకాలమందు మనుష్యులకు తెలియపరచబడలేదు. పూర్వకాలమందు గొప్ప ప్రవక్తలైన యిర్మీయా, యెహెజ్కేలు,

దానియేలు, యెషయా ప్రవక్తలు ఉన్నారు. దానియేలు 7 వారాలు, 62 వారాలు, ఒక్క వారము అన్నాడు. కొన్ని విషయాలు దానియేలుకు మర్మముగా ఉన్నాయి. దానియేలు ఈ మాటలను మరుగుచేసి అంత్యకాలము వరకు ఈ గ్రంథమును ముద్రింపుము (దానియేలు 12:4) అన్నాడు. కాని ఈనాడు ముద్రవిప్పి నీకు నాకు బయలుపరచాడు (ప్రకటన 5:5). పూర్వకాలంలో భక్తులు మనకంటే తక్కువ వారు కారు. మనకంటే శ్రేష్ఠమైన వారైనా వారికి మరుగుచేయబడ్డాయి. ఈ సంఘ ప్రత్యక్షత ఆ దినాలలో లేదు. మనకు ఆత్మప్రత్యక్షత అనుగ్రహించుచున్నాడు. అయినా మనము నేర్చుకొనవలసినంత నేర్చుకొనలేకపోవుచున్నాము.

యెహెజ్కేలు చెప్పనిది దానియేలు చెప్పలేదు. యెరూషలేము పాడైన దినాలు 70 సం॥లు అయిపోయినవి అని యిర్మీయా గ్రంథము చదివి తెలుసుకున్నాడు. పెద్ద ప్రవక్త అయినా దానియేలుకు అన్ని విషయాలు చెప్పలేదు. మరుగైనవి గ్రహించుటకు ఇప్పుడు మనకు ఆత్మప్రత్యక్షత అనుగ్రహించాడు.

పూర్వము మానవులకు ఇట్టి ప్రత్యక్షత లేదు. ఇప్పుడు ఆత్మమూలముగా దేవుడు సంగతులను ప్రత్యక్షపరచాడు. ఆత్మమూలముగా దేవుని పరిశుద్ధులకు, అపొస్తలులకు, ప్రవక్తలకు బయలుపరచబడింది. ప్రకటన గ్రంథంలో ప్రత్యక్షత అంటే కప్పును తీసేది అని అర్థము.

ఎఫెసీ 3:15-18లో ఆత్మ బలపరచువాడు అని ఉంది. కాని ఆత్మవలన బలపరచబడవలసినంతగా మనము బలపరచబడలేదు. లోపము ఆయనది కాదు మనదే. ఆత్మబలపరచువాడు. మనలను బలపరచుటకు ఇష్టపడుచున్నాడు. మనము దీనికి సిద్ధముగా లేము. కాబట్టి ఆత్మచేత బలపరచబడి కార్యక్రమాలు ముందుకు సాగించాలి.

**4:1** ఆత్మ సమాధానము, ఐక్యము కలిగించువాడు. కాని సంఘాలలో సమాధానము, ఐక్యత కొరవడుచున్నాయి. విశ్వాసుల మధ్య సేవకుల మధ్య, పెద్దల మధ్య భేదాలు వస్తున్నాయి. ఆత్మ ఐక్యము కలిగించే వాడు కాని భేదాలు కలిగించేవాడు కాదు.

ఐక్యము కాపాడుకొనాలి అంటే శ్రద్ధకలిగి వుండాలి. శ్రద్ధ లేకుంటే ఐక్యత పాడవుతుంది. కుటుంబములు గాని, సంఘంలో గాని ఐక్యత కాపాడుకోవాలనే శ్రద్ధ కలిగివుండాలి. శ్రద్ధ లేని సోమరులు ఐక్యత కోల్పోతారు.

సమాధానము అనునది బంధము. బంధము ఉంటేనే సమాధానము ఉంటుంది. బంధము ఇష్టములేని వాడు స్వేచ్ఛగా ఉండాలనుకుంటాడు. స్వేచ్ఛను కోరువాడు సమాధానాన్ని త్రెంచుతాడు. సమాధానాన్ని కోరువాడు స్వేచ్ఛను త్రెంచుకుంటాడు. సమాధానముగా ఉందాము. స్వేచ్ఛకు హద్దులు వేద్దాము.

మిమ్మును బతిమాలుకుంటున్నాను అని పౌలులాంటివాడు అంటున్నాడు. సహనము, దీర్ఘశాంతము, సంపూర్ణ వినయము, సాత్వికముతో నడుచుకొనుట ఐక్యతను కాపాడుతుంది అంటున్నాడు. పౌలు బ్రతిమాలుకుంటుండగా ఐక్యతను కాపాడుకుందాము.

ఎఫెసీ. **4:30** పరిశుద్ధాత్మ దుఃఖపడగలడు. విమోచన దినము వరకు ఆయన మనలో ఉంటూ దుఃఖపడుతూ ఉంటే మనకు క్షేమమా? భార్య భర్తను దుఃఖపెట్టగలదు, సంతోషపరచగలదు. దుఃఖిస్తూ భార్యతో సంసారం చేసే భర్తకు ఎంత కష్టము. అలాగే మనద్వారా దుఃఖపడుతూ పరిశుద్ధాత్ముడు మనతో ఉంటే ఎంతవిచారము. కనుక పరిశుద్ధాత్ముని దుఃఖపెట్టకుందుము గాక.

ఎఫెసీ **5:18** ఆత్మపూర్ణులముగా ఉండాలి. మద్యము గూర్చి 18వ వచనములో చెప్పుచున్నాడు. మద్యపు మత్తుతో కాక ఆత్మపూర్ణతతో ఉండమంటున్నాడు. దినములు చెడ్డవి అంటున్నాడు. రాబోయేవి మంచిరోజులు అనుకోకండి. ఈరోజే దేవుని వెదకి సమయాన్ని సద్వినియోగం చేసుకుందాము.

త్రాగిన వ్యక్తికి చొక్కా వుందో పోయిందో తెలియదు. డబ్బులు ఉన్నాయో పోయాయో తెలియదు. ఒక త్రాగుడు తప్ప. అంతమైకంలోను త్రాగుతూనే ఉంటాడు. అలాగే పరిశుద్ధాత్మతో నిండిన వ్యక్తి పరిశుద్ధాత్ముని పనులే చేస్తాడు. పరిశుద్ధాత్ముని సంగతులే మాట్లాడుతాడు. లోకము లోకములో ఉన్నదేదీ గుర్తుకు రాదు. పరిశుద్ధాత్మపూర్ణులమై ఉందుము గాక.

# ఫిలిప్పీ, కొలస్సయి, థెస్సలొనీక, తిమోతి, తీతు ఫిలేమోను పత్రికలలో నున్న పరిశుద్ధాత్ముని పరిచర్యలు

పై గ్రంథములలోనున్న పరిశుద్ధాత్ముని ప్రస్తావన గల వాక్యములు ఒక వరుసలో క్రింద వ్రాయబడినవి.

**1. మా సువార్త మాటతో మాత్రము కాక, శక్తితోను పరిశుద్ధాత్మ తోను సంపూర్ణ నిశ్చయతతోను మీ యొద్దకు వచ్చినది. 1 థెస్స 1:5** : సువార్త ప్రకటించు వారికి ఇది ఒక హెచ్చరికగానున్నది.

సువార్త ప్రకటన పరిశుద్ధాత్మతో జరిగించినపుడు దానికి ముందు శక్తి, తరువాత సంపూర్ణ నిశ్చయత ఉండును. శక్తివంతమైన సువార్త ప్రకటన ఈ దినములలో ఎంతో అవసరము. సువార్త ప్రకటన పరిశుద్ధాత్మతో జరగాలి. అది లేని కారణమున ఎన్ని మీటింగులు జరిగినను ఫలితము కనిపించుటలేదు.

**2. పరిశుద్ధాత్మను అనుగ్రహించు దేవుడు. 1 థెస్స. 4:8** : ఎఫెసీ 1:13లో మీరును సత్యవాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మతో ముద్రించబడితిరి అని ఉన్నది. రక్షణ సువార్తను విని విశ్వసించినపుడు ఆత్మచేత ముద్ర అనగా ఆత్మ అనుగ్రహించబడుట జరుగును. ఇవన్నియు రక్షణ కార్యములోనే ఇమిడి యున్నవని ముందుగా చూచితిమి. 2 తిమోతి 1:14లో నున్నట్లు మనలో నివసించు పరిశుద్ధాత్మ, ఎఫెసీ. 4:30లోనున్నట్లు విమోచన దినము వరకు ముద్రించబడితిరి, అను మాటలను బట్టి పరిశుద్ధాత్మ సదాకాలము మనతో నుండును.

**3. పరిశుద్ధాత్మ వలన కలుగు ఆనందముతోను 1 థెస్స. 1:6** : సువార్త ప్రకటన పరిశుద్ధాత్మతో జరిగినది. రక్షణ కార్యము ఆత్మ ముద్ర ద్వారా ముగించబడినది. పరిశుద్ధాత్మ ఆ వ్యక్తికి ఆనందమునిచ్చాడు. గలతీ. 5:22లో చెప్పబడిన 9 గుణములు గల ఆత్మ ఫలములో రెండవ గుణముగు సంతోషమే ఆనందము. ఆ ఆనందము పరిశుద్ధాత్మ వలన కలుగును. ఆత్మ యందలి ప్రేమను మాకు తెలిపిన వాడు (కొలస్స. 1:8) ఆత్మఫలములోని మొదటి గుణము ప్రేమయే. ఆత్మ కార్యములో ప్రేమ ఉండును.

**4. పరిశుద్ధాత్మ నూతన స్వభావమును కలుగజేయును. తీతు. 3:5** : రక్షించబడిన వారు నూతన స్వభావము కలవారైయుందురు. కాగా ఎవడైనను క్రీస్తునందున్న ఎడలవాడు నూతన సృష్టి, పాతవి గతించెను. ఇదిగో క్రొత్తవాయెను. (2 కొరింథీ. 5:17). పాత స్వభావము, అలవాట్లు, ఉద్దేశములు పోయి నూతన స్వభావము, అలవాట్లు ఉద్దేశములు కలవారుగా రక్షింపబడిన వారుగా నుందురు.

2 థెస్స 2:13లో ఆత్మ మిమ్మును పరిశుద్ధ పరచుట వలన అని వ్రాయబడినది. పరిశుద్ధ ఆత్మ మన పాపముల నుండి మనలను పరిశుద్ధ పరచుటయే కాక, నూతనస్వభావ మిచ్చుట ద్వారా పరిశుద్ధ జీవితము జీవించుటకు సహాయము చేయును.

1 తిమోతి 3:16లో ఆత్మ వలన నీతి పరుడని తీర్పు పొందెను అని వ్రాయబడినట్లు పరిశుద్ధాత్మ మనలను తీర్పు తీర్చువాడు. మన జీవితములోని విషయాలలో పరిశుద్ధ ఆత్మ తన తీర్పులను చెప్పుచుండును. పరిశుద్ధాత్మని మెల్లని స్వరమును మనమెప్పుడు వినుచూనుండాలి. విధేయత చూపాలి.

**5. ఆత్మయందు ఏ సహవాసమైన ఉన్న ఎడల ఫిలిప్పీ. 2:1** : ఆత్మ యందలి సహవాసములో, అనగా సహోదరులందరితో కలిసి సహవాసము చేయుచూ ఐక్యతను కాపాడుకోవాలి. అందరు ఐక్యముగా నున్నపుడు ఆత్మ సంబంధమైన పద్యములతో ఒకరి ద్వారా ఒకరికి హెచ్చరిక కలుగును. (కొలస్సయి 3:16) అందులకే పరిశుద్ధులకు సహవాసము ఎంతో అవసరమైనది.

**6. యేసు యొక్క ఆత్మ నాకు సమృద్ధిగా కలుగునట్లు. ఫిలిప్పీ. 1:20** : తీతు 3:7 లో నిత్య జీవమునకు వారసులమగునట్లు ఆ ఆత్మ మనకు సమృద్ధిగా కుమ్మరించెను అని ఉన్నది. ఆత్మ ముద్ర మనము రక్షించబడినప్పుడు మనకు వేయబడినది. (ఎఫెసీ. 1:13) విమోచన దినము వరకు ఆత్మముద్ర కలిగియుండుము. (ఎఫెసీ. 4:30). కాని ఆత్మ సమృద్ధిగా కలుగునట్లు అను మాటలో ఆత్మ మనలో ఎల్లకాలము ఉన్ననూ సమృద్ధిగా కలుగునట్లు అనగా ఆత్మ నింపుదల నిత్యము జరుగుచుండాలి అని అర్థము.

పరిశుద్ధాత్మునికి మనలను మనము అప్పగించుకొనాలి. ఆయన చేత నిత్యము నింపబడాలి. పరిశుద్ధాత్మ అను గ్రహించబడుట ఒక అనుభవము కాగా, ఆత్మచేత నింపబడుట రెండవ అనుభవముగానున్నది. ఆత్మను ఆర్పకుడి అని 1 థెస్స 5:19లో నున్నది. పరిశుద్ధాత్మ మనలోనుండి మనలను హెచ్చరించుచుండగా లోబడక నిర్లక్ష్యముగా నున్న ఎడల ఆత్మ యొక్క హెచ్చరిక ఆగిపోవును. ఎఫెసీ 4:30 ప్రకారము ఆత్మ దుఃఖపడుచు విమోచనదినము వరకు మనలో ఉండునని గుర్తించుదుము గాక!

**7. ఆత్మ వలన ఆరాధించుట. ఫిలిప్పీ. 3:3 :** రక్షించబడి బాప్తీస్మము పొందిన ప్రతి విశ్వాసి అపొ 2:42 ప్రకారము రొట్టె విరుచుటలో ఎడతెగక ఉండాలి. ఆదివారము రొట్టె విరుచుటకు కూడు కొనుట (అపొ 20:6) ఆయనకు ఆరాధించుటయే. ఆదివారము రొట్టె విరుచు నపుడు మాత్రమే కాక నిత్యము ఆయనను ఆరాధించు వారముగా నుండాలి. క్రీస్తు ఏమైయున్నాడో ఆయన గొప్పతనము, కార్యములు అన్నిటిని జ్ఞాపకము చేసికొని ఆయనను స్తుతించుట ఆరాధన. అనేక పర్యాయము ఆరాధన శరీరము తోను పెదవులతో మాత్రమే ఉండుటను సంఘములలో మనము గమనింతుము. ఆయన ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని యోహాను 4:24లో ఉన్నది. ఆరాధన మనలోనున్న పరిశుద్ధ ఆత్మవలన జరగాలి.

**8. కడవరి దినముల యందు మోసపరచు ఆత్మలయందు లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు. ( 1 తిమోతి 4:1 ) :** పరిశుద్ధాత్మ కార్యములు చేయుచుండగా మోసపరచు ఆత్మలును సెలవిచ్చుట, మోసపు కార్యములు చేయుట జరుగును. రెండవ థెస్స 2:1లో ప్రభువు దినము ఇప్పుడే వచ్చినదని ఆత్మ ద్వారా సెలవిచ్చుచున్నామను వారుందు రని వ్రాయబడినది. పరిశుద్ధాత్మ కార్యములు చేయుచుండగా, మోసపరచు ఆత్మ, భ్రమపరచు ఆత్మ, క్రీస్తు విరోధి ఆత్మ సెలవిచ్చుట, కార్యములు చేయుట కడవరి దినములలో నుండును. కనుక ప్రతి ఆత్మను నమ్మకుడి అని మొదటి యోహాను పత్రిక 4:1లో ఉన్నది. వీటి వివరములు యోహాను పత్రికలలో పరిశుద్ధాత్ముని పరిచర్యలలో వివరించబడినవి. జాగ్రత్తగానుందుము గాక!

# హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో పరిశుద్ధాత్ముని పరిచర్యలు

ఆత్మ ప్రస్తావన 3:4లో మొదటిసారి కనిపిస్తుంది. 3:7లో 2వసారి, 6:4లో 3వ సారి, 9:8లో 4వసారి, 9:14లో 5వ సారి, 10:15లో 6వ సారి, 10:29లో 7వ సారి, 10:38లో 8వ సారి ఆత్మను గురించి వ్రాయబడింది. 10:39, 12:23లో మన ఆత్మగూర్చి ఉంది. పరిశుద్ధాత్ముని గూర్చి కాదు. పరిశుద్ధాత్ముని గూర్చి 8 పర్యాయాలు ఉంది. ధ్యానిద్దాము. గ్రంథంలోని వరుసగాక వేరొక వరుసలో ధ్యానిద్దాము.

10:29లో కృపకు మూలమగు ఆత్మ కనిపిస్తాడు. పరిశుద్ధాత్మ దేవుడు కృపకు మూలమైనవాడు. కృప దేవునికే చెల్లుతుంది. మానవుల యొద్ద ఎటువంటి కృపలేదు. కృప కలిగిన వారు ఎవరూ లేరు. కృపను మానవుడు కనబరచలేడు. ఒకవేళ అంతో ఇంతో కృపకనబరచినా అది సంపూర్ణమైన కృపకాదు.

కృపకు మూలమగు వాడు అనగా మనపట్ల కృపను కనపరిచేవాడు అని అర్థము. తీతు 2:11లో దేవుని కృప ప్రత్యక్షమైనది అని ఉంది. కృపకు మూలమగు ఆత్మ ఈలోకానికి రాకమునుపే దేవుని కృప ప్రత్యక్షమైంది. యేసుక్రీస్తు పేరుతో దేవుని కృప ప్రత్యక్షమైనది (యోహాను 1:14, 16, 17).

యేసుక్రీస్తు ద్వారా కృప వెంబడి కృప కలిగింది. ఆయన దేవుడు అని ఋజువు పరచుకున్నాడు. 33 1/2 ఏండ్లు తాను దేవుడని లోకానికి ఋజువు పరచుకున్న తరువాత కలువరి శిలువలో ప్రాణం పెట్టాడు. పరలోకానికి వెళ్ళాడు. ఆయన వెళ్ళిన తరువాత ఆయన చూపిన కృపకు మూలమగు పరిశుద్ధాత్మ దేవుడు లోకానికి వచ్చాడు.

కృపకు మూలమగు ఆత్మను తిరస్కరింపరాదు. మనుష్యులు పరిశుద్ధాత్మను తిరస్కరింపగలరా? అవును తిరస్కరింపగలరు అని 10:29 చెబుతున్నది. ఎఫెసీ 4:30 పరిశుద్ధాత్మను దుఃఖపరచగలము. అలాగే పరిశుద్ధాత్మను తిరస్కరింపగలరు. ఆత్మను

తిరస్కరించుట వలన ఏమౌతుంది? దేవుని కుమారుని పాదములతో త్రొక్కినట్లు పవిత్రమైన రక్తాన్ని అపవిత్రముగా ఎంచినట్లు.

యేసుక్రీస్తు పవిత్రుడు. ఆయన అపవిత్రుడు అని గడిచిన 2004 ఏండ్లలో ఎవరూ చెప్పలేకపోయారు. ఏ మతము వారైనా, ఏ జాతివారైనా ఆయన పవిత్రుడు అంటున్నారు. ఆయన పుట్టుక పరిశుద్ధమైనది. మనపుట్టుక పాపసంబంధమైనది. 51 కీర్తనలో దావీదు నేను పాపంలోనే పుట్టాను అంటున్నాడు. మనము కూడా పాపంలోనే పుట్టుచున్నాము, పెరుగుచున్నాము. పరిశుద్ధాత్మ వలన మరియమ్మ గర్భందాల్చింది. ఆయన పుట్టుక పవిత్రం 33 1/2 సంవత్సరాలు జీవించాడు. ఆయన జీవితం పవిత్రమైనది. నాలో పాపము ఉన్నదని మీలో ఎవరు స్థాపిస్తాడు అని అన్నాడు. ఎవరూ నోరెత్తలేకపోయారు. వ్యభిచారమందు పట్టబడిన స్త్రీని రాళ్ళతో కొట్టి చంపడానికి కొందరు వచ్చారు. మీలో పాపం లేనివాడు మొదటురాయి వేయమన్నాడు ప్రభువు. అందరూ వెళ్ళిపోయారు. పాపం లేనివారు ఎవరూ లేరు.

స్నేహితులు కలుసుకున్నపుడు నీవేంచేస్తున్నావు అని అడుగుతారు. నేను టీచరుగా పనిచేస్తున్నాను, లాయరుగా పనిచేస్తున్నాను, ఇంజనీరుగా పనిచేస్తున్నాను అంటారు. యేసుప్రభువు మనలని కలిస్తే నీవు ఏమిచేస్తున్నావో నాకు అవసరం లేదు గానీ మీరందరు పాపం చేస్తున్నారు అంటాడు. ప్రపంచచరిత్రలో పాపంలేని వాడు యేసుక్రీస్తు మాత్రమే.

ఆత్మను తిరస్కరిస్తే అలాంటి పరిశుద్ధుని నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచినట్లు ఆయనను పాదములతో త్రొక్కినట్లు, అని వ్రాయబడినది. ఒక భక్తుడు మనము ఆయన పాదధూళితో కూడా సమానం కాము అన్నాడు. ఇంకొక భక్తుడు ఆయన పాదాలకు కోటిమైళ్ళ దూరంలో ఉన్న ధూళితో కూడా సమానము కాము అన్నాడు. పరలోకంలోని దూతలు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని చెప్పుచున్నారు. ఆయన ఎంత పరిశుద్ధుడో, వివరించుటకు మానవ భాష చాలదు. ఆయనకు కోటిమైళ్ళ దూరంలో ఉండుటకే అర్హులమవుతాము. కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించిన

వాడు అలాంటి వ్యక్తిని పాదములతో త్రొక్కినట్లే! అని బైబిలు అంటుంది. ఆ దేవుని ఆత్మ నిన్ను ఒప్పిస్తుండగా యేసును నమ్మక తిరస్కరిస్తావా?

మనము బైబిలును చేత పట్టుకుంటాము, సంచిలో పెట్టుకుంటాము, తలక్రింద పెట్టుకుంటాము. కాళ్ళక్రింద పెట్టుకునేవారు ఉన్నారా? అలాగే కొద్దిమంది పత్రికలు ఇచ్చినపుడు కళ్ళకు అద్దుకొని తీసుకుంటారు. బైబిలును, పత్రికలను కళ్ళకు అద్దుకున్నా కృపకు మూలమగు ఆత్మను తిరస్కరిస్తే, దేవుని కుమారుని పాదములతో త్రొక్కినట్లే. కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించడము అంటే ఆయన నీ పాపపరిహారానికి కలువరిగిరిలో జరిగించిన కృపాకార్యాన్ని ఒప్పుకోకపోవడమే అని. ఆయన ద్వారా నీకు మోక్షము వస్తుందని అంటే నమ్మకపోవడమే కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించడము.

యేసును నమ్మకపోతే ఆయనను పాదాలతో తొక్కుచున్నట్లు. సౌలు దమస్కుమార్గమున వెళ్ళుచున్నపుడు సౌలా సౌలా నీవెందుకు నన్ను హింసించుచున్నావు అని ఒక స్వరము వినబడింది. నన్నెందుకు హింసించుచున్నావు అన్నమాట సౌలుకు అర్థము కాలేదు. సౌలుకు యెహోవాయందు ఎంత భక్తి వున్నా యేసుక్రీస్తును నమ్ముకొనకపోతే యేసును హింసిస్తున్నట్లు లెక్క.

బైబిలును ఎంత జాగ్రత్తగా పట్టుకున్నా క్రీస్తును గొప్పవాడు అని ఎంచినా క్రీస్తును నమ్ముకొనకపోతే ఆయనను హింసిస్తున్నట్లు. ఎవరైనా బైబిలును కాళ్ళక్రింద ఉంచి త్రొక్కితే ప్రక్కన వున్న వారు బుద్ధిచెబుతారు. అలాగైతే క్రీస్తుప్రభువునే కాళ్ళక్రింద ఉంచి త్రొక్కితే మరి దండన ఉండదా? కృపకు మూలమగు ఆత్మను తిరస్కరిస్తే దండన తప్పదు. లోబడితే తన ఆత్మ ద్వారా కడిగి పరిశుద్ధునిగా, నీతిమంతునిగా చేస్తాడు. పరిశుద్ధుడు నీతిమంతుడు అనే మాటలు కొంచెము ఆలోచిద్దాము.

మత్తయి ప్రభువును నమ్మక మునుపు పన్నులు వసూలుచేసేవాడు. పన్నులు వసూలుచేసేవారు చాలా కఠినముగా వ్యవహరిస్తారు. ఒకసారి నేను ఒక ఊరు వెళ్ళుచున్నాను. అక్కడ కూరగాయలు ఒకాయన అమ్ముకుంటున్నాడు. పన్ను వసూలు

చేసే ఆయన వచ్చి పన్నుకట్టమన్నాడు. అయ్యో ఇంకా అమ్మలేదు. కొద్దిసేపు ఉండి కట్టుతాను అన్నాడు. ముందు గంప క్రిందికి దించి అక్కడ పెట్టు అన్నాడు. నాకు చాలా బాధ వేసింది. నేనే పన్ను డబ్బు ఇచ్చి పంపిద్దాము అనుకున్నాను.

పన్నులు వసూలు చేసేవారు ఇంత కఠినంగా వసూలుచేయకపోతే పన్నులు వసూలుకావు. కాబట్టి కఠినంగా ఉంటారు. కఠినంగా ఉన్నా పరవాలేదు. కాని దానిలో అంతో ఇంతో మిగిలించుకుంటూ వుంటారు. సరియైన చిల్లర వెనక్కి ఇవ్వరు. డబ్బు విషయంలో ప్రతి డిపార్టుమెంటులో లోటుపాట్లు ఉన్నాయి. సుంకము వసూలు చేసేవారిలో చాలా లోటుపాట్లు ఉన్నాయి. ఆ దినాలలో సుంకము వసూలు చేసేవారిని చాలా పాపులుగా లెక్కించారు. మత్తయిలో కూడా ఇలాంటి లోటుపాట్లు ఎన్నో వున్నాయి. ఎంతోమందిని కష్టపెట్టాడు. తప్పుడు లెక్కలు చూపాడు.

ఇలాంటి మత్తయిని పిలిచి యేసుప్రభువు తన్ను వెంబడించమన్నాడు. సువార్త వ్రాయమన్నాడు. మత్తయి ఆశ్చర్యపోయాడు. లోకంలో అందరు నన్ను పాపి, సుంకరి అంటారు. నేను నిన్ను వెంబడించడము సువార్త వ్రాయడమా అని అనికొనివుంటాడు. సువార్త వ్రాయబడింది పరిశుద్ధుడయిన మత్తయి వ్రాసిన సువార్త అని పేరు పెట్టబడినది. ఇదంతా బైబిలులో లేదు కాని ఒక భావన. పరిశుద్ధుని గూర్చిన సువార్త అని పేరు పెట్టి ఉంటే బాగుండేది. కాని పరిశుద్ధుడైన మత్తయి వ్రాసిన సువార్త అని పేరు పెట్టబడినది.

ఈ సువార్తను తీసుకొని మత్తయిని సుంకము వసూలు చేసిన చోటికి వెళదాము రమ్మనండి. ఇంకొకాయన ఇపుడు సుంకం వసూలు చేస్తున్నాడు. సుంకం చెల్లించేవారు వరుసగా నిలబడి వున్నారు. వారికి ఈ మత్తయిని సువార్త ఇవ్వమని చెప్పండి. పుస్తకముపై పరిశుద్ధుడైన మత్తయి వ్రాసిన సువార్త అని ఉంది. అది చూసి వారు మత్తయిని పై నుండి క్రిందకు చూశారు. ఏమయ్యా అర్ధరూపాయి ఇస్తే పావలా అని రసీదు ఇచ్చావు. నీవు ఎలా పరిశుద్ధుడవు అని అడగాలనుకున్నారు. కొంతమంది భయపడి అడగలేదు. కొందరు మనస్సులో అనుకున్నారు. కొందరు ధైర్యవంతులు అడిగారు. యేసుప్రభువు నన్ను పరిశుద్ధునిగా చేశాడు అంటాడు మత్తయి.

నీ వంటి పాపి పరిశుద్ధుడు కావడమేమిటి నేను నమ్మను అని ఎవరైనా అంటే యేసు ప్రభువు ఊరుకుంటాడా? లేదు అతను పరిశుద్ధుడు అని యేసు అంటారు. నా దగ్గర డబ్బు ఎక్కువ తీసుకున్నాడు. మోసగాడు అని కొందరు అన్నారు అనుకోండి. ప్రభువు మీరు చెప్పేవన్నీ నిజమే. ఇతడు మోసగాడే, కాని ఇతని పాపములు క్షమించి పరిశుద్ధునిగా నేనే తీర్చాను. నా జీవిత చరిత్ర వ్రాసే భాగ్యము ఇచ్చాను అంటాడు. ఎంత విచిత్రమైన దేవుడో చూడండి. ఆయన పాపిని ఎంతగా ప్రేమిస్తాడో చూడండి. పైగా నీతిమంతునిగా తీర్పుతాడు. తన చరిత్ర వ్రాయడానికి వాడుకుంటాడు.

ఇప్పుడు ఈ మత్తయిని తీసుకొని కోర్టులో నిలువబెట్టండి. మత్తయి చేత మోసపోయిన వారందరు నేరాలు మోపుతారు. అపుడు జడ్జిగారు నిజమేనా అంటే మత్తయి అవును అని జవాబు ఇస్తాడు. అపుడు జడ్జిగారు ఈయనను దోషిగా ప్రకటిస్తాడు. కానీ యేసుక్రీస్తు, ఈయనను నీతిమంతునిగా తీర్పు తీర్చనంటాడు. అదే విచిత్రము.

ఒకసారి జైలు డిపార్టుమెంటు సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్నాను. ఆఫీసు వారు సూపరింటెండెంట్‌తో సార్ ఖైదీలు విడుదలకై కనిపెట్టుచున్నారు అని అటెండర్ చెప్పాడు. వాళ్ళను పంపించి వస్తాను తర్వాత మాట్లాడుకుందాం అని సూపరింటెంట్ గారు వెళ్ళారు. ఒక్కొక్కరు బయటకి వస్తున్నారు. సారాయి కాచేవాడివి నీవేనా? అని అడిగాడు. అవును సార్ అన్నాడతడు. సరే నీకు జడ్జిగారు విడుదల ప్రకటించాడుఅని సూపరింటెండెంటు చెప్పారు. నాకు అనిపించిది. విడుదల చేసేటపుడు కూడా నీవు నేరస్తుడవు అని జడ్జిగారు ప్రకటించారు. కాని ప్రభువు మనకు విడుదల ప్రకటించినపుడు నీవునీతిమంతుడవు అని తీర్పు తీర్చేశాడు. ఈ జడ్జిగారు విడుదల ప్రకటించిన మాట వాస్తవమే. అయితేనేరస్తుడు అని తీర్పు తీర్చాడు. సూపరింటెండెంట్‌గారు అడిగినపుడు నేను నేరస్తుడనే అంటూ అతను వెళ్ళిపోవుచున్నాడు.

ఇపుడు త్రాగినా ప్రభుత్వం పట్టించుకోదు. ఒకప్పుడు త్రాగుట నేరం. ఈ ప్రభుత్వ చట్టాలు మారుతూ వుంటాయి. కాని ప్రభువు చట్టాలు ఎన్నడూ మారవు. త్రాగుబోతు లైనను, దూషకులైనను, దోచుకొనువారైనను, దేవుని రాజ్యంలో ప్రవేశించరు. ఈ

వాక్యము వ్రాయబడి 2000 ఏండ్లు అయింది. అయినా దేవుని వాక్యం మారలేదు. మారదు.

1వ కొరింథీ. 6:11లో మీరు కొందరు అట్టివారై ఉంటిరి. అంటే ఒకప్పుడు దేవుని రాజ్యానికి వారసులు కానివారై ఉంటిరి అని అర్థము. అయినా యేసురక్తంలో ఆత్మ ద్వారా కడుగబడ్డారు. యేసుప్రభువుకు ఎవరు కావాలి. పాపులే. నేను పాపులను పిలువవచ్చితిని గానీ, నీతిమంతులను పిలువరాలేదు అన్నాడు (మత్తయి 9:13). ఈయన పాపియైన మనుష్యుని యొద్ద బసచేయుటకు వెళ్ళాడు. జక్కయ్యను గూర్చి లూకా సువార్తలో వ్రాయబడింది. మారుమనస్సు పొందునట్లు పాపులను పిలువవచ్చితిని అంటున్నాడు. వారు పాపులు కావున దేవుని రాజ్యానికి వారసులు కారు. కాని వారిని కడిగి పరిశుద్ధపరచి నీతిమంతులుగా తీర్చుటకు వచ్చాను అంటున్నాడు. మైల పూసుకున్న చిన్నబిడ్డను తల్లి మాత్రమే కడుగగలదు. కడిగి శుభ్రము చేసి అలంకరించినపుడు ఎవరికైనా ఎంత ముద్దొస్తాడో తెలియనిది కాదు. అలాగే ప్రభువు అన్యులను కడిగి రమ్యముగా మార్చగలడు.

దొంగతనాలు, తప్పిదాలు చేసి జైలుకెళ్ళి శిక్ష అనుభవించి విడుదలైన వారు రోడ్డు మీద పోతూ ఉంటే వారిని దొంగలు గానే, తప్పుడు వారిగానే లెక్కిస్తాము. దేవుడు దొంగలను, తప్పుడు వారిని విమోచింపబడిన తరువాత నీతిమంతునిగానే లెక్కిస్తాడు. ఇట్టి కృపకు మూలమగు దేవుని ఆత్మను తిరస్కరించువాడు అనగా దేవుని ఆత్మ చెప్పుమాటలను వినకుండా తృణీకరించువాడు యేసుక్రీస్తును పాదాలతో త్రొక్కినట్లు అవుతుంది. ఆయన కల్వరిలో కార్చిన అమూల్యమైన రక్తాన్ని అపవిత్రముగా ఎంచినట్లు అవుతుంది. మరి ఇలాంటి వారు దండనకు పాత్రులు.

హెబ్రీ 10:15లో పరిశుద్ధాత్మ సాక్ష్యమిచ్చువాడు అని చదువుచున్నాము. ఏ విషయమై సాక్ష్యము? ప్రభువు అర్పించిన సదాకాలము నిలుచు ఒకే బలిని గూర్చి, సదాకాలము మనకు అనుగ్రహించిన సంపూర్ణతను గూర్చి, మన పాపములను, అతిక్రమములను జ్ఞాపకము చేసికొనని ఆయన ప్రేమను గూర్చి సాక్ష్యమిస్తున్నాడు. హెబ్రీ

పత్రిక యొక్క 1-2 అధ్యాయాలు శ్రేష్ఠమైన ఆధిపత్యము 3-4 అధ్యాయాలలో శ్రేష్ఠమైన నాయకత్వమును 5-7 అ. శ్రేష్ఠమైన యాజకత్వాన్ని గూర్చి 8-10 అ. శ్రేష్ఠమైన సేవకత్వాన్ని గూర్చి 11-13 అ. శ్రేష్ఠమైన కర్తవ్యాన్ని గూర్చి వ్రాయబడింది.

హెబ్రీ 3-4 అధ్యాయాలు శ్రేష్ఠమైన క్రీస్తు నాయకత్వము కనిపిస్తుంది. 3 అధ్యాయములో మోషే కనిపిస్తాడు. మోషే ఐగుప్తు నాయకత్వానికి చెందినవాడు. క్రీస్తు రాజ్యము కొరకై మోషే ఐగుప్తు రాజరికాన్ని త్యజించాడు. క్రీస్తు గుడారంలో పరిచారకుడయ్యాడు.

హెబ్రీ.1-4 అ.లో యేసుక్రీస్తు శ్రేష్ఠమైన రాజు, 5-7 అ.లో శ్రేష్ఠమైన యాజకుడు 8-10 అ. శ్రేష్ఠమైన సేవకులు 11-13 శ్రేష్ఠమైన కర్త 11 అ.లో శ్రేష్ఠమైన విశ్వాసానికి కర్త 12 అ.లో శ్రేష్ఠమైన నిరీక్షణకు కర్త 13 అ.లో శ్రేష్ఠమైన ప్రేమకుకర్త. యాజకత్వమును గురించి మాట్లాడుతూ 10:11లో ప్రతి యాజకుడు పాపములను ఎన్నటికి తీసివేయలేని ఆ బలులనే మాటిమాటికి అర్పిస్తున్నాడు. ఈయనయితే పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒకే బలిని అర్పించి మనలను సదాకాలమునకు సంపూర్ణులుగా చేశాడు. ఇద్దరు స్నేహితులు కలుసుకున్నారు. మా అబ్బాయి మాటిమాటికి పరీక్షలు వ్రాస్తున్నాడు. మార్చికి వ్రాస్తున్నాడు సెప్టెంబరుకు వ్రాస్తున్నాడు అన్నాడు. ఇంకొక వ్యక్తి మా అబ్బాయి ఒకసారి వ్రాశాడు అన్నాడు. దీని అర్థము ఏమి? మాటిమాటికి పరీక్ష వ్రాసినవాడు ఫెయిల్ అవుతున్నాడని ఒకసారి వ్రాసినవాడు ఉత్తీర్ణుడయ్యాడని, అలాగే యాజకులు మాటిమాటికి బలులను అర్పిస్తున్నా సంపూర్ణ సిద్ధికలుగలేదు. ఈయన అయితే పాపము నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక బలి అర్పించాడు. ఒక అర్పణ చేత ఈయన పరిశుద్ధపరచబడువారిని సదాకాలం సంపూర్ణులుగా చేశాడు.

2003లో ఒకవేళ సంపూర్ణునిగా నేను జీవించినా 2005లో ఎలా వుంటానో తెలియదు. కానీ ప్రభువు సదాకాలము నన్ను సంపూర్ణునిగా చేశాడు. ఈ విషయాల గురించి పరిశుద్ధాత్ముడు సాక్ష్యమిస్తున్నాడు.

మన జీవితాలు ఎలా ఉన్నా మనలను సంపూర్ణులనుగా చేశాడు. మనము ప్రేమించేవాళ్ళు మనకు భారముగా కనబడరు. మనము ప్రేమించని వాళ్ళు చిన్న విషయంలో కూడా ఎంతో భారంగా కనబడలారు. మనలను సదాకాలము సంపూర్ణులనుగా చేశాడు. అంటే ఆయన మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడో అర్థము చేసుకోవాలి.

ఈ విషయమై, పరిశుద్ధాత్ముడు సాక్ష్యమిచ్చుచున్నడు. హెబ్రీ. **10:17** వారి పాపములను వారి అతిక్రమములను ఇకను ఎన్నటికి జ్ఞాపకము చేసికొనను అంటున్నాడు. మన పాపములు అతిక్రమములు ఆయన ఎన్నటికి జ్ఞాపకము చేసికొనడు. ఒకసారి సాదు సుందర్‌సింగు గారు దేవునికి అసాధ్యమైనది లేదు అని ప్రసంగము చేస్తున్నాడట. అసాధ్యమైనది ఉంది అని ఒక చిన్న బిడ్డ అంది. ఏమిటమ్మా అని అడిగాడు. నేను చేసిన పాపము మరల ఆయన జ్ఞాపకం చేసుకోలేడు అంది. సుందర్‌సింగ్ గారు ఆ అమ్మాయిని అభినందించాడు. ఆయనకు సమస్తము సాధ్యమైన మన పాపములను జ్ఞాపకం చేసికొనడు. మరి ఎన్నడు పాపమునకు భయపడనక్కరలేదు.

హెబ్రీ. **10:18** వీటి (పాపముల) క్షమాపణ ఎక్కడ కలుగునో అక్కడ పాపపరిహారార్థ బలి ఇకను ఎన్నడు ఉండదు. కాబట్టి ప్రభువు అర్పించుకున్న ఒక్క బలి చాలు. ఇక ఏ బలులు అవసరంలేదు. ఇది పరిశుద్ధాత్మ ఇస్తున్న సాక్ష్యం. నమ్మిన మన హృదయాలకు పరిశుద్ధాత్మ ఇచ్చిన సాక్ష్యం ఎంత ఆదరణ కలిగిస్తుందో చూడండి. ఒకడు ప్రభువును నమ్మాడు. కొంత కాలం బాగా జీవించాడు. పడిపోయాడు. అతను తిరిగి రక్షణ పొందవలసిన పనిలేదు. ఒకసారి స్నానం చేసినవాడు పాదములు మాత్రం కడుగుకుంటే సరి (యోహాను **13:10**) రక్షణ ద్వారా కలిగే కార్యము ఇంతగొప్పది. నీవు ఎవరివైనా కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించక. ఆయనను అంగీకరిస్తే, నీ పాపములు జ్ఞాపకానికిరావు. యేసు సిలువ బలి తప్ప ఎటువంటి బలులు అవసరము లేదని పరిశుద్ధాత్ముడు సాక్ష్యమిస్తున్నాడు.

హెబ్రీ 3:7-11లో పరిశుద్ధాత్మ ఇశ్రాయేలీయుల హృదయ కాఠిన్యతను గురించి చెప్పుచున్నాడు. ఇశ్రాయేలీయులు ఐగుప్తులో ఉన్నారు. ఐగుప్తు లోకానికి, పాపానికి సూచన. గొర్రెపిల్ల రక్తం ద్వారా విమోచింపబడ్డారు. ఇది మనము పొందిన రక్షణకు సాదృశ్యం. ఎర్రసముద్రాన్ని దాటినారు. ఇది మనము పొందిన బాప్తిస్మానికి సాదృశ్యం. 40 ఏండ్లు అరణ్య ప్రయాణం మన ఆత్మీయ యాత్రకు పోలిక. ఆ యాత్రలో హృదయాలు కఠినపరచుకున్నారు. ఆయనను నమ్మినవారి పాపాలు క్షమించబడినను వారు హృదయాలను కఠినపరచుకున్నారు. మన హృదయాలు మెత్తనివి. కొందరికి ఆయన వాక్యము, హెచ్చరికలు గుచ్చుకుంటాయి. హృదయం కఠినమైపోతుంది. కఠినమైన హృదయంపై రాయి వేస్తే అది ఎగిరి ప్రక్కవారి మీద పడుతుంది. చాలామంది హృదయాలు ఇలానే వుంటాయి. ఎవరైనా మనలను హెచ్చరించినా ఆ మాటను వారికే చెప్పి పంపిస్తూ ఉంటాము. కాని ఆయన వాక్యము, హెచ్చరికలు విన్నపుడు కొందరి హృదయాలు ఇంకా మెత్తన చేయబడుతాయి. ప్రభువులో చక్కగా ఎదుగుతారు.

దేవుడు ఇశ్రాయేలీయులను మోషే ద్వారా 40 సంవత్సరాలు హెచ్చరించాడు. వారు హృదయాలు కఠినపరచుకున్నారు. వారికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను. (1 కొరింథీ. 10:11) కాబట్టి మనము హృదయాలను కఠినపరచుకొనక మెత్తనిదిగా ఉంచుకుందాము. హృదయాలలో దేవుని కార్యము జరుగనిద్దాము. ఆత్మీయముగా ముందుకు సాగుదాము.

హెబ్రీ 10:38 నా ఎదుట నీతిమంతుడైనవాడు విశ్వాసమూలముగా జీవించును. గాని అతడు వెనుకకు తీసిన యెడల అతని యందు నా ఆత్మకు సంతోషముండదు. వెనుకకు వస్తే ఆయన ఆత్మకు సంతోషము ఉండదు. దుఃఖపడుతాడు. ఎఫెసీ 4:30లో దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి అంటున్నాడు. ఆత్మీయ యాత్ర వెనుకకు తిరుగకూడని యాత్ర. నాగటి మీద చేయి పెట్టి వెనుకకు తిరుగకూడదు. కొద్దిమంది తిరుగుతారు. విశ్వాసయాత్రలో ప్రవేసిస్తారు. నాలుగు ఏండ్లకు కొందరు వెనుకకు

తిరుగుతారు. 40 ఏండ్లకు కొందరు వెనుకకు తిరుగుతారు. వెనుకకు తీస్తే ఆత్మకు సంతోషముండదు. ఏ ఆత్మ అయితే నిన్ను యేసు రక్తంలో కడిగి పవిత్రపరిచాడో, ఏ ఆత్మ అయితే నీతిమంతుడుగా తీర్చాడో, ఏ ఆత్మ అయితే నిన్ను పవిత్రపరచాడో, ఏ ఆత్మ అయితే సదాకాలానికి నిన్ను విమోచించాడో, ఏ ఆత్మ వీటన్నిటి విషయమై సాక్ష్యమిస్తున్నాడు. ఆ ఆత్మ నీలో ఉన్నాడు. ఆత్మీయ యాత్రలో వెనుకబడితే ఆయనకు సంతోషము ఉండదు.

వెనుకబడితే ఆయన సంతోషించడు మనము సంతోషించము. మనము ఆయనను సంతోషపెడదామా దుఃఖపెడదామా? తీర్మానం మనదే.

హెబ్రీ 6:4-6. ఒకసారి వెలిగింపబడి పరలోక సంబంధమైన వరమును రుచిచూచి పరిశుద్ధాత్మలో పాలివారై దేవుని దివ్య వాక్యమును రాబోవు యుగసంబంధమైన వ్యక్తుల ప్రభావమును అనుభవించిన తరువాత తప్పిపోయిన వారు తమ విషయములలో దేవుని కుమారుని మరచి సిలువ వేయుచు బాహాటముగా ఆయనకు అవమానపరచుచున్నారు. గనుక మారుమనస్సు పొందునట్లు అట్టివారిని మరల నూతనపరచుట అసాధ్యము.

తప్పిపోయిన వారి గురించి మాట్లాడుచున్నాడు. లూకా 15వ అధ్యాయములో తండ్రికి ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమారుడు తప్పిపోయాడు. దూరంగా పోయాడు. పెద్దకుమారు ఇంటిబయట ఉన్నాడు. ఇద్దరు తప్పిపోయారు. తండ్రికి సంతోషం లేదు. చిన్నవాడు పోయినపుడు దుఃఖము. తిరిగివచ్చినపుడు సంతోషం. అంతలో పెద్దవాడు బయటకి పోయాడు. పెద్దవాని ఇంట్లోకి రమ్మని తండ్రి బ్రతిమాలుతూ ఉన్నాడు. నాకు ఒక మేకపిల్లను కూడా ఇవ్వలేదే అంటున్నాడు పెద్దకుమారుడు. నావన్నియు నీవే అంటున్నాడు తండ్రి. పెద్దకుమారుడికి అర్థము కాలేదు. వెళ్ళిపోయాడు.

ప్రభువు మనకు ఎన్నో వాగ్దానాలు ఇచ్చాడు. నాకు చిన్న వాగ్దానమైనా ఇచ్చావా అన్నట్లు ఉంది. మనకు తెలియనివి అర్థము కానివి ఎన్నో ఇచ్చాడు అన్నిటిని అనుభవించమంటున్నాడు.

విమానం ఎక్కినప్పుడు ప్రయాణం చేసినంతసేపు భోజన వసతులు ఉంటాయి. టికెట్టుతోనే మొత్తం కట్టేస్తారు. కాని ఇది తెలియని ఒకవ్యక్తి ఇంటిదగ్గర నుండి రొట్టెలు తెచ్చుకున్నాడట. మొదట రోజు తిన్నాడు. రెండవ రోజు లేవు. ఆకలికి అల్లాడుతున్నాడు. ప్రక్కవారిని రొట్టెలు అడిగాడు. నీవు టికెట్టులోనే అన్నీ కట్టావు. నీవు సమృద్ధిగా భోంచేయవచ్చు అన్నాడు. ఇలాగే కొంతమంది దేవుని వాగ్దానాలన్ని నాకే అని గ్రహించరు. ఒకరోజు అనుసరంగా తన రొట్టెలు తిన్నందుకు అతను వాపోయాడు. తర్వాత సమృద్ధిగా తిన్నాడు.

పెద్దకుమారుడు మేకపిల్లను కూడా ఇవ్వలేదు అంటున్నాడు. అన్నీ అతనివే. అడిగితే తండ్రి కాదనేవాడు కాదు. దేవుని బిడ్డలమైన మనము కూడా దేవుని వాక్యం ద్వారా ఎన్నో ఆధిక్యతలు మనకు కూడా ఉన్నాయి. తెలుసుకోవాలి. వాటిని అనుభవించాలి. మనలను ఆత్మసంబంధమైన బలులను అర్పించే యాజకులనుగా చేశాడు. 1 పేతురు 2:4, 5. ఇది గొప్ప ఆధిక్యత. ఇటువంటి ఆధిక్యతలు ఎన్నో. చిన్నవాడు వచ్చాడు. పెద్దవాడు తప్పిపోయాడు. ఈ తండ్రికి ఎవరో ఒకరు తప్పిపోతూనే వున్నారు. తండ్రి ఇద్దరు కుమారులతో సంతోషించేది ఎప్పుడు?

★★★

# పేతురు వ్రాసిన రెండు పత్రికలు,యాకోబు పత్రికలలో పరిశుద్ధాత్ముని పరిచర్యలు

పేతురు మొదటి పత్రికలో 16 పర్యాయాలు, రెండవపత్రికలో ఒక పర్యాయము ఆత్మను గురించిన సంగతులు కనిపిస్తాయి. యాకోబు పత్రికలో ఆత్మను గూర్చిన ప్రస్తావన మూడు పర్యాయములు ఉన్నది.

1 పేతురు పత్రికలో అధ్యాయాలు 5. కాని 16 సార్లు ఆత్మను గురించి వ్రాయబడింది. అంటే ఇందులోని ఆత్మీయ సత్యాలు మనము ఎంతో జాగ్రత్తగా నేర్చుకోవాలి. కొన్నిసార్లు మీ ఆత్మ, నా ఆత్మ, మనుష్యాత్మ అనే మాటలు ఉన్నా ఇవన్నీపోతే 11 పర్యాయములు పరిశుద్ధాత్మను గూర్చి ప్రస్తావించబడినది. వీటిని 7 అంశాలుగా ఆలోచిద్దాము.

1. 1 పేతురు 1:1, 2 యేసుక్రీస్తు అపొస్తలుడైన పేతురు తండ్రియైన దేవుని భవిష్యత్ జ్ఞానమును బట్టి ఆత్మవలన పరిశుద్ధత పొందిన వారై విధేయులగుటకును ఏర్పరచబడిన వారికి అనగా పొంతు గలతీయ, కప్పదొకియ, ఆసియ, బితూనియ అను దేశముల యందు చెదరిన వారిలో చేరిన యాత్రికులకు శుభమని చెప్పి వ్రాయునది.

ఇందులో ఆత్మవలన పరిశుద్ధత పొందుటను గూర్చి వ్రాయబడినది. 8, 9 వచనాలలో మీరాయనను చూడకపోయినను ఆయనను ప్రేమించుచున్నారు. ఇప్పుడాయనను కన్నులారా చూడకయే విశ్వసించుచు, విశ్వాసమునకు ఫలము అనగా ఆత్మరక్షణను పొందుచు చెప్పనశక్యమును, మహిమాయుక్తమునైన సంతోషము గలవారై ఆనందించుచున్నారు అని చదువుచున్నాము. తర్వాత 3:18లో ఏలయనగా మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు, అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయములో చంపబడియు, ఆత్మవిషయములో బ్రదికింపబడి పాపము విషయములో ఒక్కసారే శ్రమపడెను.

ఈ మూడు మాటలు ఒకే తలంపు గలవి. మొదటి మాటలు ఆత్మవలన పరిశుద్ధత అనగా పరిశుద్ధాత్ముడు మనలను పరిశుద్ధత అనే అనుభవానికి నడిపిస్తున్నాడు. తండ్రియైన

దేవుడు, కుమారుడైన దేవుడు ఏమి చేస్తారు? ఆ ముగ్గురి ప్రస్తావన అక్కడ ఉంది. తండ్రియైన దేవుడు భవిష్యత్ జ్ఞానమును బట్టి ఏర్పరచుకున్నాడు. పరిశుద్ధాత్మ దేవుడు పరిశుద్ధపరుస్తున్నాడు. కుమారుడైన యేసుక్రీస్తు రక్తమును చిందించి ప్రోక్షించుచున్నాడు. ముగ్గురు కలసి మనలను కడిగి పవిత్రపరచే విషయములో పాలు కలిగివున్నారు.

తండ్రియైన దేవుడు ఏర్పాటు చేసుకున్నాడు. మనము దేవుని ఏర్పాటులో ఉన్నామో లేదో అనుకోవలసిన పనిలేదు. దేవుడు భవిష్యత్తు జ్ఞానమును బట్టి ఏర్పాటు చేశాడు. ప్రపంచంలో 600 కోట్లలో ఎంతమంది రక్షింపబడుదురో తండ్రికి తెలుసు. అది ఆయన ఏర్పాటు కుమారుడైన దేవుడు అవసరమైన రక్తాన్ని చిందించి మనమీద ప్రోక్షించాడు. పరిశుద్ధాత్మ దేవుడు యేసురక్తములో మనపాపములను కడిగి పరిశుద్ధపరచాడు. ఇవన్నీ ఎప్పుడు జరిగాయి. తండ్రియైన దేవుని భవిష్యద్ జ్ఞానమును బట్టి జగత్తు పునాది వేయబడక మునుపే ఏర్పరచుకున్నాడు. ( ఎఫెసీ 1:6, 7 ).

జగత్తు పునాది వేయబడక ముందే ప్రేమచేత ఏర్పాటు చేసుకున్నాడు. జగత్తుకు పునాది ఎప్పుడు? ఎంతకాలమని నిర్ణయించ వీలుగాదు. వేలు, లక్షలు గాదు. కోట్ల కొలది సంవత్సరాలు ఇంకా ఎంతో ఎక్కువ కావచ్చు. అంతకాలము మునుపే తాను సృజించబోయే మానవుడు పాపం చేస్తాడని పాపము నుండి వానిని రక్షించాలని ఆయన ఏర్పాటుచేశాడు. ఇది ఎంత విచిత్రమో గమనించండి.

ఒకనికి పెళ్ళే కాలేదు అనుకోండి. పెళ్లైన తర్వాత కుమారుడు పుడతాడు. వాడు క్రిందపడి కాళ్ళు విరగ్గొట్టుకుంటాడు అని ఒక వాకర్ కనిపెట్టుకుంటాడనుకోండి. ఎందుకయ్యా ఈ వాకర్ అంటే నాకు భవిష్యత్ జ్ఞానము ఉంది, నాకు పెళ్ళవుతుంది, నాకు కుమారుడు పుడతాడు, క్రిందపడుతాడు, కాలు విరగ్గొట్టుకుంటాడు. వారు నడవడానికి వాకర్ కావాలి, అందుకే కనిపెట్టుకున్నాను అంటే లోకులు ఏమంటారు. నీకేమయినా పిచ్చా అంటారు. ఒకవేళ నీ భవిష్యత్ జ్ఞానము నిజమయి నీ కుమారునికి కాలు విరిగితే అప్పుడే వాకర్ కనుక్కోవచ్చు గదా అంటారు.

అదే దేవుని విచిత్రమైన ప్రేమ. భూమి పునాది వేయుటకు తొందరపడలేదు. తను సృష్టించబోయే మానవుడు పాపం చేసి అపరాధి అవుతాడు అని ఎరిగిన దేవుడు పాపము నుండి మానవుని పవిత్రపరచే ఏర్పాటు చేసిన తర్వాతనే భూమికి పునాది వేశాడు.

చాలాకాలము తర్వాత మానవున్ని సృజించాడు. ఆయన భవిష్యత్ జ్ఞానమును బట్టి తలంచినట్టుగా ఆ మానవుడు పాపం చేశాడు. పాపవిమోచనకు కుమారుడైన యేసు రక్తము ప్రోక్షించాడు. ఎప్పుడు ప్రోక్షించాడు. 2000 ఏండ్లు అయిపోయింది. మనము ఎవరము ప్రాణము పెట్టలేదు. మన వయస్సుకు 40 ఏండ్లు ఉంటే, 40 ఏండ్లకు పుట్టిన వారికి 2000 ఏండ్లకు ముందే మన పాపములను కడగడానికి అవసరమైన రక్తాన్ని కార్చి సిద్ధముగా పెట్టాడు. ఈ రోజులలో 2000 ఏండ్లు ఎవరి రక్తాన్ని దాచిపెట్టారు. కాని ఆయన కార్చిన రక్తము సిద్ధముగా ఉంది.

ఎప్పుడు నీవు విశ్వసిస్తావో వెంటనే దేవుడు రక్తాన్ని నీమీద ప్రోక్షిస్తాడు. పరిశుద్ధాత్మ దేవుడు నిన్ను కడిగి పవిత్రపరుస్తాడు. ఉదా॥కు ఒక చిన్నపిల్లవాడు ఒళ్ళంతా బురదపూసుకున్నాడు. తండ్రి నీళ్ళు చేదుకొని వచ్చాడు. బిడ్డ మీద నీళ్ళు కుమ్మరించాడు. తల్లి బిడ్డ మీద చేతులుంచి కడిగి శుభ్రపరచింది. ఈవిధంగా యేసుక్రీస్తు వారు రక్తాన్ని చిందించి మనమీద ప్రోక్షించాడు. తల్లిలాగా పరిశుద్ధాత్ముడు మనపాపములను కడిగి పరిశుద్ధపరచాడు. ఎవరిని పరిశుద్ధపరుస్తాడు?

II.1 పేతురు 1:8-9 మీరు ఆయనను చూడకపోయినను ప్రేమించుచున్నారు. చూడకయే విశ్వసించుచు విశ్వాసమునకు ఫలము ఆత్మరక్షణ పొందుచున్నారు. యేసును మనము చూడలేదు. చూడకపోయినా విశ్వసించిన వారు ఆత్మరక్షణ పొందుచున్నారు. విశ్వసించిన వారిమీద కుమారుడు రక్తాన్ని ప్రోక్షిస్తున్నాడు. పరిశుద్ధాత్ముడు పాపములను కడిగి పరిశుద్ధపరుస్తున్నాడు. 1964 సం॥లో ఒక రాత్రివేళ ఈ సంగతిని నేను విశ్వసించాను. క్రీస్తుప్రభువు నామీద రక్తము ప్రోక్షించాడు. పరిశుద్ధాత్మ దేవుడు కడిగాడు. నేను పరిశుద్ధపరచబడ్డాను.

కనుక విశ్వసించిన వాడు పరిశుద్ధపరచబడుచున్నాడు. విశ్వసించుటయే దీవెన. ప్రభువును విశ్వసించారా అని అడుగుతాము. విశ్వసించాను అంటే కుమారుని రక్తము ద్వారా పరిశుద్ధాత్ముడు మిమ్మును కడిగారు అని అర్థము. విశ్వసించలేదు అంటే రక్తప్రోక్షణ, పరిశుద్ధత లేదు అని అర్థము.

1964 ఆగస్టు 24 రాత్రి నాకు పైన చెప్పిన ఈ సంగతులు అర్థము కాలేదు. దినములు గడచిన తర్వాత లేఖనాలు చదువుతూ వుండగా అర్థమైంది. విశ్వసించినపుడు

ఆ విశ్వాసానికి ఫలముగా ఆత్మరక్షణ పొందాను అని అర్థమైంది. మీ విషయము ఏమి? చిన్నలని, పెద్దలని తేడా లేదు. ఎవరైనా ఈ విషయాన్ని విశ్వసిస్తాను అంటే క్రీస్తు నీమీద రక్తం ప్రోక్షిస్తాడు, పరిశుద్ధాత్ముడు కడిగి పవిత్రపరుస్తాడు, నీవు ఆత్మరక్షణను పొందుతావు.

నన్ను ఎవరైనా రక్షించబడ్డారా అని అడిగితే అవును నా విశ్వాసానికి ఫలముగా రక్షణను పొందాను. **1964** ఆగష్టు **24**వ తారీఖున నేను రక్షింపబడ్డాను అని చెబుతాను. ఇందులో అనుమానం లేదు. ఈ విషయాన్ని **3:18** దృఢపరుస్తున్నది. ఏలయనగా మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయంలో చంపబడియు, ఆత్మవిషయములో బ్రదికింపబడి పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను.

ఒక్కసారే శ్రమపడ్డాడు. మాటిమాటికి శ్రమపడవలసిన పనిలేదు. ఫెయిలయ్యే విద్యార్థి మాటిమాటికి పరీక్షలు వ్రాయాలి. మరొకడు ఒక్కసారే పరీక్షలు వ్రాశాడు, పాసయ్యాడు. అతను మాటిమాటికి పరీక్షలు వ్రాయనవసరములేదు. అలాగే ఆయన చేసిన కార్యము సంపూర్తియైనది. ఇంక మళ్ళీ మళ్ళీ చేయవలసిన పనిలేదు. ఆయన చేసిన కార్యముపై విశ్వాసముంచితే చాలు. విశ్వాసముంచితే ఆత్మరక్షణ. ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడని యాకోబు **1:21**లో ఉన్నది. మరణమునుండి( అగ్నిగుండమునుండి) ఆత్మ రక్షించబడి అనేక పాపములు కప్పబడును అని యకోబు **5:20**లో ఉన్నది.

ఇదంతా ఆత్మరక్షణ. శరీరము ఇంకా రక్షింపబడలేదు. సుమా! నమ్మక ముందు నా శరీరము ఎట్లా వుందో ఇప్పుడు అట్లే ఉంది. నమ్మక ముందు కోపమొచ్చేది. నమ్మిన తర్వాత కూడా కోపమొస్తున్నది. నమ్మక ముందు పాపానికి శరీరము ప్రేరేపించబడేది. నమ్మిన తర్వాత ఆ ప్రేరణే ఉంది. కాని రక్షింపబడిన ఆత్మ లోపల ఉన్నాడు. నమ్మక ముందు చేసిన కార్యాలు చెయ్యకూడదు, చెయ్యకూడదు అని ఆత్మ ఘోషిస్తుందన్నాడు. ఆత్మ ద్వారా శారీరక కార్యాలు నిలిచిపోతాయి. కానీ శరీరము రక్షింపబడిన ఆత్మ ద్వారా శరీర కార్యాలు చంపగలము. శరీర రక్షణ పొందే సమయము కూడా వుంది.

మన ప్రియ ప్రభువు మరల ప్రత్యక్షమైనపుడు ఆయనను పోలిఉంటాము. 1 యోహాను 3:2. ఆయన మరల వచ్చినపుడు శరీరానికి రక్షణ కలుగుతుంది.1 కొరింథి

15:52-53లో కడబూర మ్రోగగనే....క్షయమైన శరీరము అక్షయతను ధరించుకొనును.

ప్రస్తుతము ఆత్మయందు పరిశుద్ధత దొరుకుతుంది. ఇంతవరకు నీకు ఆత్మపరిశుద్ధత లేదా? ఇపుడైనా తీర్మాణం చేయండి. యేసుక్రీస్తు ప్రభువా 2000 ఏండ్ల క్రితము నా పాపాల కొరకై రక్తము కార్చావు. పరిశుద్ధాత్మ దేవా నేను విశ్వసిస్తే కడుగుటకు సిద్ధముగా ఉన్నావు. ఇదిగో నేను విశ్వసిస్తున్నాను. నన్ను కడిగి పవిత్రపరచండి అని అడగండి. మీ రక్షణకు ఆయన రక్తము ప్రోక్షించి, అదే క్షణములో పరిశుద్ధాత్మ కడిగి పవిత్రపరుస్తాడు. ఇలాంటి తీపైన అనుభవం ఎవరికైనా లేకుంటే ఇపుడే పైవిధంగా తీర్మానించి, ప్రార్థించి రక్షింపబడండి.

రక్షింపబడినవారు పరిశుద్ధాత్మద్వారా పరిశుద్ధ పరచబడ్డారు. పరిశుద్ధాత్మ మనయందు నివసించుచు మత్సరములేకుండ చేయును. అపేక్షలులేకుండ పరిశుద్ధ జీవితము కలిగియుండుటకు సహాయము చేయును. 1 కొరింథీ. 6:11-13 ఆత్మయందు మీరు కడుగబడి, పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి అని ఉంది. రక్షింపబడడమే కాదు నీతిమంతులుగా తీర్చబడుతారు. మీలో ఎవరైనా తీర్మానం చేస్తారా నీతిమంతులుగా తీర్చబడుతారు. ఈ వచనం వ్రాసి పెట్టుకోండి. ఏ వచనం ఆధారం. 1 కొరింథీ.6:11-13 వచనము ఆదారము. పేదలకునెలకు 30 కేజీల బియ్యం ఫలానా తేదీ నుండి స్టోరులో ఇవ్వబడుతుంది అని పేపర్లో వచ్చింది. ఆ విషయాన్ని నమ్ముతామా లేదా! ఇవ్వకపోతే స్టోరు నిర్వాహకుని అడుగుతారు. దీనికి ఆధారం ఏమిటి? పేపరు ఆధారం. వారపత్రిక మీది మాటలే సత్యమైతే దేవుని గ్రంథములో వ్రాయబడిన మాటలు ఎంతసత్యము. దేవుని వచనాలను నమ్మి రక్షింపబడండి.

III .1 పేతురు 1:12 పరలోకము నుండి పంపబడిన పరిశుద్ధాత్మ వలన మీకు సువార్త ప్రకటించిన వారి ద్వారా మీకిప్పుడు ఈ సంగతులు తెలుపబడినవి. పెంతెకొస్తు దినమున పరలోకము నుండి పరిశుద్ధాత్ముడు వచ్చాడు. పరిశుద్ధాత్మ మనకు సువార్త ప్రకటించుచున్నాడు. ఇంతవరకు చెప్పబడి సువార్త వాక్యము ఎవరు చెప్పారు, పరప్రసాద్ చెబితే ప్రయోజనము ఏమీ లేదు. ఇది నా సువార్త అయితే ఏమి లాభం లేదు. ఈ మాటలు పరిశుద్ధాత్ముడు చెబుతున్నాడు.

3:19, 20 వచనాల్లో ఈ విషయము ఇంకా వివరముగా ఉంది. దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా అవిధేయులైన వారియొద్దకు అనగా చెరలో ఉన్న ఆత్మల యొద్దకు ఆయన ఆత్మరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను.

పాతనిబంధన కాలం నాటి పరిస్థితి ఏమిటి అని మీరు అడుగవచ్చు. పాతనిబంధన కాలంలో పరిశుద్ధాత్ముడు పరలోకం నుండి దిగి వస్తూ మళ్ళీ పరలోకం వెళ్ళేవాడు. కాని క్రొత్తనిబంధన కాలంలో భూలోకానికి దిగివచ్చి భూలోకంలో నిలిచి ఉన్నాడు. ప్రతిరోజు, ప్రతి నిత్యము, ప్రకటించుచూ ఉన్నాడు. అట్లే భూలోకంలో ప్రకటించబడే సువార్త అంతా పరిశుద్ధాత్ముడే ఆత్మస్వరూపిగా ఉండి ప్రకటన జరిగించు చున్నాడు. II పేతురు 1:21లో ఉన్నట్లు గ్రంథములో ప్రవచనమంతయుమనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడి పలికిరి.

IV. 1 పేతురు 2:5 యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలవములగు ఆత్మసంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధయాజకులుగా ఉండునట్లు ఆత్మ సంబంధమైన బలులను మనము అర్పించాలి. ఆ బలులు, అర్పించుటకు పరిశుద్ధయాజకులుగా ఉండాలి. ఆయన ఒకసారి పరిశుద్ధపరచాడు. అనుదిన జీవితంలో మనము పరిశుద్ధయాజకులుగా ఉండాలి. 2:9లో రాజులైన యాజక సమూహము, పరిశుద్ధజనమును దేవుని సొత్తయిన ప్రజలునై ఉన్నారు. మనలను రాజులుగా, యాజకులుగా చేశాడు. శరీరసంబంధమైన బలులు గాదు. ఇపుడు అలాంటి బలులు దేవునికి ఇష్టంలేదు. అక్షరార్థమైనవి కాక ఆత్మసంబంధమైన బలులు అర్పించాలి.

ఆయన మనలను పవిత్రపరచాడు. ఇక ఎలా ఉన్నా ఏముందిలే అనుకోకూడదు. ఆత్మసంబంధమైన బలులు అర్పించుటకు, పరిశుద్ధయాజకులుగా ఉండాలి. మనజీవితమంతా పరిశుద్ధయాజకులుగా వుండాలి. పాతనిబంధనలో దహనబలి, నైవేద్యము, సమాధానబలి, పాపపరిహారార్థబలి, అపరాధపరిహారార్థబలి మొదలగు బలులు ఉన్నాయి. ఇవి జంతువులను అర్పించడం వల్ల జరిగే బలులు. ఈ రోజులలో జంతు బలులు సరిపోవు. మనలును మనమే దేవుని కొరకై పైవిధమైన దహనబలిగా

అర్పించుకోవాలి. మనకొరకు ఏమి మిగిలించుకోకూడదు. దహనబలిలో ఎవరికి ఏమియు మిగులదు. అంతా దేవుని బలిపీఠముపై కాలిపోవాలి.

రోమా 12:1 లో సజీవ యాగముగా మీ దేహములను ఆయనకు సమర్పించుకొనుడి. మనము కాల్చుకోవలసిన పనిలేదు. బ్రదికి ఉన్నట్లే ఒక యాగముగా మిమ్మును మీరు అర్పించుకొనుడి. అదే ఆత్మసంబంధమైనది. 1 పేతు 4:2 ఇకమీదట మనుజాశలను అనుసరించి నడుచుకొనక అని ఉంది. ఇకమీదట, ఇకమీదట జ్ఞాపకము ఉంచుకోవాలి. క్రీస్తు కొరకు తప్ప మనుజాశల కొరకు జీవించకూడదు. ఎప్పుడైనా పరిశుద్ధత తప్పితే తప్పుదిద్దుకోవాలి. ఆయన యొద్ద క్షమాపణపొందాలి. ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడాలి.

ఆత్మవలన పరిశుద్ధపరచబడుట మొదటిది. పరిశుద్ధాత్మ వలన సువార్త ప్రకటించుట రెండవది. ఆత్మసంబంధమైన బలులు అర్పించుట మూడవది. ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుట నాలుగవది.

**V.**1 పేతు **2:11** ప్రియులారా మీరు పరదేశులును యాత్రికులునై ఉన్నారు గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించి అని ఉంది. మనము పరదేశులము, యాత్రికులము అని ఎరిగి ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించాలి. ఆత్మ ప్రభువు కొరకు జీవించాలంటుంది. శరీరమేమో లోకాశల వైపుకు లాగుతుంది. ఈ పోరాటంలో శరీరాశలను విసర్జించాలి. దేనిని విసర్జించాలి. అన్యజనులు మిమ్మును ఏ విషయములో దుర్మార్గులని దూషింతురో, అన్యజనులు మనలను దూషించే విషయాన్ని విసర్జించాలి. మీ సత్క్రియలను చూచి దర్శన దినమున దేవుని మహిమ పరచునట్లు మంచి ప్రవర్తన గలిగి ఉండాలి.

**VI.**1 పేతురు **4:14** క్రీస్తునామము నిమిత్తము మీరు నిందలపాలైన యెడల మహిమా స్వరూపియైన ఆత్మ అనగా దేవుని ఆత్మ మీమీద నిలుచుచున్నాడు. గనుక మీరు ధన్యులు. 1వ వచనములో మీలో ఎవడును నరహంతకుడుగా గాని, దొంగగా గాని, దుర్మార్గుడుగా గాని, పరులుజోలికి పోవువాడుగా గాని బాధ అనుభవింప తగదు.

మనము నిందితులమై బాధ అనుభవింపకూడదు. ఎవరైనా మనలను నిందిస్తే మహిమా స్వరూపియైన ఆత్మ మనమీద నిలుస్తాడు.

రోమా 8:26 అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. యుక్తముగా ప్రార్థనచేయుట ఏలాగో మనకు తెలియదు. కానీ ఉచ్చరింప శక్యము కాని మూలుగులతో ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపన చేయుచున్నాడు. ఒకవ్యక్తి బలహీనతను చూస్తే వెంటనే మనకేమనిపిస్తుంది. ఇతరుల లోపాలు కనిపిస్తాయి. ఇతరుల బలహీనతలు బాగా చూస్తాము. కాని మన బలహీనతలు చూసుకోలేము. ఇతరుల బలహీనతలను మరి నలుగురికి చెప్పుదుముకాని ఆ వ్యక్తిని తీర్చి దిద్దగలిగితే ఎంతో బావుండును.

కాని పరిశుద్ధాత్మ దేవుడు మన బలహీనతలు చూసి తప్పుపట్టడం లేదు. సహాయం చేస్తున్నాడు. మన బలహీనతల నుండి బయటికి వచ్చునట్లు సహాయం చేస్తున్నాడు. పరిశుద్ధాత్మ దేవుడు ఎంత మంచివాడు. ఆయనకు మరుగైనది ఏదీ లేదు. మన కన్నులు, ఇతరుల కన్నులు మనము కప్పవచ్చు. పరిశుద్ధాత్మ కన్నులు కప్పలేము. ఇతరుల బలహీనతలు మనము చూచినపుడు కూడా మనము సహాయము చేయాలి. మనకు అన్ని విధాలుగా సహాయంగా సహాయము చేయు పరిశుద్ధాత్ముని అనుకుని ముందుకు సాగుదాము గాక.

1 పేతురు 4:6 మృతులు శరీర విషయములో మానవరీత్యా తీర్పుపొందునట్లు ఆత్మవిషయములో దేవుని బట్టి జీవించునట్లు అని ఉంది. ఆత్మవిషయములో జీవించాలి. మనము పాపములచేత అపరాధముల చేత చచ్చియుండగా ఆయన బ్రతికించాడు. కాబట్టి ఆత్మవిషయములో జీవించాలి. నేను 40 సంవత్సరముల క్రితము రక్షించబడ్డాను. మీరు బ్రతికించబడి (రక్షించబడి) ఎక్కువ సంవత్సరములు అయివుండవచ్చు. తక్కువ సంవత్సరము అయి వుండవచ్చును. మనమందరము ఆత్మలో జీవించాలి. ఆత్మచేత శారీరక క్రియలను చంపిన యెడల జీవించెదము (రోమా 8:13).

VII. చివరిగా 2:25 చదువుకుందాము. మీరు గొర్రెల వలె దారితప్పిపోతిరి. గాని ఇపుడు ఆత్మల కాపరి అధ్యక్షుడునైన ఆయన వైపునకు మళ్ళి ఉన్నారు. ఆత్మల కాపరి యేసుక్రీస్తే. ఆయన కాపరే కాదు. మంచి కాపరి. గొప్పకాపరి. ప్రధాన కాపరి.

# యోహాను పత్రికలు యూదా పత్రికలో పరిశుద్ధాత్మ పరిచర్యలు

యోహాను మొదటి పత్రికలో ఆత్మను గూర్చి 13 పర్యాయములు కలదు. రెండవ పత్రికలో ఆత్మ అనుపదము లేదు. మూడవ పత్రికలో ఒక పర్యాయము కలదు.

మొదటి పత్రికలోనున్న 13 పర్యాయములలో ఏడు పర్యాయములు పరిశుద్ధాత్మను గూర్చినది. మిగిలిన ఆరు పర్యాయములు. 1) దేవుని సంబంధము కాని ఆత్మ (4:1), 2) క్రీస్తు విరోధి ఆత్మ (4:3), 3) భ్రమపరచు ఆత్మ (4:6), 4) యేసుని ఒప్పుకొనని ఆత్మ (4:3), 5) ప్రతి ఆత్మను నమ్మకుడి (4:1) అను పదములు కలవు. ప్రకటన 16:13-14వ. అపవిత్రాత్మలు, దయ్యముల ఆత్మలు కలవు. కనుక ఆత్మకార్యములను గమనించినపుడు ఆ కార్యములు దేవుని ఆత్మ చేయు కార్యమా లేక దేవుని సంబంధము కాని ఆత్మచేయు కార్యమా అని పరీక్షించవలెను. క్రీస్తు ఆత్మ చేయు కార్యమా లేక క్రీస్తు విరోధి ఆత్మ చేయు కార్యమా అని పరిశీలించాలి. ప్రతి ఆత్మను నమ్మకుడని (4:1)లో ఉన్నందున ఆత్మచేయు కార్యములన్నిటిని జాగ్రత్తగా పరిశీలించి దేవుని ఆత్మలేక క్రీస్తు ఆత్మచేయు కార్యములను గుర్తించగలగాలి. ప్రకృతి సంబంధులు (పరిశుద్ధ) ఆత్మలేనివారని యూదా పత్రికలోనున్నది.

పరిశుద్ధాత్మను గురించిన ఏడు ప్రస్తావనలు ఈ క్రింద కనుపరచబడినవి.

1. సత్య స్వరూపియగు ఆత్మ. (4:6).
2. ఆత్మ సత్యము. (5:6).
3. ఆయన మనకు తన ఆత్మ లోపాలు దయచేసెను. (4:13).
4. ఆయన మనయందు నిలిచియున్నాడని ఆయన మనకనుగ్రహించిన ఆత్మవలన తెలిసికొనుచున్నాము. (3:24).
5. దేవుని ఆత్మను మీరెరుగుదురు. (4:3).
6. సాక్ష్యమిచ్చువాడు ఆత్మయే. (5:6).
7. సాక్ష్యమిచ్చు వారు ముగ్గురు ఆత్మ, నీళ్ళు, రక్తము. (5:7).

**సత్యస్వరూపియగు ఆత్మ (4:6)** : యోహాను సువార్త 14:16, 14:26, 15:26, 16:8, 13లో పరిశుద్ధాత్మ ఆదరణ కర్తయని, ఉత్తరవాది (అడ్వకేట్) అని సత్య స్వరూపియగు ఆత్మ అని నాలుగు పేరులతో పిలువబడుచున్నాడు.

తండ్రి చేత ఈ లోకమునకు పంపబడునని, యేసు చేత ఈ లోకమునకు పరిశుద్ధ ఆత్మ ప్రంపబడునని వ్రాయబడినది. ఆత్మ యేసు బోధించిన విషయములు మరలా జ్ఞాపకము చేయునని (యోహాను 14:26), తనంతట తానే బోధించడని తాను వినిన సంగతులే బోధించునని (యోహాను 16:13)లో యేసును గూర్చియు సాక్ష్యమిచ్చునని యోహాను 15:26లో చూచుచున్నాము. కనుక పరిశుద్ధాత్మ యేసు ముందుగా బోధించిన సంగతులే అనగా వాక్యములో ఉన్నవే బోధించును. పరిశుద్ధ ఆత్మ పేరు ఆదరణ కర్త గనుక ఆదరణ కలిగించుమాటలే బోధించును.

భ్రమపరచు ఆత్మలు (1 యోహాను 4:6) లోకములో ఉన్నందున, ప్రతి ఆత్మను నమ్మకుడి అని 1 యోహాను 4:1లో ఉన్నందున, ఈ లోకములో ఆత్మ కార్యములుగా చెప్పబడుచున్న వాటన్నిటిని పరీక్షించాలి. క్రీస్తు విరోధి ఆత్మ (1 యోహాను 4:3) కూడా కార్యములు చేయగలడు కాన ప్రతి కార్యమును స్పష్టముగా పరీక్షించాలి.

**ఆత్మ అనుగ్రహించబడుట (3:24) ఆత్మ లోపాలు (4:13)** : ఎఫెసీ 1:13 ప్రకారము మీరు సత్య వాక్యమును అనగా మీరక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రించబడితిరి.

యోహాను 16:8లో పరిశుద్ధాత్మ ఈ లోకమునకు వచ్చి పాపమును గూర్చి నీతిని గూర్చి రాబోవు విమర్శను గూర్చి ఒప్పుకొనచేయును అని ఉన్నది. అ.కా. 2వ అధ్యాయములో పరిశుద్ధాత్మ ఈ లోకమునకు వచ్చాడు. ఆయన సత్యము (5:6) కనుక సత్యవాక్యమును మనకు వినిపించుచున్నాడు. ఆ సువార్తను విని క్రీస్తును నమ్మినపుడు వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రించబడుదుము (ఎఫెసీ. 1:13). అనగా రక్షించబడినపుడే మనకు ఆత్మ అనుగ్రహించబడెను. ఆత్మలో పాలు పొందితిమి. ఎఫెసీ. 4:30 ప్రకారము ఈ ఆత్మముద్ర విమోచన దినము వరకు ఉండును. 1 కొరింథీ. 15:52-54 ప్రకారం ప్రభువు రాకడ కడబూర మ్రోగినపుడు మన క్షయమైన దేహము

విమోచించబడి అక్షయ దేహ మగును. అంతవరకు ఆత్మ ముద్ర మనతో ఉండును. పరిశుద్ధాత్ముడు వచ్చి మీతో ఎల్లప్పుడు ఉండును, మీలో ఉండును అని యోహాను 14:16-17లో వ్రాయబడి ఉన్నది. యోహాను 16:13లో ఉన్నట్లు జీవించు కాలమంతా పరిశుద్ధాత్మ మనకు బోధించుచుండును. కనుక రక్షించబడిన వారు ప్రతి ఆత్మను నమ్మక దేవుని ఆత్మను యెరుగువారుగా నుండాలి (1 యోహాను 4:3). ఆయన కార్యములను గుర్తింపగలగాలి.

**సాక్ష్యమిచ్చువాడు ఆత్మయే (5:6)** : దేవుని కుమారుని యందు విశ్వాస ముంచువాడు తన హృదయములో పరిశుద్ధాత్ముని ద్వారా సాక్షమును కలిగి యుండును. అదేదనగా దేవుడు మనకు నిత్య జీవమును దయచేసెను. పరిశుద్ధాత్మ ఆదరణ కర్త గనుక పైన చెప్పబడిన ఆదరణకరమైన మాటలే మనకు సాక్షమిచ్చును. కేవలము నమ్ముట ద్వారానే నిత్యజీవమున్నదా అను గలిబిలిచేయు తలంపులను భ్రమపరచు ఆత్మ కలిగించునని గమనించాలి. రోమా 8:15-17 వచనాలలో మనము పిల్లలమని పరిశుద్ధాత్మ తానే మన ఆత్మతో సాక్ష్యమిచ్చుచున్నాడు. పిల్లల మైన మనము వారసులమని దేవుని తోడివారసులమని క్రీస్తు తోడి వారసులమని వివరించబడినది. క్రీస్తుకు కలిగిన వాటన్నిటికి మనము వారసులము. అందులో కొన్ని క్రింద చెప్పబడినవి.

1. రక్షణ అను స్వాస్థ్యము పొందితివి. హెబీ. 1:14.

2. నిత్యజీవమునకు వారసులము. తీతు. 3:7.

3. మహిమకు వారసులము. రోమా 8:17, ఎఫెసీ. 1:17.

4. నీతికి వారసులము. హెబ్రీ. 11:17.

5. అక్షయ శరీరమునకు వారసులము. 1 కొరింథీ. 15:52-58.

6. పరలోకమునకు వారసులము, ఫిలిప్పీ. 3:20, హెబ్రీ. 11:8,16.

7. పరిశుద్ధతకు వారసులము. రోమా 6:22.

పైన చెప్పబడిన ఆశీర్వాదములన్ని కలిగిన మనము ధన్యులమని గుర్తించి ప్రభువులో ముందుకు సాగుదుము గాక!

# ఈ పుస్తకమును గూర్చి

ఈ పుస్తక రచయితయగు టి.పి. వరప్రసాదరెడ్డి గారు తన పరిచయ పలుకుల్లో ఇలాగు పేర్కొనిరి:

"బైబిలు గ్రంథమంతటిలో సుమారు 550 పర్యాయములు క్రొత్త నిబంధన అంతటిలో సుమారు 294 పర్యాయాలు ఆత్మ ప్రస్తావన ఉన్నది. మత్తయి నుండి ప్రకటన వరకు 3వ యోహానులో తప్ప ప్రతిగ్రంథంలో ఆత్మను గురించి వ్రాయబడింది. క్రొత్త నిబంధనలోని 27 గ్రంథాలలో 260 అధ్యాయాలున్నాయి. దాదాపు 294 పర్యాయములు ఆత్మను గరించి ప్రస్తావించబడింది. అనగా సగటున ప్రతి అధ్యాయంలో ఒకసారి కన్పించుచున్నది.

పరిశుద్ధాత్మ పరిచర్య వివరణ మిమ్మును పరవశ పరచుననుట అతిశయోక్తి కాదు. రచయిత కలము నుండి వెలువడిన రూతు గ్రంథము, పరమగీతము, చిన్న ప్రవక్తల పరిచర్య మరియు సైలస్‌ఫాక్స్ అగ్రిప్ప వంటి దైవజనుల జీవిత చరిత్రలు చదువుట ద్వారా ఎందరో మేలు పొందియున్నారు. బైబిల్ విధ్యార్థులకు ఉపయోగకరమైన పుస్తకమిది.


పుస్తక రచయిత చిరునామా

**బ్రదర్ టి.పి. వర ప్రసాద రెడ్డి**

గాస్పల్ అసెంబ్లీ పబ్లిషింగ్స్,

7-270, కోర్టురోడ్,

**అనంతపురం - 515 001.**